ANN తెలుగు
Follow: @ANNTELUGU
19-06-2025
# మహా పత్రిక
గురువారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 196 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM

మంత్రి గా బాధ్యతలు స్వీకరించిన గడ్డం వివేక్ ను అభినందిస్తున్న ఆదిలాబాద్ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాసరెడ్డి



## ఇసుక మాఫియాపై ఉక్కుపాదం

**ప్రజలకు తక్కువ ధరకే ఇసుక దొరికేలా చేస్తా**

గిగ్ వర్కర్ల కోసం మంచి పాలసీ తీసుకొచ్చేందుకు కృషి చేస్తా

మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వివేక్ వెంకటస్వామి

రూ. 2600 కోట్ల నిధుల ఏటీసీ ఫైల్‌పై తొలి సంతకం చేసిన వివేక్

వివరాలు 2లో

టాప్ న్యూస్

### ఫోన్ ట్యాపింగ్ పచ్చి నిజం



- కేసీఆర్, జగన్ నా ఫోన్ ట్యాప్ చేయించారు
- ఎక్కడికి వచ్చి సాక్ష్యం చెప్పమన్న నేను సిద్ధమే
- ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల సంచలన కామెంట్స్

02

### ఎమ్మెల్సీ కవిత సంచలన నిర్ణయం



- పంచాయితీ ఎన్నికలను అడ్డుకుంటాం
- బీసీలకు 42% రిజర్వేషన్లు ఇచ్చాకే వెళ్లాలని అల్టిమేటం
- ఢిల్లీకి వెళ్లే సీఎంలలో రేవంత్ గిన్నిస్ రికార్డు అంటూ సెటైర్లు


02

### నా రెండు ఫోన్లు ట్యాప్



- సిట్ అధికారులు పిలవడంతో వచ్చా
- కాంగ్రెస్ పొలిటికల్ స్ట్రాటజిస్ట్ సైదులు గుండ్లపల్లి

03



# చంద్రబాబు.. ఆపాల్సిందే

## బనకచర్లను బరాబర్ అడ్డుకుంటాం

జగన్‌తో కలిసి బనకచర్లకు బీజం వేసింది కేసీఆరే

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ధ్వజం

బనకచర్లపై అఖిలపక్షానికి పవర్ పాయింట్ ప్రజంటేషన్

నేడు ఢిల్లీలో కేంద్రమంత్రిని కలవనున్న సీఎం రేవంత్

ప్రాజెక్టు ప్రీఫీజిబిలిటీ రిపోర్ట్‌ను తిరస్కరించాలని డిమాండ్

**హైదరాబాద్, మహా:** కేంద్రంలో పలుకుబడి ఉంది కదా అని.. అన్ని ప్రాజెక్టులకు అనుమతి వస్తుందని చంద్రబాబు అనుకోవొద్దని, తెలంగాణ ప్రయోజనాలు కాలరాసే బనకచర్లను బరాబర్ అడ్డుకుంటామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ముందుగా కేంద్రంపై ఒత్తిడి తెచ్చి పొలిటికల్ ఫైట్ చేస్తామని, అవసరమైతే న్యాయపోరాటం చేస్తామని హెచ్చరించారు. అన్ని ప్రాజెక్టులకు అనుమతులు వస్తాయనుకోవడం చంద్రబాబు భ్రమే అవుతుందన్నారు. బనకచర్లను ఎలా అడ్డుకోవాలో తమకు తెలుసని, తమ హక్కుల కోసం ఎక్కడా రాజీపడబోమని రేవంత్ అన్నారు. గోదావరిబనకచర్ల ప్రాజెక్టు విషయంపై అఖిలపక్ష ఎంపీలతో సమావేశం అనంతరం సీఎం మీడియాతో మాట్లాడారు. రాయలసీమకు గోదావరి జలాల తరలింపులో సహకరిస్తామని కేసీఆర్ స్వయంగా చెప్పారన్నారు. రాజకీయాలు ఎలా ఉన్నా రైతుల విషయంలో రాజీ పడేది లేదని స్పష్టం చేశారు. బనకచర్ల వ్యవహారంపై ఏ విధంగా ముందుకెళ్లాలనే అంశంపై విపక్షాలతో చర్చించినట్లు చెప్పారు. తెలంగాణకు గోదావరి, కృషా నదులే జీవనాధారమని, ఈ ప్రభుత్వానికి రైతుల ప్రయోజనాలే ముఖ్యమని పేర్కొన్నారు.

మిగతా 2లో

### ఫోన్ ట్యాపింగ్ కేసులో సంచలనాలు

**డీజీపీ జితేందర్‌తో పాటు అడిషనల్ డీజీపీని ప్రశ్నించిన సిట్**

కాంగ్రెస్ అంతర్గత సర్వేలు నిర్వహించిన గుండ్లపల్లి సైదులు స్టేట్ మెంట్ రికార్డు

సిట్ ముందుకు రానున్న ముగ్గురు బీజేపీ ఎంపీలు..

త్వరలో ముఖ్యమంత్రి కుటుంబసభ్యుల స్టేట్ మెంట్లు రికార్డు చేసే అవకాశం



**హైదరాబాద్, మహా:** ఫోన్ ట్యాపింగ్ కేసులో సంచలన పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. అప్పటి హోమ్ ప్రిన్సిపల్ సెక్రటరీ, ప్రస్తుత డీజీపీ జితేందర్‌తో పాటు నాటి ఇంటెలిజెన్స్ చీఫ్, ప్రస్తుత అడిషనల్ డీజీపీ అనిల్ కుమార్‌ను సిట్ ప్రశ్నించింది. జితేందర్, అనిల్ కుమార్ వద్ద నుండి సిట్ స్టేట్మెంట్ రికార్డు చేసింది. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో రివ్యూ కమిటీలో జితేందర్, అనిల్ కీలక సభ్యులుగా ఉన్నారు. దీంతో వారి స్టేట్మెంట్ కీలకంగా మారనుంది. ఇదిలా ఉంటే రాష్ట్రంలో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న ప్రభాకర్ రావు విచారణ జరుగుతుండటంతో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి.

మిగతా 2లో


## 2025 కల్లా 1 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ

**ప్రపంచంలోనే పెట్టుబడులకు తొలి ఎంపిక తెలంగాణ**

- గూగుల్ ఇన్నోవేటివ్ కంపెనీ మీది.. మాది ఇన్నోవేటివ్ ప్రభుత్వం: సీఎం రేవంత్
- గూగుల్ సేఫ్టీ ఇంజినీరింగ్ సెంటర్‌ను ప్రారంభించిన ముఖ్యమంత్రి
- బ్రహ్మోస్ ఏరోస్పేస్ విస్తరణకు హైదరాబాద్‌ను ఎంచుకోండి
- సీఎం రేవంత్ రెడ్డితో బ్రహ్మోస్ ఏరోస్పేస్ సంస్థ ప్రతినిధులు భేటీ

03





### జూబ్లీహిల్స్ బై పోల్

- బరిలో టీడీపీ అభ్యర్థిగా నందమూరి వారసురాలు
- ఏపీతో పాటు తెలంగాణలో విస్తరించేందుకు కూటమి అడుగులు
- సానుకూలంగా ఉన్న బీజేపీ

వివరాలు 2లో

### హరీశ్, ఈటల ఎన్నిసార్లు కలిసారో చెప్పనా?

ఎక్స్‌లో టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు

వివరాలు 3లో

## మొబైల్ ఫోన్ ఇచ్చిదే లేదు!

**నా ఫోన్, ల్యాప్‌ట్యాప్ ఎలా అడుగుతారు?**

ప్రాథమిక హక్కులకు, వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించడమే

ఏసీబీకి లేఖ రాసిన మాజీ మంత్రి కేటీఆర్


**హైదరాబాద్, మహా:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఫార్ములాఈ కార్ రేసు వ్యవహారానికి సంబంధించి తన సెల్‌ఫోన్‌ను అప్పగించాలంటూ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) జారీ చేసిన నోటీసుపై ఆయన స్పందించారు. ఈ మేరకు ఆయన ఏసీబీ అధికారులకు ఒక లేఖ రాశారు. ఫార్ములాఈ కార్ రేసు నిర్వహణలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై ఏసీబీ విచారణ జరుపుతున్న విషయం విదితమే. ఈ క్రమంలోనే కేటీఆర్‌ను కూడా అధికారులు విచారిస్తున్నారు.

మిగతా 3లో



### మారేడుమిల్లి అడవుల్లో భారీ ఎన్‌కౌంటర్

- ముగ్గురు మావోయిస్టులు మృతి
- అగ్రనేత రావి వెంకట చైతన్య అలియాస్ అరుణ హతం



02






# చంద్రబాబు.. ఆపాల్సిందే

(మొదటిపేజీ తరువాయి)

తెలంగాణ ప్రయోజనాల కోసం ఎవరితోనైనా కొట్లాడుతామన్నారు. తమ హక్కులు అడ్డు వస్తే రాజకీయంగా పోరాడుతాం, న్యాయస్థానాలను ఆశ్రయిస్తామని చెప్పారు. ఈ వ్యవహారంపై సీఎం రేవంత్ రెడ్డి గురువారం ఢిల్లీలో కేంద్ర జలశక్తి మంత్రి సి.ఆర్. పాటిల్‌తో సమావేశమై ఈ ప్రాజెక్టు ప్రీఫీజిబిలిటీ రిపోర్ట్‌ను తిరస్కరించాలని, టెండర్లను ఆపాలని కోరనున్నారు.

### మాకు ఎన్ ఓసి ఇవ్వండి

కృష్ణా బేసిన్ లో 500 టీఎంసీలకు, గోదావరి బేసిన్ లో 1000 టీఎంసీలకు ఎన్ వోసీ ఇస్తే బనకచర్లకు ఎలాంటి అభ్యంతరాలు చెప్పబోమన్నారు రేవంత్. తమ ప్రాజెక్టుల్లో నీళ్లు లేకుండా మిగులు జలాలు ఉన్నాయంటున్నారు..కృష్ణా జలాల్లో పదేళ్లలో 299 టీఎంసీలు ఏనాడైనా వాడారా అని ప్రశ్నించారు. కేసీఆర్ చేసిన ద్రోహం వల్ల ఏపీకి నీళ్లు వస్తున్నాయన్నారు . ఐదు నెలలుగా తెలంగాణ అభ్యంతరాలతోనే బనకచర్ల అనుమతిపై కేంద్రం పునరాలోచనలో పడిందని రేవంత్ అన్నారు. నీళ్లపై తెలంగాణకు నష్టం చేసింది కేసీఆరేనని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. సర్వపాపాలు చేసింది కేసీఆర్,హరీశేనన్నారు. 2016లోనే బనకచర్లకు బీజం పడిందని..ఈ పాపానికి పునాది వేసింది కేసీఆరేనని రేవంత్ అన్నారు.

### కేసీఆర్ వీడియోలు.. మీడియా ముందు ప్రదర్శన

గతంలో కేసీఆర్ మాట్లాడిన వీడియోను మీడియా ముందు సీఎం రేవంత్ ప్రజంట్ చేశారు. బనకచర్ల ప్రాజెక్టు లక్ష్యం 200 టీఎంసీలు కాదు 300 టీఎంసీలు.. ఆనాడు 400 టీఎంసీలు తరలించవచ్చని కేసీఆర్ ప్రతిపాదించారని తెలిపారు. జగన్ ,కేసీఆర్ నాలుగు సార్లు సమావేశమయ్యారు.. ఓ కాంట్రాక్టర్ వాళ్లిద్దరి సమావేశం ఏర్పాటు చేశారని చెప్పారు. తుమ్మిడి హట్టి దగ్గర ప్రాజెక్ట్ కడితే రాష్ట్రం సస్యశ్యామలం అయ్యేదని చెప్పారు. ప్రాజెక్టుల పేరుతో కాంట్రాక్టులకు రూ. 2 లక్షల కోట్లు ఖర్చు చేశారని వెల్లడించారు. లక్ష కోట్లు పెట్టి కాళేశ్వరం కడితే లక్ష ఎకరాలకు కూడా నీళ్లియ్యలేదని విమర్శించారు. మూడేండ్లలో కాళేశ్వరం కడితే కూలిపోయిందన్నారు. దక్షిణ తెలంగాకు కేసీఆర్ ద్రోహం చేశారని విమర్శించారు.

### ఆ నాడే అంకురార్పణ

“2192016న కేంద్ర ప్రభుత్వం అపెక్స్ కౌన్సిల్ సమావేశం నిర్వహించింది. ఏటా 3వేల టీఎంసీల నీరు వృథాగా గోదావరి నీరు సముద్రంలో కలుస్తోందని అపెక్స్ కౌన్సిల్ భేటీలో కేసీఆర్ అన్నారు. 3వేల టీఎంసీలు వృథాగా పోతున్నాయని మొదట మాట్లాడింది కేసీఆరే. అపెక్స్ కౌన్సిల్ భేటీలో ఎవరు ఏం మాట్లాడారో అంతా దస్త్రాల రూపంలో ఉంది. రాయలసీమకు గోదావరి జలాల తరలింపుపై చర్చించుకున్నామని ఆనాడు తెలంగాణ, ఏపీ మంత్రులు మీడియాకు చెప్పారు. గోదావరిబనకచర్లపై అవసరమైతే సుప్రీంకోర్టుకైనా వెళ్లాలని భావిస్తున్నాం. నీటి ఒప్పందాలపై నిపుణులైన న్యాయవాదులను నియమించుకుంటాం. రాష్ట్ర ప్రయోజనాలు కాపాడుకునేందకు అన్ని ప్రయత్నాలు చేస్తాం. గోదావరి బనకచర్లను వ్యతిరేకిస్తూ తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని నిర్ణయించాం. అన్ని పార్టీలను కలుపుకొని పోరాడుతాం. తెలంగాణకు కృష్ణాలో 299 టీఎంసీలు సరిపోతాయని ఆనాడు కేసీఆర్ ఒప్పుకొని సంతకం చేశారు. ఆనాడు కేసీఆర్ చేసిన సంతకం ఇవాళ తెలంగాణకు ప్రతిబంధకంగా మారింది” అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

### సీఎం వ్యాఖ్యలు ఖండించిన బిఆర్ఎస్ ఎంపీ

మీడియా సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై అఖిలపక్ష సమావేశంలో పాల్గొన్న బీఆర్ఎస్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర అభ్యంతరం తెలిపారు. ఆనాడు తెలంగాణ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని కేసీఆర్ మాట్లాడారని వివరణ ఇచ్చారు. కృష్ణానదిని కలుపుతూ గోదావరి జలాలు తీసుకెళ్తే అభ్యంతరం లేదని కేసీఆర్ అన్నారని గుర్తు చేశారు. సమావేశం పూర్తిగా రాజకీయ దురుద్దేశంతో జరుగుతోందన్నారు.

## రేవంత్ కీలక కామెంట్స్

- బనకచర్లపై అఖిలపక్షంలో ఎంపీల అభిప్రాయం తీసుకున్నాం
- బనకచర్లపై పోరాటానికి అన్ని అంశాలు చర్చించాం
- ఈ భేటీలో ఎలాంటి రాజకీయాలకు తావు లేదు
- గోదావరి జలాల్లో తెలంగాణకు జరిగే అన్యాయాన్ని వివరించాం
- భవిష్యత్ కార్యాచారణపై ఎంపీల సూచనలు కోరాం
- రాష్ట్రానికి ఏ కష్టమొచ్చిన బీఆర్ఎస్ రాజకీయ ప్రయోజనం కోరుకుంటోంది
- గత పదేళ్లలో ఒకే కుటుంబానికి చెందిన వాళ్లు ఈ శాఖ చూశారు
- కేసీఆర్ ఐదేళ్లు,హరీశ్ రావు ఐదేళ్లు పనిచేశారు
- బురద జల్లడం ద్వారా ప్రభుత్వాన్ని దోషిగా నిలబెట్టే ప్రయత్నం చేస్తున్నారు
- 2016 అపెక్స్ కౌన్సిల్ మినిట్స్ హరీశ్ కు పంపిస్తాం
- గోదావరి జలాలను కృష్ణాకు తరలించాలని కేసీఆర్ చెప్పారు
- సీమకు నీళ్లివ్వాలన్న పునాది 2016లోనే పడింది
- సముద్రంలో 3వేల టీఎంసీలు కలుస్తాయని.. కృష్ణా బేసిన్ కు తరలించవచ్చని కేసీఆర్ చెప్పారు.
- కేసీఆర్, జగన్ నాలుగు సార్లు భేటీ అయ్యారు. గోదావరి జలాలను ఇరు రాష్ట్రాలు పంచుకోవాలని చర్చించారు
- బనకచర్లకు ఆనాడే బీజం వేశారు. కృష్ణాజలాలు, బనకచర్లపై బీఆర్ఎస్ ప్రజలను తప్పుదోవ పట్టిస్తోంది
- బేసిన్ లు లేవు, బేషాజాలు లేవని కేసీఆర్ అన్నారు. ఏపీ బనకచర్ల ప్రాజెక్టు ప్రతిపాదన రాగానే బీఆర్ఎస్ మాట మారుస్తోంది
- బనకచర్ల ప్రాజెక్టు లక్ష్యం 200 టీఎంసీలు కాదు 300 టీఎంసీలు.
- ఆనాడు 400 టీఎంసీలు తరలించవచ్చని కేసీఆర్ ప్రతిపాదించారు
- సర్వపాపాలు చేసింది కేసీఆర్,హరీశే. ఈ పాపానికి పునాది వేసింది కేసీఆర్
- నేను ఉత్తమ్..జలశక్తి మంత్రికి ఫిర్యాదు చేశాం. బనకచర్లపై మేం మొదటి నుంచి పోరాడుతున్నాం

# ఇసుక మాఫియాపై ఉక్కుపాదం

## ప్రజలకు తక్కువ ధరకే ఇసుక దొరికేలా చేస్తా

గిగ్ వర్కర్ల కోసం మంచి పాలసీ తీసుకొచ్చేందుకు కృషి చేస్తా

మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వివేక్ వెంకటస్వామి

రూ. 2600 కోట్ల నిధుల ఏటీసీ ఫైల్‌పై తొలి సంతకం చేసిన వివేక్



**హైదరాబాద్, మహా:** రాష్ట్ర కార్మిక, ఉపాధి, శిక్షణ, కర్మాగారాలు, గనులు అండ్ భూగర్భ శాఖ మంత్రిగా గడ్డం వివేక్ వెంకటస్వామి బుధవారం బాధ్యతలు స్వీకరిచారు. సెక్రటేరియట్‌లోని సెకండ్ ఫ్లోర్‌లో తనకు కేటాయించిన చాంబర్ లో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం కార్యాలయంలోకి అడుగు పెట్టారు. అంతకు ముందు తన చాంబర్‌కు వచ్చిన మంత్రికి వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే వినోద్, ఆదిలాబాద్ కాంగ్రెస్ ఇన్ ఛార్జి కంది శ్రీనివాసరెడ్డి, ఆడెగజేందర్, అడ్డి భోజారెడ్డి, ఎమ్మెల్సీ దండె విఠల్, పురాణం సతీష్ తదితరులు వివేక్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

**ఏటీసీ ఫైల్‌పై తొలి సంతకం...**

మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి బాధ్యతలు స్వీకరించిన తర్వాత కొత్త అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్‌ల (ఏటీసీ) ఫైల్‌పై వివేక్ తొలి సంతకం చేశారు. రూ. 2600 కోట్ల నిధులకు సంబంధించిన ఫైల్ పై ఆయన సంతకం చేశారు. కాగా రాష్ట్రంలోని ఐటీఐలన్నింటిని ఏటీసీలుగా అప్ గ్రేడ్ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గతంలోనే నిర్ణయించారు. ఐటీఐలు లేని చోట ఏటీసీలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

**గిగ్ వర్కర్ల హక్కుల కోసం..**

ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తన తండ్రి కాకా వెంకటస్వామి అడుగు జాడల్లో ముందుకు వెళ్తానన్నారు. కార్మికులకు చేసిన సేవలు మరువలేనివని అన్నారు. కార్మికుల సమస్యలపై తనకు అవగాహన ఉందని.. గిగ్ వర్కర్ల కోసం మంచి పాలసీ తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని చెప్పారు. గిగ్ వర్కర్ల హక్కుల కోసం ఎక్స్‌పర్ట్స్‌తో కాన్ఫరెన్స్ పెడుతామన్నారు. నైపుణ్య శిక్షణ పెంచితేనే ఉపాధి కల్పన జరుగుతోందని.. ఇందులో భాగంగానే రాష్ట్రంలో రూ.2600 కోట్లతో 45 అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లు ప్రారంభిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోని బొగ్గు గనుల వేలంలో సింగరేణి సంస్థ పాల్గొంటుందని స్పష్టం చేశారు. బొగ్గు గనుల కేటాయింపు కంటే.. వేలంలో పాల్గొంటేనే బెటర్ అని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇక, రాష్ట్రంలో సాండ్ మాఫియా ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. ప్రజలకు తక్కువ ధరకే ఇసుక దొరికేలా కృషి చేస్తామన్నారు. తన నియోజకవర్గం చెన్నూరులో ఇసుక అక్రమ రవాణా అరికట్టామని పేర్కొన్నారు.

# మారేడుమిల్లి అడవుల్లో భారీ ఎన్‌కౌంటర్

## ముగ్గురు మావోయిస్టులు మృతి


### అగ్రనేత రావి వెంకట చైతన్య అలియాస్ అరుణ హతం

**ఏపీ, మహా:** అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అడవుల్లో బుధవారం తెల్లవారుజామున జరిగిన భారీ ఎన్ కౌంటర్ జరిగింది. ఇందులో మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు సహా ముగ్గురు మావోయిస్టులు హతమయ్యారు. ఎన్ కౌంటర్‌లో కేంద్ర కమిటీ సభ్యుడు గాజర్ల రవి అలియాస్ ఉదయ్‌తో పాటు మరో మావోయిస్టు అగ్రనేత రావి వెంకట చైతన్య అలియాస్ అరుణ, మరో మావోయిస్టు నేత కూడా హతమయ్యారు.

**మోస్ట్ వాంటెండ్ లిస్ట్‌లో పేర్లు..**

అరుణ భర్త అయిన ప్రతాపరెడ్డి రామచంద్రారెడ్డి అలియస్ చలపతి ఒడిశా సరిహద్దులో ఎన్ కౌంటర్ అయిన సంగతి తెలిసిందే. ఆయన పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడిగా ఉన్నారు. ఆయన భార్య అయిన చైతన్య అలియాస్ అరుణ బుధవారం జరిగిన ఎన్ కౌంటర్‌లో ప్రాణాలు కోల్పోయారు. ఇక గాజర్ల రవి ఆంధ్రాఒడిశా బోర్డర్ స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శిగా ఉండగా, అరుణ కమిటీలో సభ్యురాలిగా ఉన్నారు. ఆంధ్రాఒడిశా సరిహద్దుల్లో మావోయిస్టు కార్యకలాపాలకు నేతృత్వం వహిస్తున్న ఈ ఇద్దరు మావోయిస్టు నేతలు జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) మోస్ట్ వాంటెడ్ జాబితాలో ఉన్నారు. గాజర్ల రవిపై రూ.20 లక్షల రివార్డు ఉంది.

**గ్రేహౌండ్స్ కూంబింగ్..**



మారేడుమిల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని దేవీపట్నం అటవీ ప్రాంతంలోని కొండమోడలు గ్రామంలో ఈ ఎన్ కౌంటర్ జరిగినట్లు ఓ పోలీసు ఉన్నతాధికారి తెలిపారు. ఈ ప్రాంతంలో మావోయిస్టుల ఉనికిపై మంగళవారం సాయంత్రం పోలీసులకు అందిన సమాచారం మేరకు భద్రతా బలగాలు గాలింపు చర్యలు చేపట్టాయి. ఎలైట్ గ్రేహౌండ్స్ యూనిట్ నిర్వహించిన ఈ ఆపరేషన్‌లో మావోయిస్టులతో భీకర ఎదురుకాల్పులు జరిగాయని, దీంతో మావోయిస్టులకు భారీ నష్టం వాటిల్లిందని చెప్పారు. ఎన్ కౌంటర్ జరిగిన ప్రాంతం నుంచి మూడు ఏకే47 రైఫిళ్లు, ఇతర ఆయుధాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారని అధికారులు తెలిపారు. ఎదురుకాల్పుల అనంతరం పలువురు మావోయిస్టు నేతలు అక్కడి నుంచి పారిపోయినట్లు తెలుస్తోంది. ఈ ప్రాంతంలో మరింత మంది మావోయిస్టులు ఉన్నట్లు ఇంటెలిజెన్స్ నివేదికల నేపథ్యంలో మారేడుమిల్లి అడవుల్లో గ్రేహౌండ్స్ కూంబింగ్ కొనసాగుతోంది.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో సంచలనాలు

(మొదటిపేజీ తరువాయి)

మావోయిస్టు సానుభూతిపరుల పేరుతో ఫోన్ ట్యాపింగ్ జరిగినట్టు విచారణతో తేలింది. త్వరలో ముఖ్యమంత్రి కుటుంబసభ్యుల స్టేట్ మెంట్లు కూడా రికార్డు చేసే అవకాశాలున్నట్లు తెలుస్తోంది.

### సంచలనంగా సైదులు స్టేట్ మెంట్

కాంగ్రెస్ పార్టీ అంతర్గత సర్వేలు నిర్వహించే సైదులు ముఖ్యమంత్రి రేవంత్ కు సన్నిహితుడిగా పేరుంది. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీకి అంతర్గత సర్వేలు అనేకం నిర్వహించారు. ఏఐసిసికి, పార్టీ సీనియర్లకు సన్నిహితంగా ఉండే సైదులుకు చెందిన రెండు ఫోన్లు ట్యాప్ అయ్యాయన్న ప్రచారం సంచలనంగా మారింది. కాంగ్రెస్ పార్టీ నుండి 650మందికి ఫోన్లు ట్యాప్ కాగా, అంతర్గత సర్వేలు నిర్వహించిన వారిలో ఒక్క సైదులు ఫోన్ పై మాత్రమే నిఘా పెట్టినట్లు తెలుస్తోంది. బుధవారం తన స్టేట్ మెంటను సైదులు ఇచ్చారు.

### సిట్ ముందుకు బీజేపీ ఎంపీలు

తెలంగాణలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ ముందుకు బీజేపీ ఎంపీలు హాజరు కానున్నారు. ఈటల రాజేందర్, అర్వింద్, రఘునందన్ రావులు సిట్ విచారణకు హాజరయ్యే అవకాశం ఉంది. గత ఎన్నికల్లో ఈ ముగ్గురి ఫోన్లు ట్యాపింగ్ చేసినట్లు సిట్ అధికారులు గుర్తించారు. ఫోన్లు ట్యాపింగ్ చేసినట్లు సిట్ ఆధారాలు సేకరించింది. బీజేపీ నేతల అనుచరుల ఫోన్లు సైతం ట్యాపింగ్ అయినట్లు గుర్తించింది. బీజేపీ నేతలకు ఆర్థిక సాయం చేసిన వారి ఫోన్లు సైతం ట్యాపింగ్ చేసినట్లు సిట్ సమాచారం సేకరించింది. బీజేపీ నేతల కదలికలను ఎప్పటికప్పుడు ప్రభాకర్ రావు టీమ్ తెలుసుకున్నట్లు సిట్ అధికారులు గుర్తించారు. తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఇప్పటికే చాలామంది నిందితులను అరెస్ట్ చేశారు. వారిచ్చిన సమాచారంతో ప్రధాన సూత్రధారిగా ఉన్న ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావుని అమెరికా నుంచి ఇండియాకు తీసుకు రావడం జరిగింది. ఇప్పటికే మూడు సార్లు ప్రభాకర్ రావుని సిట్ అధికారులు విచారించారు. ఈ కేసులో నిందితుల దగ్గరి నుంచి తీసుకున్న కొంత ఎవిడెన్స్ తో పాటు కొంత కాల్ డేలా ఆధారంగా.. వారు ఎవరెవరి ఫోన్లు ట్యాప్ చేశారు? ఎవరెవరితో సంబంధాలు ఏర్పరచుకున్నారు? ఎవరెవరిని ఇబ్బందులకు గురి చేశారు? అన్నదానిపై పూర్తిగా ఇప్పటికే సిట్ అధికారులు కాల్ డేటాను సేకరించారు. అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్, బీజేపీ నేతల ఫోన్లను ట్యాప్ చేసినట్లుగా సిట్ అధికారులు ఆధారాలు సేకరించారు.

# ఫోన్ ట్యాపింగ్ పచ్చి నిజం

## కేసీఆర్, జగన్ నా ఫోన్ ట్యాప్ చేయించారు

ఎక్కడికి వచ్చి సాక్ష్యం చెప్పమన్న నేను సిద్ధమే

ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల సంచలన కామెంట్స్

**విశాఖపట్నం, మహా:**



తెలంగాణలో సంచలనం సృష్టిస్తున్న ఫోన్ ట్యాపింగ్ కేసుపై ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల సంచలన వ్యాఖ్యలు చేశారు. బుధవారం విశాఖపట్నంలో మీడియాతో మాట్లాడిన ఆమె.. ఫోన్ ట్యాపింగ్ జరిగింది వాస్తవమేనని స్పష్టం చేశారు. వైసీపీ నేత వైసీపీ సుబ్బారెడ్డి.. ట్యాప్ చేసిన ఆడియోలు స్వయంగా తనకే వినిపించాడని గుర్తు చేశారు. ఈ కేసులో తాను ఎక్కడికి వచ్చి సాక్ష్యం చెప్పమన్న చెప్పడానికి సిద్ధంగా ఉన్నానని వైఎస్ షర్మిల స్పష్టం చేశారు. కేసీఆర్ జగన్ సంబంధాల ముందు రక్త సంబంధం కూడా పనికిరాలేదని ఓ ప్రశ్నకు బదులిచ్చారు. 201819 పొలిటికల్ టైమ్‌లో తెలంగాణ సీఎంగా కేసీఆర్, ఏపీ సిఎం జగన్‌గా ఉన్నప్పుడు చాలా సన్నిహితంగా ఉండే వారని గుర్తు చేశారు. ఈ పోన్ ట్యాపింగ్ వ్యవహారం ఈ ఇద్దరి సీఎంల జాయింట్ ఆపరేషన్ అని ఆమె అభివర్ణించారు. దోషులకు శిక్ష పడాలని ఆమె డిమాండ్ చేశారు.

**నా రాజకీయ భవిష్యత్ నాశనం..**

నా రాజకీయ భవిష్యత్ నాశనం చేయటానికే ఈ ఫోన్ ట్యాపింగ్ చేయించారని ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల మండిపడ్డారు. నాకు అండగా నిలబడ్డా వారికి సైతం బెదిరింపులు చేశారని గుర్తు చేశారు. నేను ఊపిరి తీసుకోవడమే కష్టమన్నట్లుగా వైఎస్ జగన్ వ్యవహరించారన్నారు. ఫోన్ ట్యాపింగ్ జరిగిన మాట వాస్తమని ఆమె ప్రకటించారు. అప్పుడు చేయలేని పోరాటం ఇప్పుడు చేయడానికి తాను సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. ఏ ఎంక్వైరీకైనా సిద్ధంగా ఉన్నానన్నారు. నేను ఫిర్యాదు చేయాలనుకుంటే ఆస్తులు పంచిన రోజే ఫిర్యాదు చేసే దానిని ఆమె పేర్కొన్నారు. ఫోన్ ట్యాపింగ్‌పై దర్యాప్తు పూర్తి స్థాయిలో జరగాలని ఈ సందర్భంగా వైఎస్ షర్మిల ఆకాంక్షించారు.

# జూబ్లీహిల్స్ బై పోల్

- బరిలో టీడీపీ అభ్యర్థిగా నందమూరి వారసురాలు
- ఏపీతో పాటు తెలంగాణలో విస్తరించేందుకు కూటమి అడుగులు
- సానుకూలంగా ఉన్న బీజేపీ

**హైదరాబాద్, మహా :** తెలంగాణలో త్వరలో ఉప ఎన్నిక జరుగనుంది. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణంతో ఆ స్థానానికి ఉప ఎన్నిక అనివార్యంగా కనిపిస్తోంది. ఈ మేరకు ఇప్పటికే పార్టీలు చర్చలు మొదలు పెట్టాయి. సిట్టింగ్ సీటును బీఆర్ఎస్ కాపాడుకోవటానికి సెంటిమెంట్ అస్త్రం బయటకు తీస్తోంది. కంటోన్మెంట్ తరహాలోనే ఈ సీటులో పాగా వేయాలని కాంగ్రెస్ కసరత్తు చేస్తోంది. అనూహ్యంగా ఈ బైపోల్ లో టీడీపీ పోటీ చేయటానికి సిద్ధం అవుతున్నట్లు తెలుస్తోంది. మిత్రపక్షాలు జనసేనతో పాటుగా బీజేపీతో చర్చలు సాగుతున్నాయి. అభ్యర్థిపైనా ఒక అంచనాకు వచ్చినట్లు పార్టీ ముఖ్య నేతల సమాచారం. సిట్టింగ్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణంతో జూబ్లీ హిల్స్ బైపోల్ పైన ప్రధాన పార్టీలు చర్చలు.. లెక్కలు మొదలు పెట్టాయి. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక అక్టోబర్లో కానీ నవంబర్ నెలాఖరులో జరిగే అవకాశం ఉంది. దీనికి సంబంధించి సెప్టెంబర్ లో షెడ్యూల్ విడుదల అవుతుందని అంచనా. కంటోన్మెంట్ సీటు తరహాలోనే జూబ్లీహిల్స్ స్థానం దక్కించుకోవాలని కాంగ్రెస్ భావిస్తోంది. ఇప్పటికే ఈ స్థానంలో పరిస్థితుల అధ్యయనం.. నిర్ణయాల కోసం పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వర రావు, వివేక్ తో సీఎం రేవంత్ ఒక కమిటీ ఏర్పాటు చేసారు. 2009 లో ఏర్పాటు అయిన ఈ నియోజకవర్గం నుంచి మాగంటి గోపీనాథ్ మూడు సార్లు గెలిచారు. 2014 లో టీడీపీ నుంచి గెలవగా, ఆ తరువాత బీఆర్ఎస్ లోకి వెళ్లారు. 2018,2023 ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి గెలుపొందారు. ఖైరతాబాద్ నుంచి విడిపోయి 2009 లో జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఏర్పాటు అయింది. 2009 లో పీ విష్ణువర్ధన్ రెడ్డి కాంగ్రెస్ ఎమ్మెల్యేగా గెలిచారు. ఇక, ఇప్పుడు బైపోల్ లో కాంగ్రెస్ నుంచి అజారుద్దీన్, పీజేఆర్ కుమార్తె విజయా రెడ్డి, నవీన్ యాదవ్ పేర్లు పరిశీలనలో ఉన్నాయి. ఇక్కడ ముస్లిం మైనార్టీ ఓటింగ్ కీలకం. కాంగ్రెస్ ఎంఐఎం మధ్య పోటీ పైన అంగీకారం కుదిరితే మొత్తం లెక్కే మారిపోవటం ఖాయంగా కనిపిస్తోంది. అయితే, మాగంటి గోపీనాథ్ కుటుంబం నుంచే తమ పార్టీ అభ్యర్థిగా పోటీలో నిలపాలని బీఆర్ఎస్ భావిస్తోంది. సాధ్యం కాకుంటే మాజీ ఎమ్మెల్యే విష్ణుకు సీటు కేటాయించే ఛాన్స్ ఉంది. ఈ సారి అనూహ్యంగా టీడీపీ సైతం ఈ నియోజకవర్గంలో పోటీకి సిద్ధం అవుతున్నట్లు తెలుస్తోంది. నియోజకవర్గంలో సామాజిక సమీకరణాలు.. ప్రస్తుత పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని భావిస్తున్నారు. గోపీనాథ్ మరణం సమయంలో ఏపీ మంత్రి లోకేష్ మాగంటి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఏపీలో సక్సెస్ అయిన ఎన్డీఏను తెలంగాణలోనూ విస్తరించాలనే ప్రతిపాదన ఉంది. త్వరలో గ్రేటర్ ఎన్నికలు జరగనున్నాయి. దీనికి ముందు జరుగుతున్న ఈ ఎన్నికతోనే పొత్తు ప్రారంభించాలనే ఆలోచన జరుగుతోంది. దీంతో, జూబ్లీహిల్స్ బైపోల్ లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థిని బరిలో నిలపాలని భావిస్తున్నారు. అందులో భాగంగా టీడీపీ నుంచి నందమూరి



సుహాసిని పేరు పరిశీలనలో ఉందని పార్టీలో ప్రచారం సాగుతోంది. టీడీపీలో సుహాసిని గత కొంత కాలంగా క్రియాశీలకంగా ఉన్నారు. నందమూరి వారసురాలిగా సీటు ఇస్తే కలిసి వస్తుందని అంచనా వేస్తున్నారు. బీజేపీ సైతం ఇక్కడ నుంచి దీపక్ రెడ్డిని పోటీలో దింపాలని భావిస్తోంది. ప్రస్తుతం చర్చల స్థాయిలో ఉన్న ఈ ప్రతిపాదనలపైన మూడు పార్టీల అధినాయకత్వం చర్చించి.. తుది నిర్ణయం తీసుకోనుంది. ఇదే జరిగితే హైదరాబాద్ కేంద్రంగా కొత్త రాజకీయం మొదలు కానుంది. కూటమి అభ్యర్థిని బరిలోకి దింపితే పూర్తి స్థాయిలో సహకరించేందుకు బీజేపీ సిద్దంగా ఉంది. ఇప్పటికే దీపక్ రెడ్డి అభ్యర్థిత్వం విషయంలో సిట్టింగ్ ఎమ్మెల్యే రాజాసింగ్ తన వ్యతిరేకతను తెలిపారు. దీపక్ రెడ్డిని తప్పిస్తే మరో భలమైన అభ్యర్థి బీజేపీకి కనిపించడం లేదు. ఒకరిద్దరు నేతలు పోటీకి సంసిద్దత వ్యక్తం చేస్తున్నా ప్రజల్లో వారి పరిచయం నామమాత్రంగా ఉందని కాషాయ పార్టీ భావిస్తోంది. ఈ నేపథ్యంలో కూటమి అభ్యర్థిని రంగంలోకి దింపితే అన్ని రకాలుగా కలిసి వస్తుందని బీజేపీ నేతలు భావిస్తున్నారు. అంతేకాకుండా కూటమిని తెలంగాణలోనూ విస్తరించాలని గత కొంత కాలంగా అధిష్టానం భావిస్తున్నందున అందివచ్చిన అవకాశాన్ని వదులుకోవద్దన్నది బీజేపీ భావనగా కనిపిస్తోంది. ఏపీలో బీజేపీ బలపడేందుకు టీడీపీ, జనసేనలు సహకరించిన నేపథ్యంలో తెలంగాణలో మరోసారి టీడీపీకి ఎంట్రీకి సహకరిస్తే తప్పేంటన్న వాదన కూడా బీజేపీలో బలంగా వినిపిస్తోంది.

# ఎమ్మెల్సీ కవిత సంచలన నిర్ణయం

## పంచాయితీ ఎన్నికలను అడ్డుకుంటాం

- బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చాకే వెళ్లాలని అల్టిమేటం
- ఢిల్లీకి వెళ్లే సీఎంలలో రేవంత్ గిన్నిస్ రికార్డు అంటూ సెటైర్లు




**హైదరాబాద్, మహా:** బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించకుండా ఎన్నికలకు వెళ్తే గ్రామ గ్రామాన వందలాది నామినేషన్లు వేపిస్తామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత అన్నారు. ప్రతీ వార్డులో, పంచాయతీల్లో వందలాది నామినేషన్లు దాఖలు చేయిస్తామని తెలిపారు. ఢిల్లీకి వెళ్లే ముఖ్యమంత్రుల్లో రేవంత్ రెడ్డికి గిన్నిస్ రికార్డు ఖాయం అని సెటైర్లు వేశారు. అనేక సార్లు ఢిల్లీకి వెళ్లినా ప్రధాని మోదీతో రేవంత్ రెడ్డి బీసీ బిల్లుపై చర్చించలేదని ప్రశ్నించారు. హైదరాబాద్‌లో బుధవారం కవిత మీడియాతో మాట్లాడారు. ‘బీసీ బిల్లు ఆమోదానికి రేవంత్ రెడ్డి కృషి చేయడం లేదు. బీసీ బిల్లు కోసం తెలంగాణ వికసిత్ యాత్ర పేరిట బీజేపీ యాత్ర చేస్తామనడం విడ్డూరంగా ఉంది. బీసీ బిల్లుకు మద్ధతివ్వకుండా ఎన్ని యాత్రలు చేసినా బీజేపీని ప్రజలు నమ్మరు. బీసీ బిల్లు కోసం జూలై 17న పెద్ద ఎత్తున రైల్ రోకో కార్యక్రమానికి పిలుపునిచ్చాం. జూలై 16, 17, 18 తేదీల్లో ప్రయాణాలు పెట్టుకున్న వాళ్లు వాయిదా వేసుకోండి. రైల్ రోకో కార్యక్రమానికి ఆయా కుల సంఘాల నుంచి పెద్ద ఎత్తున మద్దతు లభిస్తోంది. ఎస్సీ, ఎస్టీ సంఘాలు కూడా తెలంగాణ జాగృతి ఉద్యమానికి మద్ధతిస్తున్నాయని కవిత తెలిపారు.

### ఆయనతో లాలూచి ఏమిటో చెప్పాలి?

గోదావరి జలాలపై ఆంధ్రప్రదేశ్ మంత్రి నిమ్మల రామానాయుడు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. వృధా అవుతున్న గోదావరి నీటిని మన పొలాలకు మళ్లించుకోవాలన్నది కేసీఆర్ ఆలోచన. తుపాకులగూడెం వద్ద నుంచే నదుల అనుసంధాన లింకేజ్ పాయింట్ ఉండాలని కేసీఆర్ వాదించారు. దీని వల్ల తెలంగాణలోని 6 జిల్లాలకు గోదావరి నీరు పుష్కలంగా లభించే అవకాశం ఉంటుంది. పోలవరం నుంచి లింకేజీ ప్రతిపాదనను గతంలోనే జగన్ ప్రతిపాదిస్తే కేసీఆర్ వ్యతిరేకించారు. చంద్రబాబు ఎన్డీఏలో భాగస్వామిగా ఉన్నారు కాబట్టి తెలివిగా గోదావరి పెన్నా అనుసంధానమని చెప్పి కేంద్రం నుంచి నిధులు తెచ్చుకుంటున్నారు. కానీ మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫ్లైట్ మోడ్ సీఎంగా ఢిల్లీకి పోవడం రావడం తప్పా కనీసం కేంద్రం నుంచి నిధులు తెచ్చుకోవడం లేదు. బనకచర్ల ప్రాజెక్టుపై రేవంత్ రెడ్డి ఎందుకు మాట్లాడడం లేదు..? చంద్రబాబుతో రేవంత్ రెడ్డి లాలూచి ఏమిటో చెప్పాలి.? బనకచర్ల ప్రాజెక్టుపై కేంద్రానికి ఏపీ ప్రభుత్వం పీఎఫ్ఆర్ సమర్పించినా సీఎం స్పందించకపోవడం దుర్మార్గం అని కవిత మండిపడ్డారు.

### ఆపరేషన్ కగార్ ఆపాలి..

మీరు నిజంగా నల్లమల పులి బిడ్డ అయితే బొల్లపల్లి రిజర్వాయర్ కట్టకుండా అడ్డుకోండి. అపెక్స్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఎందుకు కేంద్రాన్ని అడగడం లేదు. తక్షణమే అపెక్స్ కౌన్సిల్ సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని సీఎం డిమాండ్ చేయాలి. ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఎన్ని లేఖలు రాసినా ప్రాజెక్టు ఆగదు. ప్రాజెక్టు ఆగాలంటే ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వం లొల్లి పెట్టాలి అని కవిత సూచించారు. ఆపరేషన్ కగార్‌ను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆపాలన్నిరు. ప్రభుత్వాలు ఈ మారణకాండను ఆపాలి.. మావోయిస్టులతో చర్చలు జరపాలన్నారు. ఎన్‌కౌంటర్‌లో చెందిన గాజర్ల రవి మృతి పట్ల ఎమ్మెల్సీ కవిత సంతాపం తెలిపారు.

# 2025 కల్లా 1 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ

## ప్రపంచంలోనే పెట్టుబడులకు తొలి ఎంపిక తెలంగాణ

గూగుల్ ఇన్నోవేటివ్ కంపెనీ మీది.. మాది ఇన్నోవేటివ్ ప్రభుత్వం: సీఎం రేవంత్

గూగుల్ సేఫ్టీ ఇంజినీరింగ్ సెంటర్‌ను ప్రారంభించిన ముఖ్యమంత్రి

బ్రహ్మోస్ ఏరోస్పేస్ విస్తరణకు హైదరాబాద్‌ను ఎంచుకోండి

సీఎం రేవంత్ రెడ్డితో బ్రహ్మోస్ ఏరోస్పేస్ సంస్థ ప్రతినిధులు భేటీ




**హైదరాబాద్, మహా:** ప్రపంచంలో ఉన్న సంస్థలు ఉత్తమ పెట్టుబడి అనుకూల రాష్ట్రం కోసం గూగుల్‌లో శోధిస్తే దానికి సమాధానం తెలంగాణ అని వస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. గూగుల్ సెర్చ్‌లో మొదటి లింక్ హైదరాబాద్ వస్తుందని పేర్కొన్నారు. బుధవారం రేవంత్ రెడ్డి గూగుల్ సేఫ్టీ ఇంజనీరింగ్ సెంటర్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆసియా పసిఫిక్ ప్రాంతంలో గూగుల్ మొదటి సేఫ్టీ ఇంజనీరింగ్ సెంటర్ (జీఎస్ఈసీ) ను రాష్ట్రంలో ప్రారంభించడం నాకు సంతోషంగా ఉందన్నారు. ఇది ప్రపంచంలో నాల్గవది మాత్రమేనని..గూగుల్ ప్రారంభించినప్పటి నుంచి ప్రపంచం మారిపోయిందన్నారు. నేడు, మన జీవితాలు పూర్తిగా డిజిటల్ ఆధారితమయ్యాయని, మన ఆర్థిక వ్యవస్థ, మన ప్రభుత్వం, మన జీవితాలు డిజిటల్ గా మారాయన్నారు. మనం గోప్యత, భద్రత గురించి నేడు ఆందోళన చెందాల్సివస్తుందన్నారు. డిజిటల్ సురక్షితంగా ఉంటే, మనం మరింత అభివృద్ధి చెందుతామని..అధునాతన సైబర్ సెక్యూరిటీ , భద్రతా పరిష్కారాల కోసం గూగుల్ ఈ సైబర్‌సెక్యూరిటీ హబ్‌ను ఉపయోగిస్తున్నందుకు నేను గర్విస్తున్నానని తెలిపారు. గూగుల్ సేఫ్టీ ఇంజనీరింగ్ సెంటర్ నైపుణ్య అభివృద్ధిపై దృష్టి పెడుతుందని.. ఉపాధిని సృష్టించడంతో పాటు దేశం సైబర్ భద్రతా సామర్థ్యాన్ని పెంచుతుందన్నారు. చెడు చేయవద్దన్నది గూగుల్ సంస్థ సిద్ధాంతం..ఈ విధానాన్ని నేను ఇష్టపడుతున్నానని తెలిపారు.

**తెలంగాణ రైజింగ్ తో వన్ ట్రిలియన్ సాధన..**

గూగుల్ లాగా, నా ప్రభుత్వం కూడా మంచిని మాత్రమే చేస్తుందని నమ్ముతున్నానన్నారు. ఈ విధానం వల్ల ప్రయోజనాలు కొంత నెమ్మదిగా కనిపిస్తాయి.. అయితే మనం దీర్ఘకాలికంగా దృష్టి పెట్టి పని చేయాలని సూచించారు. దీనినే మేము తెలంగాణ రైజింగ్ అని పిలుస్తామని..దీంతో 2035 నాటికి తెలంగాణను $1 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చేయాలనుకుంటున్నామని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. గూగుల్, హైదరాబాద్ పాత స్నేహితులు అని..2007లో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో గూగుల్ తన మొదటి కార్యాలయాన్ని ఇక్కడ ఏర్పాటు చేసిందని రేవంత్ రెడ్డి చెప్పారు. దాదాపు 7,000 మంది గూగుల్ ఉద్యోగులు నేడు హైదరాబాద్‌ను తమ ఇల్లుగా భావిస్తున్నారన్నారు. విద్య, భద్రత, మ్యాప్‌లు, ట్రాఫిక్, స్టార్టప్‌లు, ఆరోగ్యం ఇలా అనేక రంగాలలో గూగుల్ తో కలిసి మేం పనిచేస్తున్నామని తెలిపారు. గూగుల్ ఒక వినూత్న సంస్థ, మాది ఒక వినూత్న ప్రభుత్వమన్నారు. ప్రభుత్వం ఇటీవల హైదరాబాద్ ట్రాఫిక్ నియంత్రణ కోసం ట్రాన్స్‌జెండర్‌లను నియమించామని గుర్తు చేశారు. గత ప్రభుత్వాలు ట్రాన్సజెండర్స్ ని నిర్లక్ష్యం చేశాయన్నారు. జీహెచ్ఎంసీ కూడా వివిధ పనుల కోసం ట్రాన్స్‌జెండర్‌లను నియమించుకుంటోందని తెలిపారు. మేము 1 కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనుకుంటున్నామని, గూగుల్ ఆఫీస్ పక్కనే రెండున్నర ఎకరాల్లో స్వయం సహాయక సంఘాల మహిళల కోసం స్టాల్స్ ఏర్పాటు చేశామని రేవంత్ రెడ్డి తెలిపారు.

**నైపుణ్యాభివృద్ధికి యూనివర్సిటీ..**

మేము మా రైతులను సంపన్నులుగా తయారు చేయడంతో పాటు సంతోషంగా ఉంచాలనుకుంటున్నామన్నారు. మేము మా యువతలో నైపుణ్యాలు పెంచడంతో పాటు వారికి ఉపాధి కల్పించాలనుకుంటున్నామన్నారు. వీటన్నిటికీ, నాకు మీ మద్దతు అవసరమని కోరారు. తెలంగాణ రైజింగ్‌కు బ్రాండ్ అంబాసిడర్లుగా కావాలని కోరుకుంటున్నానన్నారు. నాణ్యమైన విద్య మా లక్ష్యమని..ఇందుకోసం యంగ్ ఇండియా నైపుణ్య విశ్వవిద్యాలయం, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ను తీసుకువస్తున్నామని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. తెలంగాణ లో ప్రతి సంవత్సరం 1.10 లక్షల ఇంజనీర్స్ కాలేజ్ ల నుంచి వస్తున్నారని..అయితే చాలా మంది విద్యార్థులకు నైపుణ్యం ఉండడం లేదన్నారు. విద్యార్థుల్లో నైపుణ్యాల పెంపు కోసం ఆనంద్ మహీంద్రా నేతృత్వంలో యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నామన్నారు. పబ్లిక్,ప్రైవేట్ భాగస్వామ్యంలో ఈ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నామని..అందరికీ ఆరోగ్యం మా లక్ష్యం అని..ఇవే నా ప్రధాన ఆవిష్కరణలు అని రేవంత్ రెడ్డి వెల్లడించారు.

**ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తాం..**

సూపర్ సోనిక్ క్రూయిజ్ క్షిపణి బ్రహ్మోస్ ఏరోస్పేస్ సంస్థను హైదరాబాద్ లో విస్తరించాలని సీఎం రేవంత్ రెడ్డి బ్రహ్మోస్ ఏరోస్పేస్ సంస్థను కోరారు. డిఫెన్స్ కారిడార్ ను ఏర్పాటు చేసేందుకు హైదరాబాద్, బెంగళూరు ప్రాంతాలు అనుకూలమైనవన్నారు సీఎం. ఇప్పటికే హైదరాబాద్ లో పలు డిఫెన్స్ సంస్థలున్నాయన్న సీఎం.. బ్రహ్మోస్ ఏరోస్పేస్ సంస్థను విస్తరించేందుకు హైదరాబాద్ ను ఎందుకోవాలని, ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందన్నారు. సూపర్ సోనిక్ క్రూయిజ్ క్షిపణి బ్రహ్మోస్ ఏరోస్పేస్ సంస్థ ప్రతినిధుల బృందం జూన్ 18 సీఎం రేవంత్‌రెడ్డితో భేటీ అయ్యింది. జూబ్లీహిల్స్ లోని సీఎం నివాసంలో రేవంత్ రెడ్డి,ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును బ్రహ్మోస్ ఏరోస్పేస్ ఎండీ, సీఈవో డా.జైతీర్థ ఆర్.జోషి, బ్రహ్మోస్ హైదరాబాద్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సూరంపూడి సాంబశివప్రసాద్, డీఆర్డీఎల్ డైరెక్టర్ జీఏ శ్రీనివాసమూర్తి మర్యాదపూర్వకంగా కలిశారు.

# హరీశ్, ఈటల ఎన్నిసార్లు కలిసారో చెప్పనా?

## కేసీఆర్‌ను కాపాడేపనిలో కమలదళం పని

కేసీఆర్‌తో ఫోన్‌లో మాట్లాడలేదని ఈటల ప్రమాణం చేస్తారా?

ఈటలకు ఏం రాజకీయ భరోసా ఇచ్చారో వివరాలు బయటపెట్టలా?

ఎక్స్‌లో టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు

**హైదరాబాద్, మహా:**



బీఆర్ఎస్‌కు రక్షణకవచంగా బీజేపీ మారిందరని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ విమర్శించారు. కేసీఆర్‌ను కాపాడేపనిలో కమలదళం పనిచేస్తోందని ఎక్స్‌లో ట్వీట్ చేశారు. పాలు నీళ్ల వలే బీఆర్ఎస్, బీజేపీ రెండూ ఒకే తాను ముక్కలని తేలిపోయిందన్నారు. కాళేశ్వరం విచారణ తుది అంకానికి చేరుకున్న దశలో బీజేపీ ద్వంద్వ నీతి విచారణలో కాళేశ్వరంపై బీజేపీ ఎంపీ ఈటల ప్రశంసల జల్లు, తెల్లారే కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సీబీఐకి అప్పగించాలన్న డిమాండ్, కాళేశ్వరం దోషులను బీజేపీ కాపాడుతోందనడానికి ఇంతకన్నా ఏం కావాలి అంటూ ప్రశ్నించారు. కేసీఆర్ ఫ్యామిలీకి కాళేశ్వరం ఏటీఎం అన్న మోదీ, అమిత్ షా అడ్రసెక్కడ అని నిలదీశారు. మీ కేంద్ర మంత్రి నాటకం, మీ ఎంపీ డబుల్ గేమ్ దేనికి సంకేతమన్నారు. 'కాళేశ్వరం అవినీతి ప్రాజెక్ట్ అని దేశమంతా తెలియదా?. ఈటల, హరీశ్ కలిసినప్పుడే బీజేపీ, బీఆర్ఎస్‌ల మైత్రీపై అనుమానమొచ్చింది. ఆ రోజు ఇద్దరు కలిసారు. ముగ్గురు ఒకే ఆన్సర్స్ ఇస్తారని చెప్పిన. కాళేశ్వరం విచారణకు ముందు హరీశ్, ఈటల ఎన్నిసార్లు కలిసారో లెక్క చెప్పనా? ఈటలకు మాజీ సీఎం కేసీఆర్ ఏమని రాజకీయ భరోసా ఇచ్చారో వివరాలు బయట పెట్టనా అంటూ కామెంట్స్ చేశారు.

**కిషన్ రెడ్డి ఎలా డిమాండ్ చేస్తరు..**

హరీష్ భేటీ కాలేదని, కేసీఆర్‌తో ఫోన్‌లో మాట్లాడలేదని ఈటల భాగ్యలక్ష్మి గుడిలో ప్రమాణం చేస్తారా అంటూ టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ సవాల్ విసిరారు. ఎంపీ ఈటలతో అవినీతి ప్రాజెక్ట్ పై నీతి పలుకులు పలికింది రాజేందర్, కానీ పలికించిదెవ్వరన్నది తేలాలి. అవినీతి కాళేశ్వరంకు నీతి సర్టిఫికెట్ ఇచ్చిన ఈటలతో మాట్లాడించిన బీజేపీ పెద్దలెవరు?. స్థానిక సంస్థల ఎన్నికల్లో పొత్తుకు కాళేశ్వరం విచారణ వాంగ్మూలం సందర్భంగా బీజం పడుతోంది. బ్లాక్ మెయిలింగ్ కోసమో లేక బాంచెన్ దొర అంటూ పాత బానిసత్వపు కోసమో గాని కాళేశ్వరంలో అవినీతి లేదని ఎలా చెప్పగలిగారు. మేడిగడ్డ కూలింది నిజం కాదా?. అన్నారం, సుందిల్ల బ్యారేజీలకు ముప్పుందని మీ ఎన్డీఎస్ఏ చెప్పలేదా?. మరి కాళేశ్వరం ప్రాజెక్ట్ ఎలా నీతివంతమైంది చెప్పు రాజేందర్. తెల్లారేసరికి ఆ విచారణను సీబీఐకి అప్పగించాలని కిషన్ రెడ్డి ఎలా డిమాండ్ చేస్తరు. అంటే సీబీఐకిస్తే కేసీఆర్‌ను కాపాడుదామనా? చెల్లదు గాక చెల్లనేరదు, ముందుగా కాషాయపు కపటనీతి తేలాలి.

**ఈటలను గెలిపించినందుకు..**

బీజేపీ ద్వంద్వ ప్రమాణాలు బయటపడాలి. మల్కాజ్‌గిరిలో ఈటలను గెలిపించినందుకు కేసీఆర్‌కు కృతజ్ఞతగా కాళేశ్వరం విచారణలో దొంగ సాక్ష్యం ఇచ్చారా. పార్లమెంట్ ఎన్నికల్లో అవయదానం చేసిన బీఆర్ఎస్‌కు రిటర్న్ గిఫ్ట్ ఇచ్చారా. బీజేపి అధ్యక్ష పీఠాన్ని నిర్ణయించేది ఫాం హౌస్ గులాబీ బాస్ అని మరోసారి తెలిసి శరణుజొచ్చారా. నాటి కేబినేట్, సబ్ కమిటి డమ్మీ అన్నది మీరే, సంతకాలు పెట్టమంటే తెల్లకాగితాలపై సంతకాలు పెట్టింది మీరే. దూ దూ భసవన్నలా ఆర్థిక మంత్రిగా నిధులిచ్చింది మీరే. నాడు కాంట్రాక్టర్ల దగ్గర దొరతో కలిసి వాటాలు పంచుకున్నది మీరే. కాళేశ్వరం కేసీఆర్ ఫ్యామిలీకి ఎంటిఎం అని మోదీ, అమిత్ షా అంటిరి కేసీఆర్ ఫ్యామిలీని శిక్ష తప్పదంటిరి, ఈటల రూపంలో రక్షణ కవచంగా మారుతుంటిరి. మోటార్లు మునిగినందుకా, మేడిగడ్డ కూలినందుకా?, కోట్లలో కరెంటు బకాయిలు ఉన్నందుకా? ఏ ఇంజనీర్‌ను పట్టినా వందల కోట్లు దొరుకుతున్నందుకా.. కాళేశ్వరం ప్రాజెక్ట్ ఎందులో గొప్ప అంటూ మహేశ్ కుమార్ గౌడ్ ప్రశ్నించారు.



## మాగంటికి మన్నె గోవర్ధన్ రెడ్డి నివాళి

**హైదరాబాద్, మహా:** హైదరాబాద్‌లోని జేఆర్‌సీ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన బీఆర్ఎస్ జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే, దివంగత మాగంటి గోపీనాథ్ దశదినకర్మ కార్యక్రమానికి ఖైరతాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇంచార్జ్ మన్నె గోవర్ధన్ రెడ్డి హాజరయ్యారు. మాగంటి గోపినాథ్ చిత్రపటానికి పూలమాల వేసి ఆయన నివాళులు అర్పించారు.


# బనకచర్ల వల్ల తెలంగాణకు జరిగే నష్టంపై మంత్రి మౌనం

## పవర్‌పాయింట్ ప్రజంటేషన్ అంతా డైవర్షన్ రాజకీయమే

దివ్యాంగులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ విస్మరించింది

కేసీఆర్ ఆదేశాలతోనే సెంటిమెంట్ ను రెచ్చగొడుతున్న ఉత్తమ్

సిట్ నుంచి పిలుపు రాలే..నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్



**హైదరాబాద్, మహా :** బనకచర్ల ప్రాజెక్టు వల్ల తెలంగాణ రాష్ట్రానికి ఎంత నష్టం జరుగుతుందో చెప్పమంటే మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వద్ద సమాధానం లేదని నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అర్వింద్ విమర్శించారు. ప్రజల దృష్టిని మరల్చేందుకే ఆయన పవర్‌పాయింట్ ప్రజంటేషన్ కార్యక్రమాన్ని చేపట్టారని అర్వింద్ ఆరోపించారు. బుధవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, "బీజేపీ భరోసా కార్యక్రమం ద్వారా ఎన్నో వినతిపత్రాలు స్వీకరించామన్నారు. ముఖ్యంగా చాలా మంది దివ్యాంగులు వచ్చి వారి సమస్యలను మాతో పంచుకున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వారికిచ్చిన హామీలను కూడా నెరవేర్చడంలో విఫలమైందని మండిపడ్డారు. దీనివల్ల ప్రతి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ప్రతిష్ట దెబ్బతిన్నదన్నారు.

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వ్యవహార శైలిపై అర్వింద్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. "ఉత్తమ్ కుమార్ రెడ్డి సగం కాంగ్రెస్, సగం బీఆర్ఎస్ వ్యక్తిలా వ్యవహరిస్తున్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దర్శకత్వంలోనే తెలంగాణ సెంటిమెంట్‌ను రెచ్చగొట్టేందుకు ఆయన పవర్‌పాయింట్ ప్రజంటేషన్ వంటి కార్యక్రమాలు చేస్తున్నారు. ఇదంతా కేవలం రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఆడుతున్న నాటకం" అని అర్వింద్ ఆరోపించారు. బీజేపీ మీద బురద చల్లేందుకే ఇటువంటి ప్రయత్నాలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు.

ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపైనా అర్వింద్ స్పందిస్తూ. "నన్ను సిట్ విచారణకు పిలిచినట్లు వస్తున్న వార్తల్లో నిజం లేదు. నాకు ఎలాంటి నోటీసులు అందలేదు. అసలు మహేశ్ కుమార్ గౌడ్ ఫోన్‌ను ఎందుకు ట్యాపింగ్ చేశారో అర్థం కావడం లేదు" అని అర్వింద్ వ్యాఖ్యానించారు. బనకచర్ల విషయంలో వాస్తవాలు మాట్లాడకుండా, పవర్ పాయింట్ ప్రజంటేషన్లతో కాలయాపన చేయడం ద్వారా ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆయన దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంపై దృష్టి సారించాలని అర్వింద్ హితవు పలికారు.

# నా రెండు ఫోన్లు ట్యాప్

- సిట్ అధికారులు పిలవడంతో వచ్చా
- కాంగ్రెస్ పొలిటికల్ స్ట్రాటజిస్ట్ సైదులు గుండ్లపల్లి

**హైదరాబాద్, మహా:** తన రెండు ఫోన్లు ట్యాప్ అయినట్లు సిట్ నుండి ఫోన్ రావడంతో బుధవారం వచ్చి వాంగ్మూలం ఇచ్చినట్లు కాంగ్రెస్ పార్టీ పొలిటికల్ స్ట్రాటజిస్ట్ సైదులు గుండ్లపల్లి తెలిపారు. విచారణకు హాజరైన ఆయనను మహా సంప్రదించగా, తాను విచారణకు హాజరైన మాట వాస్తవమేనని, తన స్టేట్‌మెంట్ ను బాధితుడిగా రికార్డు చేశారన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం పొలిటికల్ స్ట్రాటజిస్ట్ గా తాను పనిచేశానని, అయితే ఇపుడు సిట్ నుండి ఫోన్లు రావడంతో షాక్ కు గురయ్యానన్నారు. అరగంట పాటు తనను వివిధ అంశాలపై సిట్ అధికారులు ప్రశ్నించారని, మళ్ళీ పిలిస్తే వస్తానని చెప్పానన్నారు.

# మొబైల్ ఫోన్ ఇచ్చిదే లేదు!



**(మొదటిపేజీ తరువాయి)**

విచారణలో భాగంగా కేటీఆర్ వాడుతున్న సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్‌ను తమకు అందజేయాలని ఏసీబీ అధికారులు కోరారు.

**సుప్రీంకోర్టు కూడా చెప్పింది..**

అయితే, తన సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకోవాలని కోరడం ప్రాథమిక హక్కులకు, వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించడమేనని కేటీఆర్ తన లేఖలో స్పష్టం చేశారు. ఇదే విషయాన్ని సుప్రీంకోర్టు కూడా పలు సందర్భాల్లో నొక్కి చెప్పిందని ఆయన గుర్తు చేశారు. ఏసీబీ అధికారుల ఆదేశాలపై కేటీఆర్ తన న్యాయవాదులతో సుదీర్ఘంగా చర్చించారు. ప్రస్తుత పరిస్థితుల్లో మొబైల్ ఫోన్‌ను గానీ, ల్యాప్‌టాప్‌ను గానీ ఏసీబీకి అప్పగించాల్సిన అవసరం లేదని న్యాయనిపుణులు కేటీఆర్‌కు సలహా ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ న్యాయ సలహా మేరకే కేటీఆర్ ఏసీబీకి లేఖ ద్వారా తన నిర్ణయాన్ని తెలియజేశారు.

# 2027 ఫిబ్రవరి నెలలో జమిలి ఎన్నికలు

## కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి



**న్యూ ఢిల్లీ,మహా :** భారతదేశం మొత్తం ఒకేసారి 2027 ఫిబ్రవరిలో ఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలో ఎన్నికలు (జమిలీ) నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధం అవుతుంది.జమిలీ ఎన్నికలకు మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ గారి ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేశారు.కమిటీ కూడా పూర్తీ స్థాయిలో పరిశీలన జరిపి తన నివేదికను కేంద్ర ప్రభుత్వంకు అందజేసింది.జమిలి ఎన్నికలు జరగాలి అంటే రాజ్యాంగంలో 5 ఆర్టికల్స్(ఆర్టికల్ 83,85,172,174,356) లు రాజ్యాంగ సవరణ బిల్లు ద్వారా చెయ్యాలని సూచించింది.ఈ బిల్లు ఆక్సెప్ట్ అవ్వాలి అంటే లోక్ సభ,రాజ్య సభ లో 67% మంది సపోర్ట్ చెయ్యాలి.14 రాష్ట్రాలు అసెంబ్లీ లు సపోర్ట్ చెయ్యాలి.అలా మద్దతు ఇస్తే బిల్లు రాజ్యాంగ పరిధిలోకి వస్తుంది.ఈ బిల్లు 2024 ఈ శీతాకాల సమావేశాల్లోనే పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టనుంది.ఈ బిల్లుకు పార్లమెంట్ లో మద్దతు లభిస్తే 2027 ఫిబ్రవరిలో ఉత్తర ప్రదేశ్ ఎన్నికలతో పాటు దేశం మొత్తం అసెంబ్లీ,పార్లమెంట్ ఎన్నికలు నిర్వహిస్తుంది.ఈ ఎన్నికలు జరిగిన 100 రోజుల తర్వాత మున్సిపల్,గ్రామ పంచాయితి ఎన్నికలు నిర్వహిస్తుంది.దేశం మొత్తం పరిపాలన సౌలభ్యం కొరకు ఈ జమిలి ఎన్నికలు జరపనున్నట్లు కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి తెలిపారు.

### గ్రామీణ తాగునీటి సమస్య ఫిర్యాదుల కోసం


# టోల్ ఫ్రీ నంబర్ 1916

## ప్రజలకు సులువుగా గుర్తుండేలా నూతన నంబర్

**మహా :** మిషన్ భగీరథ శాఖలో ప్రజల గ్రామీణ తాగునీటి సమస్య ఫిర్యాదులను పరిష్కరించడానికి 18005994007 (11అంకెల) టోల్ ఫ్రీ నంబర్ అందుబాటులో ఉంది. మిషన్ భగీరథ ఈ టోల్ ఫ్రీ నంబర్ సేవలు రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు ఉపయోగించుకుంటున్నారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాలకు చెందినవారు, పైన చూపిన 11అంకెల టోల్ ఫ్రీ నంబర్‌కు డయల్ చేయడంలో ఇబ్బందిని ఎదుర్కొంటున్నందున, మిషన్ భగీరథ విభాగం గ్రామీణ ప్రజల తాగునీటి సమస్య ఫిర్యాదులను నమోదు చేసుకొనడానికి ప్రస్తుతం ఉన్న 18005994007 (11అంకెల) టోల్ ఫ్రీ నంబర్ కు బదులుగా నాలుగు అంకెల 1916 (4అంకెల) నంబర్ తో ఫిర్యాదులను నమోదు చేసుకునే సౌకర్యం కల్పించడం జరిగింది. ఈ నాలుగు అంకెల 1916 (4అంకెల) టోల్ ఫ్రీ నంబర్ తో ప్రజలు రాష్ట్రంలో ఎక్కడి నుండైనా తమ తాగునీటి సమస్య ఫిర్యాదులను నమోదు చేసుకోవచ్చని అధికారులు తెలిపారు.

# బేగంపేట్ ఎయిర్ పోర్ట్ కు బాంబు బెదరింపు

## పేల్చేస్తామంటూ మెయిల్ పంపిన అగంతకులు




**హైదరాబాద్, మహా :** బేగంపేట్ విమానాశ్రయానికి బాంబు బెదిరింపు అందింది. ఎయిర్ పోర్ట్ ను పేల్చివేస్తామంటూ గుర్తు తెలియని వ్యక్తులు ఈ మెయిల్ చేశారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు, భద్రత సిబ్బంది అప్రమత్తం అయ్యారు. కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టారు. స్నిఫర్ డాగ్స్ ను రంగంలోకి దించారు. ఈ ఉదయం బేగంపేట్ విమానాశ్రయానికి ఈ ఈమెయిల్ అందింది. దీంతో భద్రతా సిబ్బంది, బాంబు డిస్పోజల్ స్క్వాడ్, స్నిఫర్ డాగ్స్ సహాయంతో ఎయిర్ పోర్ట్ ప్రాంగణాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈమెయిల్ అందిన నిమిషాల వ్యవధిలోనే విమానాశ్రయ అధికారులు పోలీసులను అప్రమత్తం చేశారు. పోలీసులు వెంటనే బాంబు డిస్పోజల్ స్క్వాడ్ మరియు స్నిఫర్ డాగ్స్‌ను రంగంలోకి దించారు. తనిఖీలు నిర్వహించడానికి ముందు పోలీసులు సిబ్బందిని భద్రత అధికారులు వారి వారి గదులను ఖాళీ చేయాలని సూచించారు. ముందు జాగ్రత్త చర్యగా ఓ అగ్నిమాపక వాహనాన్ని సైతం అందుబాటులోకి తీసుకొచ్చారు. విమానాశ్రయంలో నిలిపి ఉంచారు. పోలీసులు ప్రాంగణాన్ని తనిఖీ చేశారు. మరో వైపు సైబర్ క్రైమ్ పోలీసులు రంగంలోకి దిగారు. ఇంటర్నెట్ ప్రోటోకాల్ ఐడీ ఆధారంగా ఈ ఈమెయిల్ ఎక్కడి నుంచి పోస్ట్ అయిందనే విషయాన్ని తెలుసుకునే ప్రయత్నం చేస్తోన్నారు. దాని మూలాలను తెలుసుకోవడానికి దర్యాప్తు ప్రారంభించారు. శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటులోకి వచ్చిన తరువాత బేగంపేట్ ఎయిర్ పోర్టులో వాణిజ్యపరమైన కార్యకలాపాలు స్తంభించిపోయాయి. 2008, మార్చి 23వ తేదీన శంషాబాద్ విమానాశ్రయం పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చింది. ఆ తర్వాత బెగంపేట విమానాశ్రయంలో కమర్షియల్ ఫ్లైట్స్ రాకపోకలు బంద్ అయిన విషయం తెలిసిందే.

# 4 ఎకరాల వరకు రైతు భరోసా..

## మరో రూ.1,313.53 కోట్లు విడుదల చేసిన సర్కార్

- 9 రోజుల్లో రైతు భరోసా పూర్తి చేయడానికి కట్టుబడి ఉన్నాం
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడి



**హైదరాబాద్, మహా:** మూడో రోజు బుధవారం 4 ఎకరాల విస్తీర్ణం వరకు రైతు భరోసా నిధులు జమ కోసం ప్రభుత్వం మరో రూ.1,313.53 కోట్లు విడుదల చేసింది. మరో 21.89 లక్షల ఎకరాలకు సంబంధించి 6.33 లక్షల మంది రైతులు లబ్ధి పొందుతున్నారు. ఇప్పటి వరకు మొత్తం రూ. 5215.26 కోట్లు రైతు భరోసా కోసం విడుదల చేసి 58. 04 లక్షల మంది రైతులకు సాయం అందించినట్లైంది. 9 రోజుల్లో రూ.9 వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేస్తానని సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు వరుసగా మూడో రోజు రైతు భరోసా నిధులు విడుదల చేసినట్లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. ఎకరాలతో సంబంధం లేకుండా సాగు యోగ్యమైన అన్ని భూములకు ఈ సహాయం అందిస్తామని గుర్తు చేశారు. రైతు భరోసా విషయంలో బీఆర్ఎస్ నాయకులకు తమ ప్రభుత్వాన్ని ప్రశ్నించే నైతిక హక్కు లేదని విమర్శించారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక సందర్భంలో మినహా వానకాలం రైతుబంధు సహాయం ఎప్పుడూ సాగు కాలానికి ముందుగా ఇవ్వలేకపోయిందని ఆరోపించారు. ప్రతిసారి ఆలస్యంగా రైతుబంధు నిధులు రైతుల ఖాతాల్లోకి జమ చేసిందన్నారు. రైతు భరోసా పథకం కింద ఎకరాకు రూ. 5 వేల నుంచి రూ.6 వేలకు పెట్టుబడి సహాయం పెంచి రైతులకు అందజేస్తున్నామని తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందే ఇవ్వాల్సిన యాసంగి సీజన్ సంబంధించిన రైతుబంధు నిధులు ఇవ్వకుండా గత ప్రభుత్వం వదిలేస్తే.. మేం అధికారంలోకి రాగానే ఆ నిధులు కూడా చెల్లించినట్లు తెలిపారు.



## ఎమ్మెల్యే పల్లాను పరామర్శించిన మంత్రి శ్రీధర్ బాబు

**మహా :** ఇటీవల స్వల్ప ప్రమాదానికి గురై సోమాజిగూడ యశోద హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న జనగామ ఎమ్మెల్యే డా.పల్లా రాజేశ్వర్ రెడ్డిని బుధవారం తెలంగాణ ఐటీ, పరి శ్రమలశాఖ మంత్రి శ్రీధర్ బాబు పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

# మెట్రో ఫేజ్ 2 డీపీఆర్ అందింది

## కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్.. కేంద్ర మంత్రిని కలిసిన కిషన్ రెడ్డి



**న్యూఢిల్లీ, మహా :** తెలంగాణలో అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు కేంద్ర ప్రభుత్వ సహకారం ఉంటుందని కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ అన్నారు. కేంద్ర మంత్రి, తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు కిషన్ రెడ్డి బుధవారం మనోహర్ లాల్ తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణలో కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాల స్థితి గురించి ఇరువురు చర్చించారు. హైదరాబాద్ మెట్రో రైలు రెండో దశ పనులకు సంబంధించి ఇరువురి మధ్య చర్చకు వచ్చినట్లు కిషన్ రెడ్డి ఎక్స్ వేదికగా తెలిపారు. మెట్రో ఫేజ్ 2 కోసం తెలంగాణ ప్రభుత్వం పంపిన డీపీఆర్ ఇటీవలే తమకు అందిందని ఖట్టర్ తెలిపినట్లు పేర్కొన్నారు. ఈ డీపీఆర్ ను మంత్రిత్వశాఖ పరిశీలిస్తోందని ఖట్టర్ వివరించారు. ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో మెరుగైన కనెక్టివిటితో ఆధునిక హైదరాబాద్ నగర అభివృద్ధి, తెలంగాణ నిర్మాణం కోసం కృషి చేస్తున్నట్లు ఖట్టర్ పేర్కొన్నారు.


EDITORIAL సంపాదకీయం

# ఫోన్ ట్యాపింగ్... డార్క్ వెబ్



గడ్డం కృష్ణమూర్తి
సీనియర్ జర్నలిస్ట్, అసోసియేట్ ఎడిటర్

ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం రోజుకో సంచలనాన్ని సృష్టిస్తోంది. రెండు తెలుగు రాష్ట్రాల పొలిటికల్ లీడర్లు, ప్రతిపక్ష నాయకులు, పాపులర్ హీరోయిన్లు, ప్రముఖ నిర్మాతలు, దర్శకుల ఫోన్లు ట్యాప్ అయినట్లు కేసులు నమోదయ్యాయి. అత్యంత కీలకం, నేరం కూడా అయిన ఈ కేసు దర్యాప్తును ప్రతిష్టాత్మకంగా ఛేదించడంతో పాటు దేశ వ్యాప్తంగా తెలంగాణ పోలీసుల సత్తాను మరోసారి చాటి చెప్పేందుకు రాష్ట్ర ప్రభుత్వం పక్కా ఏర్పాట్లను చేసింది. కేసు విచారణ బాధ్యతలను ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) కు అప్పగించింది. ఈ క్రమంలోనే మరో కీలక అంశం వెలుగులోకి వచ్చింది. ఈ అంశం సత్యమే అయితే తెలంగాణ పోలీసుల ప్రతిష్ట దాదాపుగా మంట గలవడం ఖాయం. నాడు ప్రభాకర్ రావు బృందం ట్యాప్ చేసిన ఆడియోలను డార్క్ వెబ్‌లో అమ్మకానికి పెట్టినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం విచారణను ఎదుర్కొంటున్న ఓ అధికారి ఈ ఫోన్ ట్యాపింగ్ ఆడియోలను అమ్ముకున్నట్లు సోషల్ మీడియా ఇప్పటికే కోడై కూస్తోంది. బిట్ కాయిన్ రూపంలో పెద్ద మొత్తంలో వ్యాపారం జరిగిందని, ఇప్పటికీ దుబాయ్, డల్లాస్ వేదికగా ఇంకా ఫోన్ ట్యాపింగ్ కంటిన్యూ అవుతుందని సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. మొత్తానికి ఈ టాపిక్ ట్రెండింగ్‌లో ఉండగా ప్రముఖులంతా రాజకీయ నాయకుల చేతుల్లో బలయ్యారని కామెంట్స్ చేస్తున్నారు నెటిజన్లు. మరి సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతున్న వార్తలో కొంతలో కొంతైన నిజం ఉందని దర్యాప్తు అధికారులు నర్మగర్భంగా ఒప్పుకుంటున్నారు. ఏడాది కాలంగా అమెరికాలో తల దాచుకున్న ప్రభాకర్ రావు ఎట్టకేలకు సుప్రీంకోర్టు ఆదేశాలతో హైదరాబాద్ కు చేరుకోవడం పోలీసుల ఎదుట విచారణకు హాజరవడం తదితర పరిణామాల నేపథ్యంలో పలువురికి నోటీసులు జారీ చేసిన పోలీసులు వాంగ్మూలాలను ఇవ్వాలని కోరడం చకచకా జరిగిపోయింది. కేసు విచారణ కీలక దశలో ఉన్న సమయంలో డార్క్ వెబ్ వ్యవహారం తెరపైకి రావడం మరింత చర్చకు దారి తీస్తోంది. ఒకరకంగా చెప్పాలంటే రాష్ట్ర రాజకీయాలను కుదిపేస్తోంది ఈ న్యూస్.



పోలీసు ఉద్యోగంలో చేరినపుడు చేసిన శపథాన్ని కొంత మంది స్వార్థపరులు ఉల్లంఘించడం సహజమే. కానీ కీలకమైన అంశాలను కూడా మార్కెట్ లో పెట్టి విక్రయించి కోట్లు కూడబెట్టుకున్నారంటే వినేందుకే అసహ్యంగా ఉంది. డీజీ స్థాయి అధికారి పర్యవేక్షణలోనే ప్రత్యర్థుల రహస్యాలను పసిగట్టేందుకు అధికారాన్ని అడ్డం పెట్టుకున్న వారు తప్పు చేస్తే లేనిది మాకెందుకు ఈ మడి అని సదరు పోలీసు అధికారులు భావించి ఉంటారు. ఒక తప్పు చేస్తే ఆ తప్పును కప్పిపుచ్చుకునేందుకు మరో వంద తప్పులు చేయాల్సి వస్తుందన్న నానుడి ఉంది. ఈ నానుడి ఇక్కడే అక్షరాల వర్తించిందన్న విషయం స్పష్టమైంది. ఎస్ఐబీ చీఫ్ గా ప్రభాకర్ రావు తప్పు చేశారా? లేక ఆయనను అప్పట్లో అధికారంలో ఉన్న వారు చేసేలా ప్రోత్సహించారా అన్నది అప్రస్తుతం. దుబ్బాక ఉప ఎన్నికలో ఘోర పరాభవాన్ని చవి చూసిన అప్పటి సీఎం కేసీఆర్ తర్వాత జరిగిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో వచ్చిన హుజూరాబాద్ ఉప ఎన్నికల్లో పార్టీ నాయకత్వంపై తిరుగుబాటు చేసి తనకు కొరకరాని కొయ్యలా మారిన ఈటల రాజేందర్ ను రాజకీయంగా పూర్తిగా అణచి వేయాలన్న లక్ష్యంతో కొంత మంది ఫోన్ ట్యాపింగ్ కు శ్రీకారం చుట్టారు. దుబ్బాక ఉప ఎన్నిక సమయంలో ఒకే ఒక ఉప ఎన్నిక కాబట్టి ఏం కాదనుకున్న పోలీసు అధికారులు తర్వాత ఆ వ్యవహారమే తమ మెడకు పాము అవుతుందని భావించి ఉండకపోవచ్చు. హుజురాబాద్ ఉప ఎన్నిక తర్వాత మునుగోడు ఉప ఎన్నికలో యథేచ్ఛగా ఫోన్ ట్యాపింగ్ కు పాల్పడంతో భారీ ఎత్తున నగదును కూడా పట్టుకున్నారు.

ఇలా పట్టుకున్న నగదును పోలీసు అధికారులు కొంత మంది లెక్కల్లో చూపకుండా నొక్కేశారు. అప్పటి నుంచి తమ అక్రమార్జనకు ఎదురే లేదని భావించిన అధికారులు ఒకరిద్దరు అందినంత దండుకున్నారు. అయితే ఇదంతా పాలకులకు తెలియదని, తెలిసినా తమనేమీ అనరని ఊహించారు. అక్కడ మొదలైన అక్రమార్జన చివరకు ఫోన్ ట్యాపింగ్ ద్వారా సేకరించిన ప్రైవేట్ సంభాషణలను డార్క్ వెబ్ కు అమ్ముకునేందుకు కారణమైంది. అయితే డార్క్ వెబ్ ద్వారా వచ్చిన సంపాదనను ఎక్కడ దాచారన్న విషయాలన్నీ తెలిస్తే తప్ప మొత్తం కర్త, కర్మ, క్రియ ఎవరన్నది తెలిసే అవకాశాలున్నాయి. దీనిపై విచారణ జరిపితే అసలు నేరం ఫోన్ ట్యాపింగ్ దర్యాప్తులో కీలక అంశాలు కనుమరుగయ్యే అవకాశాలున్నాయి. ముందుగా ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో అసలు దోషులను గుర్తించి ఆ తర్వాత డార్క్ వెబ్ వ్యవహారంపై దృష్టి పెడితే ఎవరి ప్రమేయం ఎందులో ఎంత, ఎవరికి ఏ మేరకు లబ్ధి చేకూరింది, ఎవరి ఆదేశాలతో ఫోన్ ట్యాపింగ్ జరిగిందన్న విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశాలున్నాయి.

## కొరకరాని కొయ్యలా

ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కీలకుడని భావిస్తున్న ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు సిట్ అధికారులకు కొరకరాని కొయ్యలా మారారు. వాస్తవానికి ప్రభాకర్ రావు తన సుదీర్ఘ సర్వీసులో ఎన్నో కీలక కేసులను విచారించారు. అలా వందల సంఖ్యలో ఖేసుల విచారణను ప్రత్యక్షంగా, పరోక్షంగా పర్యవేక్షించిన ప్రభాకర్ రావు గతానుభవాన్ని ఇప్పుడు సిట్ ముందు చూపిస్తున్నట్లు స్పష్టమవుతోంది. విచారణను ఎదుర్కొంటున్న వ్యక్తిని ముద్దాయిగా భావించి దర్యాప్తు అధికారులు తమ అనుమనాల నివృత్తి కోసం ప్రశ్నించడం సహజం. కానీ ఇక్కడ ప్రభాకర్ రావు ముద్దాయిగా కాకుండా దర్యాప్తు అధికారిగానే వ్యవహరిస్తుండటంతో విచారణాధికారులు ఏం చేయాలో అర్థం కాని పరిస్థితిని ఎదుర్కొంటున్నట్లు స్పష్టమవుతోంది. ఫోన్ ట్యాపింగ్ ఎందుకు చేయాల్సి వచ్చిందని సిట్ బృందం ప్రశ్నిస్తే తాను చేశానని మీరెలా నిర్ధారించారని ఎదురు ప్రశ్నించడంతో ఆశ్చర్యపోవడం అధికారుల వంతైంది. గతంలో ఎన్నో కీలకమైన కేసులను పోలీసు శాఖ ఛేదించింది. దీంతో తెలంగాణ పోలీసుల ప్రతిష్ట దేశవ్యాప్తంగా తెలిసింది. కానీ కీలకమైన ఫోన్ ట్యాపింగ్ కేసులో మాత్రం దేశమంతా తెలంగాణ పోలీసుల వైపు చూసేలా చేస్తుంది. రాజకీయ, అంతరంగిక, ప్రైవేట్ సంభాషణలన్నింటినీ రికార్డు చేసిన అధికారులు ప్రైవేట్ సంస్థలు, వ్యక్తులకు అమ్ముకోవడం ఒక ఎత్తైతే దర్యాప్తులో పురోగతి మందగమనంలో సాగుతుండటం మరింత ఆశ్చర్యానికి గురి చేస్తోంది. ప్రభాకర్ రావు తీరు ప్రస్తుతం పోలీసు శాఖలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. భవిష్యత్ లోనూ ఇదే తరహాలో సిట్ అధికారులకు చుక్కలు చూపిస్తే దర్యాప్తు పురోగతి కష్టసాధ్యమన్న టాక్ కూడా వినిపిస్తోంది.

## ఇలా చేస్తే సరిపోతుంది

ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాన్ని టెలీకమ్యూనికేషన్ ఇంటలీజెన్స్ విభాగానికి అప్పగించి ప్రైవేట్ సంభాషణలను విక్రయించిన అంశాన్ని రాష్ట్ర పోలీసు శాఖ లోతుగా విచారిస్తే మొత్తం వ్యవహారం తేలే అవకాశాలు మెండుగా ఉన్నాయి. టెలీకమ్యూనికేషన్ ఇంటెలీజెన్స్ విభాగంలో నిష్ణాతులైన అధికారులు ఉండటంతో పాటు దేశ విదేశాలలోని పలు సంస్థలతో సంబంధాలుంటాయి. అంతే కాకుండా ఏ ఫోన్ ను ఎవరు మాట్లాడారు, వారి సంభాషణలను ఎవరు విన్నారు, రికార్డు ఏమైన చేశారా ? అందుకు కారకులెవరూ, రికార్డు చేసిన సంభాషణలు ఎవరి దగ్గరికి వెళ్ళాయన్న సమగ్ర సమాచారాన్ని వీలైనంత తొందరగా తెలుసుకునేందుకు సులభమవుతుంది. అంతేకాకుండా సంభాషణలను కొనుగోలు చేసిన సంస్థలు, విక్రయించిన వారి వివరాలు కూడా బయటపడేందుకు వీలుంది. అలాగే ఫోన్ ట్యాపింగ్, డార్క్ వెబ్ లాంటి సంస్థల వ్యవహారంపై వేర్వేరుగా దర్యాప్తు సాగడంతో రెండు కేసులు ఏకకాలంలో పూర్తై అసలు దోషులు ఎవరన్న విషయం కూడా ప్రపంచానికి తెలిసే అవకాశాలున్నాయి. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కోట్ల రూపాయలు చేతులు మారాయన్న ఆరోపణలున్న నేపథ్యంలో పాలకుల వాటా ఎంత? అధికారుల పాత్ర ఎంత అనేది బహిర్గతం అయ్యేందుకు వీలుంటుంది.



# సైప్రస్‌తో భారత్ బంధం

సైప్రస్ మధ్యధ రా సముద్రంలో ఆసియా, ఐరోపా, ఆఫ్రికాలు కలిసే ప్రదేశంలో ఉంది. 1960లో స్వేచ్ఛా వాయువులు పొందింది. రాజధాని నికోషియా. సైప్రస్ కరెన్సీ సైప్రస్ పౌండ్. మాట్లాడే భాషలు గ్రీక్, ఇంగ్లీష్. మతం ఇస్లాం, క్రైస్తవం. భారత్ లో మాదిరే ఇది ప్రధానంగా వ్యవసాయిక దేశం. రాబడి అంతా వ్యవసాయం పైనే మిక్కుటం. ప్రధాని మోదీ కెనడా వెళుతు సైప్రస్ లో దిగారు. సైప్రస్ లో మోదీకి ఘన స్వాగతం లభించింది. ఆ దేశ అధ్యక్షుడు చిరునవ్వుతో మోదీతో కరాచాలనం చేశారు. అనంతరం అధ్యక్ష భవనంలో సైప్రస్ లో అత్యున్నత పురస్కారం 'గ్రాండ్ క్రాస్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ మకారి యోస్ 3' తో సత్కరించారు.దీని అర్థం ఏమనగా సైప్రస్ ప్రథమ అధ్యక్షుడు ఆర్చ్ బిషప్ మకారియోస్ 3 పేరు మీద అందించే పురస్కారం. సైప్రస్ లో ఇటువంటి పురస్కారం విశిష్టమైన, ముఖ్యమైన హోదా కలిగిన వ్యక్తులకు ప్రధానం చేస్తారు. ఈ అవార్డు అందుకున్న మోదీ ఇది 143 కోట్ల మంది భారతీయులకు అంకితం అని ఉద్ఘాటించారు. ఈ అవార్డు తో మోదీకి వచ్చిన అంతర్జాతీయ పురస్కారాల సంఖ్య ఇరవై మూడు కు చేరింది. దీనికి ప్రతిగా అందమైన కశ్మీర్ సిల్క్ తివాచి, ఆంధ్ర ప్రదేశ్ లో చేసిన వెండి పర్సును సైప్రస్ అధ్యక్షుడికి అందించారు. వాటిని అందుకున్న సైప్రస్ అధ్యక్షుడు భారత్ కళలకు నిలయం అని చెప్పడం గమనార్హం. ఇరువురు నేతలు అక్కడ నుంచి ఒక చారిత్రక కేంద్రంకు చేరుకున్నారు. అక్కడ స్థానిక చట్ట సభ్యురాలు మైఖల్ కై ద్రి యో టి భారతీయ సంస్కృతి సంప్రదాయాల ప్రకారం మోదీకి పాదాభి వందనం చేశారు.దానికి మోదీ పొంగి పోయారు. భారత్ పట్ల వారికి ఉన్న గౌరవం కొనియాడారు. దాదాపు రెండు దశాబ్దాల తర్వాత మోదీ సైప్రస్ వెళ్లడం జరిగింది. వారి చర్చలలో ముఖ్యంగా వాణిజ్యం, సాంకేతికత, రక్షణ, పర్యావరణం, ఆరోగ్యం, మరియు ప్రాంతీయ అంశాలపై చర్చ సాగింది.భారత్ లో ఏప్రిల్ 22 జమ్మూ లోని పహాల్గం దాడిని సైప్రస్ అధ్యక్షుడు ఖండించారు. భారత్ కు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. భారత్ తో కలసి ఉగ్రమూకలను అణచి వేస్తాం అని చెప్పడం విశేషం. అలాగే పశ్చిమ ఆసియాలో సాగుతున్న యుద్ధం, తీవ్ర ఉద్రిక్తతలు దేశాలను అస్థిర పరుస్తాయి అని, ప్రగతి కుంటు పడుతుంది, పౌరులకు రక్షణ ఉండదు అని ముఖా ముఖిగా చర్చించుకున్నారు. ఇది యుద్ధాల శకం కాదు, శాంతి యుగం అని మోదీ అభిప్రాయపడ్డారు. రష్యా, ఉక్రైన్ యుద్ధం, గాజలో ఉద్రిక్తత, ఇప్పుడు ఇరాన్ మరియు ఇజ్రాయెల్ లో దాడులు, ప్రతి దాడులతో విశ్వం అతలాకుతల మవుతుంది. ఏం జరుగుతుందో, ఎవరిది తప్పో, పై చేయో అర్థం కాకుండ ఉంది. భారత్ లో ఇటీవల అహ్మదా బాద్ సంభవించిన విమాన ప్రమాదం తనను కలచి వేసిందని సైప్రస్ అధ్యక్షుడు వాపోయారు. విశ్వం లో దాడులు, కాల్పులు ఆగి శాంతికి కృషి చేయాలని ఇరువురు నేతలు అభిప్రాయపడ్డారు. చర్చలే పరిష్కార మార్గాలు అని ఊట0కించారు. ఈ దిశలో శాంతికి మేము ఎప్పుడు ముందు ఉంటామని మోదీ చెప్పారు. భారత్ తో కలసి పని చేయడం మాకు వరం అని సైప్రస్ చెప్పడం, ఒక చిన్న దేశం శాంతి కి కృషి చేయడం అభినందనీయం అని మోదీ ప్రశంసించారు.మోదీ సైప్రస్ నుంచి జి 7 సమావేశాల కొసం కెనడా వెళ్ళి అక్కడ నుంచి క్రొయేషియా చేరుకుంటారు. సైప్రస్ నుంచి వెళుతు మోదీ భారత్, సైప్రస్ ల మధ్య సహకారం కొనసాగుతుందని, రెండు దేశాల మధ్య గట్టి బంధం బలపడుతుందని చెప్పారు. 2026 లో సైప్రస్ ఈయూ అధ్యక్ష పదవి చేపట్టు తున్న తరుణం లో మోదీ, నికొస్ క్రిస్టో డౌ లి డెస్ కు శుభాకాంక్షలు చెప్పారు.

- కనుమ ఎల్లారెడ్డి,
93915 23027

# ఆపరేషన్ సింధు

## ఇరాన్ - ఇజ్రాయెల్ యుద్ధ నేపథ్యంలో..




**మహా:** ఇరాన్ ఇజ్రాయెల్ మధ్య యుద్ధం తీవ్రతరమవుతుండటంతో ఇరాన్‌లో చిక్కుకుపోయిన భారతీయుల్ని తరలించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ఆపరేషన్ కు శ్రీకారం చుట్టింది. దీనికి 'ఆపరేషన్ సింధు' అని కేంద్ర విదేశాంగ శాఖ పేరు పెట్టింది. టెహ్రాన్‌పై ఇజ్రాయెల్ బాంబుల వర్షం కురిపిస్తున్న వేళ.. ఉత్తర ఇరాన్ నుంచి జూన్ 17న ఆర్మేనియాకు చేరుకున్న 110 మంది విద్యార్థులను భారత్‌కు తరలించేందుకు ఏర్పాట్లు చేసింది. వీరంతా ఆర్మేనియా రాజధాని యెరవాన్ నుంచి ప్రత్యేక విమానంలో భారత్‌కు బయల్దేరారు. జూన్ 19న తెల్లవారు జామున ఢిల్లీకి చేరుకోనున్నారు. విదేశాల్లో ఉన్న తన పౌరుల భద్రతకు భారత్ అత్యధిక ప్రాధాన్యం ఇస్తుందని కేంద్ర విదేశాంగ శాఖ అధికారి ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ తెలిపారు. ఇజ్రాయెల్ దాడులతో టెహ్రాన్ నగరం దద్దరిల్లుతోంది. ఈ నేపథ్యంలో అక్కడి భారత ఎంబసీ ఇప్పటికే ప్రత్యేక అడ్వైజరీని జారీ చేసింది. తక్షణమే ఆ నగరాన్ని వీడాలని కోరింది. టెహ్రాన్ వెలుపల సురక్షిత ప్రాంతాలకు వెళ్లిపోవాలని భారతీయులకు సూచించింది. ఇప్పటివరకు భారత ఎంబసీని సంప్రదించని భారతీయులు వెంటనే దౌత్యాధికారులతో కాంటాక్ట్ అవ్వాలని కోరిన విషయం తెలిసిందే.

## తెలంగాణ భవన్‌లో హెల్ప్‌లైన్

ఇరాన్-ఇజ్రాయెల్ పరస్పర దాడుల నేపథ్యంలో ఆ రెండు దేశాలు, చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉంటున్న తెలంగాణవాసులకు సాయం అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ప్రత్యేక హెల్ప్‌లైన్ ప్రారంభించింది. ఇప్పటివరకూ రాష్ట్ర వాసులు ఎవరూ ప్రభావితం అయినట్లు సమాచారం లేకపోయినా భవిష్యత్తు అవసరాల దృష్ట్యా ముందుజాగ్రత్తగా ఈ హెల్ప్‌లైన్ ఏర్పాటు చేసింది. ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధం కారణంగా తాము ఉంటున్న దేశాల్లో గానీ, ప్రయాణాల్లో గానీ ఇబ్బంది పడుతున్న తెలంగాణ వాసులు కింద పేర్కొన్న నంబర్లను సంప్రదించవచ్చని తెలంగాణభవన్ రెసిడెంట్ కమిషనర్ కార్యాలయం వెల్లడించింది. వందన- రెసిడెంట్ కమిషనర్ పీఏస్- +91 9871999044, జి. రక్షిత్‌నాయక్, లైజన్ ఆఫీసర్- +91 9643723157, జావేద్ హుస్సేన్, లైజన్ ఆఫీసర్- +91 9910014749, సీహెచ్ చక్రవర్తి, పౌరసంబంధాల అధికారి- +91 9949351270.

రచనలకు ఆహ్వానం
ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.
మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp- 74369 39999

## ప్రజాసేవా భవన్ ను సందర్శించిన శివచరణ్ రెడ్డి



**ఆదిలాబాద్, మహా :** ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయం ప్రజాసేవా భవన్ ను యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివ చరణ్ రెడ్డి సందర్శించారు. బుధవారం యూత్ కాంగ్రెస్ జిల్లా విస్తృత స్థాయి సమావేశానికి హాజరైన అయన కార్యక్రమం అనంతరం ప్రజా సేవా భవన్ కు వచ్చారు. ఈ సందర్భంగా కంది శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ శ్రేణులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు.

## రోడ్డుపై పొంగి పొర్లుతున్న డ్రైనేజీ

**దుర్వాసనతో కాలనీ వాసులు.. పట్టించుకోని మున్సిపల్ అధికారులు**

**రంగారెడ్డి జిల్లా మహా:** ఆమనగల్ పట్టణంలోని మున్సిపల్ పరిధిలో శాంతినగర్ కాలనీ సయ్యద్ ఉస్మాన్ (బుక్క మున్న) ఇంటి ముందర మాడుగుల వెళ్లే దారిలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పొంగడంతో, కాలనీ ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అసలే వర్షాకాలం దీనికి తోడు పొంగి పొర్లుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ దుర్వాసనతో ప్రజలు ముక్కు మూసుకుని వెళ్తున్నారు. మురుగునీరు నిల్వ ఉండడంతో దోమలు విజృంభించి, రోగాల బారిన పడుతున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే స్పందించి మున్సిపల్ అధికారులు సమస్యను పరిష్కరించాలని స్థానికులు యాదయ్య, బుచ్చయ్య, సత్తార్, ఇస్మాయిల్, తదితరులు కోరుతున్నారు.



## మంత్రి, సీఎస్‌లను మర్యాద పూర్వకంగా కలిసిన జిల్లా కలెక్టర్





**హన్మకొండ మహా;** రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ని ఇటీవల హనుమకొండ జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన స్నేహ శబరీష్ బుధవారం హైదరాబాద్ లో మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. అనంతరం సచివాలయంలోని సిఎస్ ఛాంబర్ లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు ను జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు.

## పరిసరాలను పరిశుభ్రంగా శుభ్రంగా ఉంచుకోవాలి

**బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్**

**వరంగల్ మహా;** ప్రతి ఒక్కరూ ఇంటి లోపలా ఇంటి బయట పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అన్నారు. బుధవారం నగర పరిధి లోని 45, 46 డివిజన్ లోని కడిపికొండ, రామన్న పేట ప్రాంతాల్లో కమిషనర్ క్షేత్ర స్థాయి లో సందర్శించి వందరోజుల కార్యచరణ ప్రణాళికలో భాగంగా నిర్వహించిన అవగాహన ర్యాలీ లో పాల్గొన్నారు. ఈ సందర్భం గా కమిషనర్ 45వ డివిజన్ లో డీసిల్టింగ్ ప్రక్రియను పరిశీలించారు. అనంతరం తడి పొడి చెత్తను వేరు చేసి స్వచ్ఛ ఆటో కు అందజేయాలని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరుతూ నిర్వహించిన అవగాహన ర్యాలీలో కమిషనర్ పాల్గొని సీజనల్ వ్యాధులు ప్రబల కుండా, దోమలు వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల కు సంబంధించిన అవగాహన పై ముద్రించిన కరపత్రాలను స్థానికులకు అందజేసి గృహాలకు స్టికర్ లను అంటించారు. ప్రధాన రహదారులతో పాటు అప్రోచ్ రోడ్లను శుభ్రంగా ఉంచాలని ప్రజల నుండి ఏలాంటి ఫిర్యాదులు రాకుండా గల్లి ల్లోకి వెళ్లి చెత్త సేకరణ జరపాలని ముందస్తు సమాచారం ఇవ్వకుండా గైర్హాజరూ కాకూడదని సూచించారు. డంప్ యార్డ్ ను సందర్శించి బయో మైనింగ్ నిర్వహణ విధానాన్ని అడిగి తెలుసుకున్నారు.ఈసందర్భం గా



నిర్వాహకులు చెత్త ను ప్రాసెసింగ్ పూర్తి చేయడం జరిగిందని వారం రోజుల్లో డిస్పోస్ చేసి అందజేస్తామని తెలిపారు. వేవయింగ్ మిషన్ (బరువు తూచే యంత్రం)పని తీరు ను కమిషనర్ పరిశీలించారు. రామన్నపేట ప్రాంతంలో గ్రేవీ యార్డును పరిశీలించిన కమిషనర్ గేటును ఏర్పాటు చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా నీటి నాణ్యత నిర్ధారణ లో భాగంగా క్లోరినేషన్ ప్రక్రియను పరిశీలించారు. డంప్ యార్డ్ ప్రాంతం లో బయో గ్యాస్ ప్లాంట్ ఏర్పాటు చేయుటకు సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిఎంహెచ్ఓ డా. రాజారెడ్డి, వెటర్నరీ వైద్యులు డా.గోపాల్ రావు, ఈ ఈ సంతోష్ బాబు, ఏ ఈ రామన్న, సానిటరీ ఇన్స్పెక్టర్లు వెంకన్న, రవీందర్, తదితరులు, పాల్గొన్నారు.

# రూపేనా సంస్థకు ఆదాయం - సౌకర్యాలు నిల్!

- సమస్యలకు నిలయంగా - ఆమనగల్లు ఆర్టీసీ బస్టాండ్
- చాలీచాలని విస్తీర్ణంలో ఉన్న బస్టాండు నిత్యం రద్ది
- ఏండ్లు గడుస్తున్నా తీరని వైనం
- నీటి వసతి క్యాంటీన్ పార్కింగ్ లేక తీవ్ర ఇబ్బందులు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు అధికారులు




**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ప్రజా రవాణా విస్తరించినప్పటికీ..ప్రయాణికుల సంఖ్య పెరిగిప్పటికీ.. దశాబ్దాల క్రితం కొద్దిపాటి స్థలంలో నిర్మించిన అమనగల్లు ఆర్టీసీ బస్టాండ్ ను ఎలాంటి విస్తరణ చేపట్టకుండా. అభివృద్ధి చేయకుండా వినియోగించడం అసౌకర్యాలకు చిరునామాగా మారింది.ఆదాయం పెంచుకునేందుకు చూపిస్తున్న శ్రద్ధ.. ప్యాసింజర్ల సౌకర్యాల ఏర్పాటును సంస్థ పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. అమనగల్లు ఆర్టీసీ విస్తరణకు నోచుకోవడం లేదు... బస్టాండ్లో సరైన సదుపాయాలు కల్పించడంలో ఆర్టీసీ నిర్లక్ష్య ధోరణి వ్యవహరిస్తుంది. స్థానిక ఆర్టిసి బస్టాండ్లో నెలకొన్న సమస్యలపై అధికారులు పట్టించుకోవడం లేదని ప్రయాణికుల ఆవేదన.. 2003లో శ్రీశైలం హైదరాబాద్ జాతీయ రహదారి అనుసరించి ఆమనగల్లు ఆర్టీసీ బస్టాండు నిర్మించారు. ఏండ్ల సంవత్సరాలు గడుస్తున్నా ప్రయాణికులకు సరైన సదుపాయాలు కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారు. ముఖ్యంగా తాగునీటి సౌకర్యం, క్యాంటీన్ ఏర్పాటు, పార్కింగ్, ప్లాట్ ఫారంలు లేక పోవడం. ఇలా అనేక సమస్యలు బస్టాండ్ను వెంటాడుతూన్నాయి. తాగునీటి సౌకర్యం, క్యాంటీన్ లేక ప్రయాణికులు ప్రధాన రహదారిపై ఉన్న హొటళ్లకు వెళ్ళవలసి వస్తుంది. నిత్య మూడు వేలమంది ప్రయాణాలు సాగించే ఆమనగల్ బస్టాండ్ మీదుగా శ్రీశైలము, అచ్చంపేట, దేవరకొండ, షాద్ నగర్, నాగర్ కర్నూల్, కొల్లాపూర్, హైదరాబాద్, సికింద్రాబాద్, యాదగిరిగుట్ట, తదితర సుదూర ప్రాంతాలకు ప్రయాణాలు సాగిస్తుంటారు. సరైన ప్లాట్ ఫారంలు లేక ఏ బస్సు ఎక్కడ ఆగుతుందో, ఎక్కడకు వెళుతుందో తెలియక ముఖ్యంగా వృద్ధులు, నిరక్షరాస్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.అసలే ఇరుకుగా ఉండే బస్టాండ్లో ద్విచక్ర వాహనాలను పార్కింగ్ చేస్తుండడంతో ప్రయాణికులు బస్సుల రాకపోకలపై మరింత ఆందోళనకు గురవుతున్నారు. కల్వకుర్తి ఆర్టీసీ డిపోకు ప్రధాన ఆదాయ మార్గం అయినా ఆమనగల్ ఆర్టీసీ బస్టాండ్ లో సరైన సదుపాయాలు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు బస్టాండ్ లో సరైన సదుపాయాలు కల్పించడంలో శ్రద్ధ వహించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

**సమయ సూచికకు నోచుకోని ఆమనగల్లు బస్టాండ్...**

ఐదు మండలాల కూడలైన ఆమనగల్లుకు రోజు వందలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగించే బస్టాండ్లో బస్సుల సమయసూచిక బోర్డు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్టాండ్లో గోడపై బస్సుల సమయ సూచికను ఏర్పాటు చేసిన దానిపై కర పత్రలు అతికించడంతో సమయసూచిక కనపడటం లేదు.రోజు కంట్రోలర్ విధులకుహాజరవుతున్నా..సాయంత్రానికి తన విధులు ముగించుకొని వెళ్లిపోవడంతో దూరప్రాంతాలకు వెళ్లే వారు బస్సులు ఏ సమయంలో ఉన్నవో తెలియక అవస్థలు పడుతున్నారు..

**ఆదాయం పైనే..**

బస్టాండ్ ఆవరణలోని ఖాళీ స్థలం, దుకాణ సముదాయాలను అద్దెకు ఇచ్చి, కిరాయి రూపేనా సంస్థ ఆదాయం పొందుతోంది. కానీ.. బస్టాండ్ విస్తరణ, ప్రయాణికుల ఇక్కట్లను పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ప్రయాణికులకు అనుగుణంగా మూత్రశాలలు, మరుగుదొడ్లు లేకపోవడంతోఅవస్థలు తప్పడంలేదు. ఇప్పటికైనా.. సంస్థ అధికారులు ప్రాంగణంలో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## పనిలో కాదు.. పిల్లలు బడిలో ఉండాలి

పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసం.. పాల్గొన్న జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద
మధ్యాహ్న భోజన నాణ్యత, విద్యార్థుల నమోదు పరిశీలన

**వరంగల్ మహా;** తల్లితండ్రులు తమ పిల్లలను క్రమం తప్పకుండా బడికి పంపించాలని, విద్యతోనే సమాజంలో గౌరవించబడతారని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. బుధవారం ఖిలా వరంగల్ మండలంలోని కరీమాబాద్, మధ్య కోటలలో గల ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను కలెక్టర్ సందర్శించి హాజరు పట్టికలు, రిజిస్టర్లు, తరగతి గదులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కరీమాబాద్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమానికి కలెక్టర్ హాజరై చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా ఇప్పటివరకు ఖిలా వరంగల్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు 800 మంది చిన్నారులను చేర్పించామని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థులతో మమేకమై వారి సమస్యలు తెలుసుకోవడంతో పాటు మధ్యాహ్న భోజనం నాణ్యతను స్వయంగా పరిశీలించిన కలెక్టర్ మధ్యాహ్న భోజన పథకం స్కూళ్లలో మెనూ ప్రకారం ఇస్తున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన



ఉపాధ్యాయులతో విద్యార్థులకు గుణాత్మక విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు అందుబాటులో ఉన్న సౌకర్యాలు వినియోగించుకుని విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో బోధిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం ఉచితంగా బుక్స్ నోట్ బుక్స్ యూనిఫార్మ్స్ ఇస్తోందని, సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో కార్పొరేటర్ మరుపల్లి రవి, బైరబోయిన ఉమా దామోదర్ యాదవ్, డి ఈ ఓ జ్ఞానేశ్వర్, ఎం ఈ ఓ ప్రసాద్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులు, తదితరులు, పాల్గొన్నారు.

## వరంగల్ పోలీస్ కమిషనర్ ను కలిసిన బల్దియా కమిషనర్

**వరంగల్ మహా;** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ నూతన కమిషనర్ బాధ్యతలు స్వీకరించిన చాహత్ బాజ్ పాయి వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ ను వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్, బాధ్యతలు చేపట్టిన బల్దియా కమిషనర్ కు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వరంగల్ మున్సిపల్, వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు సంబంధించి పలు అంశాలపై ఇరువురు అధికారులు చర్చించారు.




## చిరు వ్యాపారస్తులకు అండగా బీజేపీ ప్రభుత్వం

**వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్**

**వరంగల్ మహా;** వరంగల్ జిల్లా తూర్పు నియోజకవర్గం 27వ డివిజన్ లోని లక్ష్మీపురం కూరగాయల మార్కెట్ వద్ద శివనగర్ మండల అధ్యక్షులు మహమ్మద్ రఫీ ఆధ్వర్యంలో రచ్చ బండ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వికసిత్ భారత్ యొక్క అమృతకాలం 11 సంవత్సరాల సేవ, సూపరిపాలన సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బడుగు బలహీనవర్గాలకు అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాల గురించి చిరు వ్యాపారస్తులకు, ప్రజలకు బిజెపి నాయకులతో కలిసి వివరించారు. అనంతరం అక్కడి ప్రజలతో మాట్లాడుతూ వారి సమస్యలను



తెలుసుకొని మీ అందరి అభివృద్ధి కోసం ఎల్లప్పుడూ కృషి చేస్తానని వారికి భరోసా ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు కనుకుంట్ల రంజిత్ కుమార్, బిజెపి మండల ప్రధాన కార్యదర్శిలు వైట్ల గణేష్, సూర శ్రీనివాస్,బిజెపి నాయకులు, కన్వీనర్లు, కో కన్వీనర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తప్పు చేసిన పోలీస్ అధికారులను తప్పించాలి

**బీజేపీ రాష్ట్ర నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్ రావు**



**వరంగల్ మహా;** ఏ పదవి లేకున్నా మంత్రి భర్త హోదాలో కొండా మురళీధర్ రావు ను హనుమకొండ రాంనగర్ వారి నివాసం నుండి ఓ సిటీ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వరకు ఎస్కార్ట్ తో వరంగల్ ఏసీపీతో సహా పోలీస్ అధికారులు, ఎస్సైలు రక్షణ వలయంగా సేవలు అందించడాన్ని బిజెపి రాష్ట్ర పార్టీ కమిటీ సభ్యుడు వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు తీవ్రంగా ఖండించారు. అంతేకాకుండా ప్రోటోకాల్ మీ విస్మరించి అధికారికంగా స్థానిక ఎమ్మెల్యే చేయవలసిన అభివృద్ధి పనుల శంకుస్థాపనలు చేయడం తోపాటు ఇటీవల మురళీధర్ రావు వరంగల్ లో పలు అధికారిక కార్యక్రమాలతో పాటు వివాహ విందులు, వినోదాలకు వెళ్ళినప్పుడు వరంగల్ ఏసిపి నందిరాం నాయక్ తో పాటు మిల్స్ కాలనీ, ఇంతేజార్ గంజ్ మట్టేవాడ సీఐలతోపాటు ఎస్సైలు పోలీస్ సిబ్బంది ఎస్కార్ట్గా వెళ్లడాన్ని ఆయన తప్పు పట్టారు. వరంగల్ సబ్ డివిజన్ పోలీసుల పొరపాటును గుర్తించి వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ ఏసీపీ నందిరాం నాయక్ తోపాటు పోలీసులకు షోకాజ్ నోటీస్ ఇవ్వడాన్ని స్వాగతించారు. గతంలో లాగా ప్రస్తుతం కూడా షోకాజ్ నోటీస్ తో సరిపుచ్చకుండా వారి వారి విధులను దుర్వినియోగం చేసిన వారిని విధుల నుంచి తప్పించాలని, ఏసీపీ నందిరాం నాయక్ తోపాటు బాధ్యులందరినీ తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కానిపక్షంలో బీజేపీ పార్టీ పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని స్పష్టం చేశారు.

## శ్రీ భద్రకాళీ దేవస్థానంలో ఘనంగా బోనాల పండుగ నిర్వహణ

**వరంగల్ మహా;** కమీషనర్, దేవాదాయ ధర్మాదాయ శాఖ వారి ఆదేశాల ప్రకారం సింహవాహినీ శ్రీ మహంకాళీ దేవస్థానం, లాల్ దర్వాజ, హైదరాబాదు వారు తెలంగాణా సంస్కృతి, సాంప్రదాయాలను ప్రపంచ వ్యాప్తంగా విస్తరింప జేయుటకు గత 11 సంవత్సరాలుగా దేశం నలుమూలలా ఈ బోనాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఆలయ ఈవో శేషు భారతి, ప్రధాన అర్చకులు భద్రకాళి శేషు బుధవారం ఆలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ సంవత్సరం నుండి గ్రేటర్ వరంగల్ మహానగరంలో ప్రాచీన ప్రసిద్ధి గాంచిన శ్రీ భద్రకాళీ దేవస్థానంలో కూడా బోనాల కార్యక్రమాన్ని నిర్వహించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అటవీ పర్యాటక, దేవాదాయ ధర్మాదాయ శాఖామంత్రి కొండా సురేఖ, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి చేతుల మీదుగా శ్రీ భద్రకాళీ అమ్మవారికి బంగారు బోనం సమర్పించడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో రాష్ట్రం నలుమూలల నుండి పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారికి బోనం సమర్పిస్తారు. అంతేకాకుండా వరంగల్ ఉమ్మడి జిల్లాల అధికార, అనధికార రాజకీయ నాయకుల తో పాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆలయ ఈవో సమావేశంలో కోరారు.



## నిర్దిష్ట గడువులోగా అభివృద్ధి పనులను పూర్తి చేయాలి

పనుల్లో నాణ్యత కనిపించాలి.. బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్

**వరంగల్ మహా;** గ్రేటర్ వరంగల్ నగరంలో చేపట్టిన అభివృద్ధి పనులను నిర్దిష్టగడువులోగా పూర్తి చేయాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో ఇంజనీరింగ్ అధికారులతో వివిధ అభివృద్ధి పనుల పురోగతి పై ఏర్పాటు చేసిన సమావేశంలో కమీషనర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నగర పరిధి లోని 66 డివిజన్ లలో చేపట్టబడి కొనసాగుతున్న వివిధ అభివృద్ధి పనులతో పాటు స్మార్ట్ సిటీ పనుల పురోగతిని కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు పూర్తి చేసిన స్మార్ట్ సిటీ అభివృద్ధి పనులు అట్టి పనులకు కేటాయించిన నిధులు, పనులకు జరిపిన చెల్లింపులు మిగతా పనుల కొనసాగింపు



తదితర వివరాలను స్మార్ట్ సిటీ పిఎంసి ను అడిగి తెలుసుకున్నారు. 66 డివిజన్లో వ్యాప్తంగా ఒక్కో ఏ ఈ కి కేటాయించిన డివిజన్లు ? డిఈ ల పర్యవేక్షణలో పనిచేస్తున్న ఏఈల సంఖ్య ఎంత? గరిష్టంగా ఒక ఏ ఈ కి ఎన్ని డివిజన్లు కేటాయించారు? తదితర వివరాలతో పాటు ప్రస్తుతం ఒక్కో ఈ ఈ కి కేటాయించిన అభివృద్ధి పనుల సంఖ్య ను క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు.

### భూపాలపల్లి జిల్లాకు రూ.72 లక్షల 30 కోట్లు

# రైతు భరోసా నిధులు విడుదల

**సాగుకు సమాయత్తం అవుతున్న అన్నదాతలు – ప్రభుత్వం విడుదల చేసిన రైతు భరోసా నిధులతో ఆనందం**

**భూపాలపల్లి, మహా :** రైతు సంక్షేమం పట్ల రాష్ట్ర ప్రభుత్వం చూపుతున్న ప్రాధాన్యత మరోసారి రైతు భరోసా నిధుల విడుదలతో వెల్లడైంది. ఖరీఫ్ సాగుకు సిద్ధమవుతున్న ఈ సమయంలో రైతులకు ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలిచేలా ప్రభుత్వం రైతు భరోసా నిధులను జమ చేయడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ నిధుల ద్వారా విత్తనాలు, ఎరువులు, ఇతర సాగు అవసరాలకు సంబంధించి రైతులకు మద్దతు లభించనుండటంతో, చాలా మంది రైతులు ముందుగానే అవసరమైన వ్యవసాయ సామాగ్రిని సిద్ధం చేసుకుంటున్నారు. ఈ విధంగా విత్తనాల సేకరణకు ముందు రైతులకు రైతు భరోసా నిధులు అందడం ఎంతో మేలు జరుగుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రైతు భరోసా నిధుల విడుదల ద్వారా ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకున్నందుకు రైతులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కు కృతజ్ఞతలు తెలిపారు. సాగులో జాప్యం కాకుండా సకాలంలో



సహాయం అందించడం అభినందనీయమని రైతులు పేర్కొన్నారు. రైతు అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం కొనసాగిస్తున్న చర్యలు భవిష్యత్తులో వ్యవసాయాన్ని మరింత స్థిరంగా, లాభదాయకంగా మార్చనున్నాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లాలో ఇప్పటి వరకు 90,837 మంది రైతులకు 72,30,42,624 రూపాయల నిధులు విజయవంతంగా జమయ్యాయని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు*. పాత రైతులతో పాటు కొత్త రైతులకు కూడా రైతు భరోసా ను ఎలాంటి పరిమితులు విధించకుండా అందించాలని ప్రభుత్వం నిర్మించినట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు వ్యవసాయ శాఖ అధికారులకు మార్గదర్శకాలు జారీ చేశారు ఈ నెల 20వ తేదీ వరకు నమోదు చేసుకున్న ప్రతి ఒక్కరికి రైతు భరోసా అందజేస్తామని ఆయన తెలిపారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో వానకాలం 2025కు సంబంధించిన రైతు భరోసా నిధుల పంపిణీ విజయవంతంగా కొనసాగుతోంది. మొత్తం 282 గ్రామాల నుంచి 1,24,397 మంది రైతులు ఈ పథకం ద్వారా లబ్ధిపొందేందుకు అర్హులుగా గుర్తించబడ్డారు. ఇందుకోసం 143,99,06,145 రూపాయల నిధులను రైతుల ఖాతాల్లో జమ చేయడానికి చర్యలు తీసుకోగా, అందులో 114,50,67,074 రూపాయలు ఖజానా ద్వారా పంపిణీకి సంబంధించి నమోదయ్యారు. కాగా ఇప్పటి వరకు 90,837 మంది రైతులకు 72,30,42,624 రూపాయల నిధులు విజయవంతంగా జమయ్యాయి.

## రెవెన్యూ సదస్సులో భూ సమస్యల పరిష్కారం

**విద్యార్థులు శ్రద్ధగా చదివితే మంచి భవిష్యత్తు.. చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య**

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** చించలపేట గ్రామంలో నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సులో పాల్గొన్న, స్థానిక శాసనసభ్యులు కాలే యాదయ్య, రైతులు భూ సమస్యలు పరిష్కరించుకోవాలని అన్నారు. వికారాబాద్ జిల్లా, నవాబ్ పెట్ మండలం, ఎమ్మెల్యే స్వగ్రామం చించలపేట గ్రామంలో నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన స్థానిక శాసనసభ్యులు కాలే యాదయ్య, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతి ద్వారా రైతులు భూ సమస్యలు పరిష్కరించుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... తాను పుట్టి పెరిగిన సొంత గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. గ్రామాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. భూ సమస్యల శాశ్వత పరిష్కారమే ధ్యేయంగా,



కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రజలు రైతులు ఈ యొక్క కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని, భూ సమస్యలను పరిష్కరించుకోవాలని ఆయన అన్నారు. నవాబ్ పేట్ మండలానికి చెందిన లబ్ధిదారులకు మంజూరైన కళ్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను, చేవెళ్ల శాసనసభ్యులు కాలే యాదయ్య పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు యూనిఫార్మ్స్, పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్ పంపిణీ చేసిన ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగానికి పెద్దపీట వేయడం జరిగిందని, విద్యార్థులు బాగా చదివి భవిష్యత్ తరాలకు బాటలు వేసేలా ఎదగాలని ఆయన విద్యార్థులను కోరారు. విద్యార్థులు శ్రద్ధగా చదివి మంచి భవిష్యత్తును ఏర్పాటు చేసుకోవాలి అని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు రైతులు మరియు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి కన్నతల్లి లాంటి పార్టీనే కాదు
# ఓట్లేసిన జనానికి కూడా వెన్ను పోటు పొడిచాడు

- మాజీ ఎంపీ,కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కి గౌడ్
- కష్టపడి ప్రజలు కొనుక్కున్న స్థలాలను భూ అక్రమదారులు అంటూ జీవో ఇస్తారా.?
- ఎల్బీ నగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డిపై మధుయాష్కీ ఫైర్...
- 118 జీవోతో ప్రజలను మోసం చేసిన సుధీర్ రెడ్డి.. మళ్ళీ మోసపూరిత మాటలు చెబుతున్నాడని కామెంట్



**ఎల్బీనగర్,మహా:** సుధీర్ రెడ్డి రక్తంలోనే మోసం ఉందని నమ్మిన నాయకులను,పార్టీనే కాదు మోసపూరిత వాగ్దానాలు చేసి జీవో 118 పేరు మీద ఇంకా ప్రజలను మోసం చేస్తున్న చీటర్ సుధీర్ రెడ్డి అని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ పార్లమెంట్ సభ్యులు మధుయాష్కి గౌడ్ విమర్శించారు.జీవో 118 పై ఇటీవల సుధీర్ రెడ్డి మాట్లాడుతూ మధుయాష్కిపై తప్పుడు ఆరోపణలు చేసిన నేపథ్యంలో జీవో 118 బాధిత కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులతో సమావేశంలో ఏర్పాటు చేసి మాట్లాడారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన స్వార్థం కోసమే మాత్రమే ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, గత ప్రభుత్వం జీఓ 118 తీసుకువచ్చింది అన్నారు.ప్రజలు ఎంతో కష్టపడి సంపాదించుకున్న ప్లాట్లను, నిర్మించుకున్న ఇళ్లను అక్రమణదారులుగా పేర్కొంటూ జీవో 118 తీసుకురావడం దుర్మార్గమన్నారు.జీవో 118 వల్ల తమ ఇబ్బందులు తొలగిపోలేదని,తప్పులు తడకగా తీసుకువచ్చిన జీవో మాకు వద్దు అని ప్రజలు కోరుతుంటే.. ఇంకా అదే జీఓ 118 ద్వారా కన్వీనియన్స్ డీడీలు ఇప్పిస్తామంటూ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మోసపు మాటలు మాట్లాడుతున్నాడని విమర్శించారు.తమ్మి సుధీర్ రెడ్డి.. నీవు ఏం చదువుకున్నావో తెలియదు గానీ.. భూ అక్రమణదారులుగా ముద్ర వేసి ఆ జీవో 118 ద్వారా ప్రజలను మోసం చేసి ఓట్లు వేయించుకున్నావు. ఎలక్షన్లు వచ్చిన ప్రతిసారి వారికి మోసపు మాటలు చెప్పినవ్' అని విమర్శించారు.తప్పుల తడకగా కన్వీనియన్స్ డీడ్ లను ప్రజలకు ఇప్పించి దగా చేశావు అని సుధీర్ రెడ్డిని ఉద్దేశించి విమర్శించారు.

2004 నుంచి హుడా చైర్మన్ గా, 2009లో, 2018 నుంచి మళ్ళీ ఎమ్మెల్యేగా ఉన్నావు. ఎందుకు సమస్యను శాశ్వతంగా పరిష్కరించలేదు.? అని ప్రశ్నించారు. మోసం నీ చరిత్ర. అన్ని అవకాశాలు కల్పించిన తల్లి లాంటి కాంగ్రెస్ ను,గెలిపించిన ప్రజలను వెన్నుపోటు పొడిచి పార్టీ మారావన్నారు. రిజిస్ట్రేషన్ల సమస్య పరిష్కారానికే పార్టీ మారుతున్నానని చెప్పి వెళ్లావని,ఇంకా రిజిస్ట్రేషన్ సమస్య పరిష్కరించకపోగా మాపై ఆరోపణలు చేస్తున్నందుకు సిగ్గుపడు అని అన్నారు.'హుడా అనుమతి పొందిన లే అవుట్ స్థలాలను కొనుగోలు చేసిన ప్రజలను జీవో 118తో భూ ఆక్రమణదారులుగా చిత్రీకరించడం సిగ్గు గా అనిపించటం లేదా సుధీర్ రెడ్డి..' అని అన్నారు.ఆ జీవోలో తప్పులు ఉన్నాయి సరి చేయాలంటూ సీసీఎల్ఏ ను కలిసినట్లు చెబుతున్నావు. ఆ జీవో పనికిరాదని అర్థం కదా. మళ్ళీ ప్రజల వద్దకు వెళ్లి మిగతా వారికి కూడా జీఓ 118 ద్వారా కన్వీనెన్సీ డీడ్ లు ఇప్పిస్తామంటూ సిగ్గు లేకుండా చెబుతున్నావు అని ప్రశ్నించారు.అప్పటికే జీవో 168 ఉండగా జీఓ 118 పనికి రాదు అని తెలిసి కూడా మీ అజ్ఞానంతో కన్వీనియన్స్ డీడీలు ఇప్పించారన్నారు.రాజకీయాల్లో మోసం, బట్టేబాజ్ పనులు చేయడం నీకు మరెవరు సాటిరారు సుధీర్ రెడ్డి..అని నీ వెంట ఉన్నటువంటి ఏ నాయకుడిని కార్పొరేటర్ గా కూడా గెలవనీయకుండా వెన్నుపోటు పొడిచిన చరిత్ర నీదని విమర్శించారు.రిజిస్ట్రేషన్ బాధిత కాలనీ ప్రజల సమస్యను ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి గారి దృష్టికి,మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి తీసుకెళ్లానని తెలిపారు.ఈ నెల 25 తర్వాత సీఎం రేవంత్ రెడ్డితోసమావేశం ఉంటుందని శాశ్వత పరిష్కారం దిశగా పనిచేస్తానని మధు యాష్కి చెప్పారు. తాము ఎన్నికల దృష్టిలో ఉంచుకొని రాజకీయ జిమ్మిక్కులు చేసే వ్యక్తులం కాదని,ఒక న్యాయవాదిగా సమస్య శాశ్వత పరిష్కారం దిశగా ప్రభుత్వంతో మాట్లాడతానని బాధితులకు హామీ ఇచ్చారు.రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ.. సుధీర్ రెడ్డి స్వార్థ రాజకీయాల కారణంగా రిజిస్ట్రేషన్ల సమస్య పరిష్కారం కాలేదని పేర్కొన్నారు భూ అక్రమదారులుగా మమ్మల్ని చిత్రీకరించిన జీవో 118 మాకు వద్దు అని ముక్తకంఠంతో నిషేధిత జాబితాలోని 22ఏ నుంచి తమ కాలనీల సర్వే నెంబర్లను తొలగించాలని బాధితులు కొరుతున్నట్లు తెలిపారు.

# రైతు భరోసా..అన్నదాత కులాస..

**రైతుల ఖాతాల్లో జమ అవుతున్న పెట్టుబడి సాయం.. తాజాగా నాలుగు ఎకరాల వరకు జమ**

**తొమ్మిది రోజుల్లో పూర్తికి ప్రభుత్వం నిర్ణయం.. ఆనందం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు**



**ఆదిలాబాద్, మహా:** ఎప్పుడెప్పుడా అని ఎదురుచూసిన రైతు భరోసా అన్నదాతల చెంతకు చేరుతోంది. ప్రభుత్వం రోజువారీగా రైతుల ఖాతాల్లో పెట్టుబడి సాయాన్ని జమ చేస్తోంది. ఇప్పటి వరకు నాలుగు ఎకరాలు కలిగిన వారికి జమ కాగా.. మిగిలిన రైతులందరికీ తొమ్మిది రోజుల్లో అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో పెట్టుబడి సాయం ఆతతగా ఎదురుచూసిన అన్నదాతలు ప్రభుత్వం నిర్ణయంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కొంత ఆలస్యమైనా విత్తనాలు, ఎరువులు, ఇతరాత్ర వ్యవసాయ సంబంధిత పరికరాల కొనుగోలుకు ఉపయోగపడుతాయని చెబుతున్నారు.

**రైతుల ఖాతాల్లో జమ**

ఆదిలాబాద్ జిల్లాలో ఖరీఫ్ సీజన్లో 4.40లక్షల ఎకరాల్లో పత్తి పంట సాగు చేయనుండగా.. సోయా 68వేల ఎకరాలు,కందులు 55వేలు,ఇతర పంటలు 27,800 ఎకరాల్లో సాగు చేయనున్నట్లు అధికారులు గుర్తించారు. జిల్లాలో మొత్తం 1,68,238 మంది రైతులు సాగు చేస్తున్నారు. వీరికి గాను ప్రస్తుతం ఎకరానికి రూ.6వేల చొప్పున ప్రభుత్వం 342.30కోట్లను ప్రభుత్వం పెట్టుబడి సాయం కింద అందజేస్తోంది. తాజాగా ఖరీఫ్ సీజన్లో బుధవారం వరకు నాలుగు ఎకరాల వరకు పెట్టుబడి సాయం అందజేయగా.. 84,990 మంది రైతులకు గాను 93.71కోట్లను వారి ఖాతాల్లో జమ చేసింది. మిగితా వారికి సైతం రోజువారీగా ఈ సాయాన్ని జమ చేస్తామని చెబుతోంది. ఈ ప్రక్రియ అంతా కేవలం తొమ్మిది రోజుల్లోనే పూర్తిచేస్తామని భరోసా ఇవ్వడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రైతులు వ్యవసాయంలో పెట్టుబడి కోసం నానా అవస్థలు పడేవారు. పంట పెట్టుబడి కోసం మధ్య దళారులను ఆశ్రయించడం.. అధిక వడ్డీలు చెల్లిస్తుండేవారు. ఈ క్రమంలో ప్రభుత్వం రైతులను ఆదుకోవాలనే ఉద్దేశ్యంతో పెట్టుబడి సాయాన్ని అందించాలని నిర్ణయించాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎకరానికి రూ.5వేల చొప్పున అందజేయగా.. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పెట్టుబడి సాయాన్ని రూ.వెయ్యి పెంచి ఎకరానికి రూ.6వేల చొప్పున అందజేస్తోంది. ఇది వరకు రబీ సీజన్లో రైతుల ఖాతాల్లో ఈ సాయాన్ని జమ చేయగా.. తాజాగా ఖరీఫ్ పంట కోసం జమ చేయడంతో అన్నదాతలకు మేలు జరగనుంది. నెల రోజుల ముందుగానే ఈ సాయాన్ని జమ చేయాల్సి ఉండగా.. నిధుల లేమి తదితర సమస్యల కారణంగా కొంత జాప్యం జరిగింది. దీంతో ఇది వరకే అనేక మంది రైతులు విత్తనాలు కొనుగోలు చేశారు. తాజాగా అందజేసిన డబ్బులు విత్తనాల కొనుగోలుతో పాటు ఎరువులు, వ్యవసాయ పనిముట్లు తదితర వాటిని కొనుగోలు చేసేందుకు ఉపయోగపడనున్నాయి.

**అందరికీ జమ అవుతాయి**

ప్రభుత్వం ఈ ఖరీఫ్ సీజన్కు సంబంధించి రైతు భరోసా నిధులను వారి ఖాతాల్లో జమ చేస్తోంది. ఇప్పటి వరకు నాలుగు ఎకరాల వరక కలిగిన రైతులకు ఈ సాయం అందింది. మిగితా వారికి కూడా త్వరలోనే జమ అవుతాయి. అర్హులైన అందరికీ ఈ పెట్టుబడి సాయం జమ అవుతుంది.

- శ్రీధర్ స్వామి,
జిల్లా వ్యవసాయశాఖ అధికారి

## ప్రభుత్వ పాఠశాలల పట్ల
# సానుకూలత హర్షణీయం

**టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్**



**ఆదిలాబాద్, మహా** ప్రభుత్వ పాఠశాలల పట్ల ప్రజల్లో సానుకూల దృక్పథం ఏర్పడటం హర్షనీయమని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ వెంకట్ అన్నారు. టిఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్ రోల్మెంట్ ప్రచార జాతాలో ఇది ప్రస్ఫుటమైందని తెలిపారు. బుధవారం సంఘం కార్యాలయంలో నిర్వహించిన ఆదిలాబాద్ జిల్లా ఆఫీసు బేరర్ల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల్లో టీఎస్ యూటీఎఫ్ ఎన్రోల్మెంట్ ప్రచార జాతా కార్యక్రమం నిర్వహించడం చారిత్రాత్మకమని అన్నారు. ఈ జాతాలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు టిఎస్ యూటీఎఫ్ సామాజిక బాధ్యతను విశేషంగా కొనియాడారని గుర్తు చేశారు. ఉపాధ్యాయులు, ప్రజలు స్వచ్ఛందంగా జాతాలో పాల్గొని ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు దన్నుగా నిలిచారన్నారు. వాటి ఫలితాలు ప్రభుత్వం చేపట్టిన బడిబాట కార్యక్రమంలో స్పష్టం అయ్యాయని పేర్కొన్నారు. అనేక మంది తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలల నుండి తీసుకొచ్చి, ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించారని పేర్కొన్నారు. ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు, పాఠశాలల అభ్యున్నతికి తమ సంఘం ఎల్లవేళలా కట్టుబడి ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు కె. కిష్టన్న, ప్రధాన కార్యదర్శి వి.అశోక్, ఉపాధ్యక్షులు టి. సూర్య కుమార్, కోశాధికారి కె. శ్రీనివాస్, కార్యదర్శులు ఎ. స్వామి, ఎ. ఇస్తారి, గౌస్ మొహియుద్దీన్, కె గణేష్, అశోక్ రెడ్డి తదితరులున్నారు.


## కుటీర పరిశ్రమల ఉపాధి పొందడం అభినందనీయం

**జిల్లా కలెక్టర్ రాజర్షి షా**



**ఆదిలాబాద్, మహా:** స్వయం సహాయక సంఘాలు గ్రూపులుగా ఏర్పడి కుటీర పరిశ్రమలను ఏర్పాటు చేసుకుని ఉపాధి పొందడం అభినందనీయమని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. పట్టణంలోని ఇందిరా నగర్ లో ఈగ విజయ లక్ష్మి, వీరాంజయనేయ స్వయం సహాయక సంఘాల అధ్వర్యంలో ఏర్పాటు చేసిన విజయ హేల్తీ ఫుడ్ యూనిట్ ను కలెక్టర్ ప్రారంభించారు. మైదా, చక్కర లేకుండా తయారు చేసిన బిస్కెట్లు, లడ్డూల గురించి అడిగి తెలుసుకుని మెషినరీని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..స్వయం సహాయక సంఘాల ద్వారా ప్రజలకు ఆరోగ్యకరమైన బిస్కట్లు, లడ్డూలు అందించడంతో పాటు మరికొంత మందికి ఉపాధి కల్పిస్తుండడం పట్ల అభినందనలు తెలిపారు. మెప్మా ద్వార అందిన రుణంతో పాటు మరికొంత సొంతంగా పెట్టుబడి పెట్టి వ్యాపారాన్ని వృద్ధి చేశారని, ప్రస్తుతం వంద మంది వరకు ఉపాధి పొందడం గొప్ప విషయమని అన్నారు. ఆహార పదార్థాల తయారీలో అనుభవం ఉన్న వారికి మరింత శిక్షణ ఇస్తే మంచి ఫలితాలు పొందవచ్చని పేర్కొన్నారు. మున్సిపల్ కమీషనర్ సీవీఎన్ రాజు, మెప్మా డీఎంసీ శ్రీనివాస్, సానిటరి ఇన్స్పెక్టర్ శంకర్, టీఎంసీ భాగ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.





# మంత్రులను కలిసిన కంది శ్రీనివాస రెడ్డి

**ఆదిలాబాద్, మహా:** ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రిగా నియమితులైన మంత్రి జూపల్లి కృష్ణారావు ,ఇటీవలి మంత్రివర్గవిస్తరణలో చోటు దక్కించుకుని రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన గడ్డం వివేక్ వెంకట స్వామి లను ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలో మంత్రులను శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.జిల్లాలో పార్టీ బలోపేతానికి సంబంధించిన విషయాలపై చర్చించారు. మంత్రులు ఆదిలాబాద్ రాజకీయ స్థితిగతులపై ఆరాతీశారు.

## ప్రజల భద్రతకు
# అత్యంత ప్రాధాన్యం

**జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్.. అభయ మై టాక్సీ ఇస్ సేఫ్ కార్యక్రమానికి శ్రీకారం**



**ఆదిలాబాద్, మహా:** నేరాల నియంత్రణతో పాటు ప్రజల భద్రతకు పోలీసు యంత్రాంగం అత్యంత ప్రాధాన్యతను ఇస్తూ వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుడుతోందని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. జిల్లలో తొలిసారిగా నిర్వహించిన అభయ మై టాక్సీ ఇస్ సేఫ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక ఇందిరా ప్రియదర్శిని మైదానంలో ఆటో లకు క్యూఆర్ కోడ్ లను అందించారు. క్యూ ఆర్ కోడ్ లకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించి ఆటోలకు అందచేశారు. దాదాపు మూడు వందల ఆటో లకు క్యూ ఆర్ కోడ్ స్కానర్ లను అందించారు. భారి ఎత్తున ఆటోలు తరలిరావడంతో మైదాన ప్రాంగణం కిక్కిరిసి కనిపించింది. క్యూ ఆర్ కోడ్ పని చేసే విధానం, దాని ద్వారా కలిగే లాభాలు ఇతరత్రా అంశాలను వివరించారు. ప్రతి ఆటోకు ప్రత్యేకంగా నంబర్ కేటాయించడంతో పాటు క్యూ ఆర్ కోడ్ ను స్కాన్ చేస్తే ఆటో డ్రైవర్ వివరాలు, ఆటో రిజిస్ట్రేషన్ నంబర్ కనబడేలా ఏర్పాటు చేశారు. ప్రయాణికులు ఆటో ఎక్కిన వెంటనే క్యూ ఆర్ కోడ్ ను స్కాన్ చేస్తే అందులో ఆప్షన్లు వస్తాయి. ట్రాక్ మై లొకేషన్ ఆప్షన్ ను ఎంచుకుంటే నేరుగా కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వార అనుసంధానం చేయబడి ఉన్నందున సెంటర్ నుండి ఫోన్ ను ట్రాక్ చేయడంతో పాటు సమాచారం తెలుసుకునే వీలు కల్పిస్తున్నారు. అనంతరం పలువురు ఆటో యూనియన్ ప్రతినిధులు ఎస్పీని సత్కరించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.... నేరాలు జరిగిన సమయంలో ఆటోలను కనుక్కోవడం కష్టతరంగా మారిందని, ఇందుకు పరిష్కారంగా పోలిసు శాఖా తరపున నంబర్లు కేటాయించి క్యూ ఆర్ స్కానర్ ను అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. జిల్లలో 3232 ఆటోలకు క్యూ ఆర్ కోడ్ లు అందించడం జరిగిందన్నారు. క్యూ ఆర్ కోడ్ ఉపయోగించే తీరును వివరిస్తూ ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వీటి ద్వార ప్రయాణికులతో పాటు ఆటోలకు సైతం భద్రత ఉంటుందని పేర్కొన్నారు. అభయ మై టాక్సీ సేఫ్ లో భాగంగా మూడు వందల యాభై రూపాయలు చెల్లిస్తే సంవత్సరం పాటు లక్ష రూపాయల బీమా వర్తిస్తుందని, ఆటో యజమానులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమం లో ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ సింగ్, డీఎస్పీ జీవన్ రెడ్డి, సీఐ లు సునీల్ కుమార్, కరుణాకర్ రావు, ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి టీజీ ప్రభుత్వం బకాయి పడ్డ
# 40 వేల కోట్ల ఇవ్వాలి

**మందమర్రి హెచ్ ఎం ఎస్ ఉపాధ్యక్షులు జే శ్రీనివాస్ డిమాండ్**



**మంచిర్యాల, మహా :** సింగరేణి కాలరీస్ కంపెనీకి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బకాయి పడ్డ 40 వేలకోట్ల రూపాయలను తక్షణమే చెల్లించాలని హెచ్ఎంఎస్ మందమర్రి ఏరియా బ్రాంచి ఉపాధ్యక్షులు జే శ్రీనివాస్ డిమాండ్ చేశారు. స్థానిక యూనియన్ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశం లో ఆయన మాట్లాడుతూ సింగరేణి బకాయి పడ్డ డబ్బులు తిరిగి చెల్లించకుంటే సింగరేణికి మణుగడ లేదని అన్నారు. సింగరేణి పారిశ్రామిక ప్రాంతంలో కొత్త గనులు ఏర్పాటు కావాలి అంటే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పాత మొండి బకాయిలను చెల్లించాలన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పడ్డాక సంస్థలో రాజకీయ జోక్యం ఎక్కువ అయిందని తెలిపారు. ఒక దశలో సింగరేణి పరిశ్రమలో లక్ష ఇరవైవేలమంది కార్మికులు విధులు నిర్వహిస్తుండగా ప్రస్తుతం ఆ సంఖ్య 39 వేల మందికి కుదిరించబడిందని ఆరోపించారు. ఒకవైపు కార్మికుల సంఖ్య రోజురోజుకు తగ్గుతుంటే కార్మిక సంఘాలు నూతన బొగ్గు గనుల కొరకు ప్రస్తావించడం లేదని విమర్శించారు. సింగరేణి నిధులను ఇంతకు క్రితం తెలంగాణలోని ప్రతి ఎమ్మెల్యేకు రెండు కోట్ల రూపాయలు ఇచ్చి కేసీఆర్ ప్రభుత్వం లూటీ చేసిందని ఆరోపించారు. అలాగే మంచిర్యాల ప్రభుత్వ మెడికల్ కళాశాలకు 500 కోట్ల రూపాయల నిధులను ప్రభుత్వం ఇవ్వడం ఎవడబ్బ జాగిరని అన్నారు.

## గిరిజన గ్రామాలలో మౌళిక వసతుల కల్పనకు చర్యలు

**మంచిర్యాల జిల్లా**
**గిరిజన అభివృద్ధి అధికారి జనార్ధన్**

**మంచిర్యాల, మహా :** ప్రధానమంత్రి ధర్తీ అభ జనభాగిదరి అభియాన్ కార్యక్రమం మంచిర్యాల జిల్లాలోని గిరిజన గ్రామాలలో మౌళిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవడం జరిగిందని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి జనార్ధన్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో మొదటి విడతగా 500 మంది గల గ్రామాలను 50 శాతం గిరిజన జనాభా గల 7 మండలాలలోని 11 గ్రామాలను ఎంపిక చేసి రాబోయే 5 సంవత్సరాలకు ప్రణాళిక ప్రకారం అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఈ నెల 19న కాసిపేట మండలం వెంకటాపూర్, నెన్నెల మండలంలోని జంగల్పేట్ గ్రామం, 20 నాడు కాసిపేట మండలం పల్లంగూడ, నెన్నెల మండలం కొత్తూరు గ్రామంలో, జన్నారం మండలం ఇంధనపల్లి, 21 న భీమారం మండలం బూరుగుపల్లి, దండేపల్లి మండలం లింగాపూర్, , 23 న హాజీపూర్ మడలం గడ్పూర్ గ్రామపంచాయతీ నాగారం గ్రామంలో కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఆయా గ్రామాలలో మౌళిక వసతులైన విద్య, వైద్యం, రవాణా, రోడ్ల నిర్మాణం, సంక్షేమం, ప్రభుత్వ పథకాల అమలు ముఖ్య ఉద్దేశ్యంగా మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, గిరిజన సంక్షేమశాఖ అధికారుల సమక్షంలో కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. గిరిజన ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

# అధికారంలోకి రావడానికి యూత్ కాంగ్రెస్ కృషి అమోఘం

**స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యం గా పనిచేయాలి.. యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు జక్కిడి శివ చరణ్ రెడ్డి**





**ఆదిలాబాద్, మహా:** రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో రావడానికి యూత్ కాంగ్రెస్ ఎంతో కృషి చేసిందని రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం అదిలాబాద్ లో నిర్వహించిన యూత్ కాంగ్రెస్ విస్తృతస్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మొదటిసారి ఆదిలాబాద్ కు వచ్చిన ఆయనకు యూత్ కాంగ్రెస్ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కొమరం భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రానున్న స్థానిక సంస్థలు ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా యూత్ కాంగ్రెస్ శ్రేణులు పని చేయాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. రానున్న స్థానిక సంస్థ ఎన్నికల్లో యూత్ కాంగ్రెస్ తరపున పోటీ చేస్తామన్నారు.

**పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి.. కంది శ్రీనివాస రెడ్డి**


యువజన కాంగ్రెస్ విస్తృత స్థాయి సమావేశం లో ప్రతేక ఆహ్వానితులుగా ఆదిలాబాద్ అసెంబ్లీ ఇంచార్జ్ కంది శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేయ్యాలన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదర్శవంతమైన పాలనా అందిస్తోందని సోషల్ మీడియా వింగ్ చాలా కీలకం అన్నారు.కేంద్రంలోని బీజేపీ ది ప్రచార ఆర్భాటమే తప్ప అసలైన సంక్షేమం కాదన్నారు. మన ప్రభుత్వం మంచి పథకాలు అమలుచేస్తున్నా ప్రజల్లోకి సరిగ్గా తీసుకెళ్లడంలేదన్నారు. రాహుల్ గాంధీని ప్రధాన మంత్రిని చెయ్యాల్సిన భాద్యత మనందరిపై ఉందన్నారు. బీసీ లకు 42% రిజర్వేషన్ అమలు చెయ్యాలని కేంద్రానికి ప్రతిపాదనలు పంపిన ఏకైక రాష్ట్రం మన తెలంగాణ అన్నారు.మంత్రి వర్గ విస్తీర్ణలో సామజిక న్యాయం పాటించిందన్నారు.జిల్లాలో యూత్ కాంగ్రెస్ మరింత బలోపేతం కావాలన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో ఎక్కువ స్థానాలు గెలుచుకోవాలన్నారు. అందుకు గట్టిగా కృషి చెయ్యాలన్నారు.ఎన్నికేదైనా గెలుపేలక్షంగా కాంగ్రెస్ పార్టీ, యూత్ కాంగ్రెస్, అనుబంధ సంఘాల నాయకులు కార్యకర్తలు ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమం లో తెలంగాణ రాష్ట్ర ఇంచార్జ్ ఖలీద్ అహ్మద్,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాజిద్ ఖాన్,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రమళ్ళ రామచంద్ర రెడ్డి,యువజన కాంగ్రెస్ ఆదిలాబాద్ జిల్లా ఇన్చార్జ్ అల్మాస్ ఖాన్,ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు సాయి చరణ్ గౌడ్,యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతన్ రావు,ఆదిలాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు హర్ఫాత్ ఖాన్,యువజన కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షులు నాహిద్ బోథ్ అసెంబ్లీ ప్రెసిడెంట్ బద్దం పోతారెడ్డి,యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ఉపాధ్యక్షుడు సామ రూపేష్ రెడ్డి,బోథ్ అసెంబ్లీ ఉపాధ్యక్షుడు అనీష్ తదితరులు పాల్గొన్నారు.



## జియో బ్లాక్‌రాక్ కొత్త ప్లాట్‌ఫామ్ అలాదీన్

జియో బ్లాక్‌రాక్ మ్యూచువల్ ఫండ్ పెట్టుబడులను మరింత సులభతరం చేసేందుకు 'అలాదీన్' ప్లాట్‌ఫామ్‌ను ఆవిష్కరించింది. దీంతో బ్లాక్‌రాక్‌కు చెందిన పెట్టుబడుల విశ్లేషణ, రిస్క్ నిర్వహణ ప్లాట్‌ఫామ్ మొదటిసారి భారత ఇన్వెస్టర్లకు అందుబాటులోకి వచ్చినట్టు సంస్థ ప్రకటించింది. ''పెట్టుబడులు ఇక ఎంతో సులభం. జియో ఫైనాన్షియల్, బ్లాక్‌రాక్ సంయుక్తంగా ఇదే నమ్మకాన్ని ఇన్వెస్టర్ల ముందుకు తీసుకొచ్చాయి. జియో డిజిటల్ ఫస్ట్ విధానానికి, బ్లాక్‌రాక్ సంస్థకు అంతర్జాతీయంగా పెట్టుబడుల్లో ఉన్న నైపుణ్యం కలగలసి ఇన్వెస్టర్లకు అనుకూలమైన సొల్యూషన్లను అందించనున్నాం''అని జియో బ్లాక్‌రాక్ మ్యూచువల్ ఫండ్ ఎక్స్ ప్లాట్‌ఫామ్‌పై ట్వీట్ చేసింది. ఇది ఆరంభం మాత్రమేనంటూ.. అందరికీ అందుబాటు ధరలకే పెట్టుబడుల సేవలను అందించనున్నట్టు పేర్కొంది. జియో బ్లాక్ రాక్ అసెట్ మేనేజ్మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ అనేది జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ (జెఎఫ్ఎస్ఎల్), యూఎస్ ఆధారిత బ్లాక్ రాక్ మధ్య 50:50 జాయింట్ వెంచర్.

## ఖరీదైన 1164 ఫ్లాట్లు.. 7 రోజుల్లో ఫినిష్!



దేశంలో హైఎండ్ ఇళ్లకు ఏ మాత్రం డిమాండ్ తగ్గడం లేదు. ధర ఎన్ని రూ.కోట్లయినా తగ్గేదే లేదంటున్నారు కొనుగోలుదారులు. ప్రముఖ రియల్ ఎస్టేట్ దిగ్గజం డీఎల్ఎఫ్ లిమిటెడ్ తన సరికొత్త లగ్జరీ రెసిడెన్షియల్ వెంచర్ ప్రివానా నార్త్‌లోని ఫ్లాట్లన్నీ కేవలం ఏడు రోజుల్లోనే పూర్తిగా అమ్మేసింది. గురుగ్రామ్‌లో 116 ఎకరాల సువిశాల టౌన్‌షిప్‌లో ఉన్న ఈ ప్రాజెక్ట్ రూ.11,000 కోట్లకు పైగా అమ్మకాలను సాధించింది. ఇది దేశంలోని పెద్ద నగరాల్లో ప్రీమియం గృహాలకు ఉన్న బలమైన మార్కెట్ డిమాండ్‌ను తెలియజేస్తోంది. గురుగ్రామ్‌లోని 76, 77 సెక్టార్లలో 17.7 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించిన ప్రివానా నార్త్ లో ఆరు ఎత్తైన 50 అంతస్తుల నిర్మాణాలు ఉన్నాయి. ఇప్పటి వరకు డీఎల్ఎఫ్ అభివృద్ధి చేసిన అత్యంత ఎత్తైన రెసిడెన్షియల్ టవర్లు ఇవే. 1,152 నాలుగు పడక గదుల అపార్ట్‌మెంట్లు, డజను లగ్జరీ పెంట్ హౌస్‌లు ఉన్న ఈ ప్రాజెక్టులో ఒక్కో ఫ్లాట్ ధర రూ.9.5 కోట్ల నుంచి రూ.25 కోట్ల వరకు ఉంది. డీఎల్ఎఫ్ గత లగ్జరీ లాంచ్‌లలో కనిపించిన విజయాన్ని ప్రతిబింబిస్తూ దేశీయ, అంతర్జాతీయ కొనుగోలుదారులు ఈ ప్రాపర్టీలను కొనుగోలు చేశారు. డీఎల్ఎఫ్ గతంలో లాంచ్ చేసిన ప్రివానా సౌత్, ప్రివానా వెస్ట్ ప్రాజెక్టులలో సైతం ఇలాగే వేగంగా అమ్మకాలు నమోదయ్యాయి. హైఎండ్ నివాసాలకు ఉన్న డిమాండ్, డీఎల్ఎఫ్ నివాస ప్రాజెక్టులపై కొనుగోలుదారులకు ఉన్న నమ్మకమే ఈ భారీ ప్రతిస్పందనకు కారణమని కంపెనీ నాయకత్వం పేర్కొంది. ప్రివానా నార్త్ వేగవంతమైన అమ్మకాలు హైఎండ్ గృహాల పట్ల విస్తృత ధోరణిని హైలైట్ చేస్తాయి. 2025 తొలి త్రైమాసికంలో రూ.4 కోట్లకు పైబడిన ఇళ్ల అమ్మకాలు 28 శాతం పెరిగాయని, ఇందులో ఢిల్లీఎన్‌సీఆర్ వాటా సింహభాగం ఉందని సీబీఆర్‌ఈ తెలిపింది. 2025 ఆర్థిక సంవత్సరంలో డీఎల్ఎఫ్ రికార్డు స్థాయిలో రూ.21,223 కోట్ల ప్రీ సేల్స్ సాధించింది. భవిష్యత్తులో గురుగ్రామ్, ముంబై, గోవాలలో లాంచ్ చేసే ప్రాజెక్టులకు సైతం ఇలాంటి స్పందనే వస్తుందని కంపెనీ ఆశిస్తోంది.




## మారుతీ కార్లు కొనేవారికి ఊరట..

ఆటోమొబైల్స్ దిగ్గజం మారుతీ సుజుకీ తమ కస్టమర్లకు వాహన రుణాల సదుపాయాన్ని అందించేందుకు ఈక్విటాస్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకుతో చేతులు కలిపింది. కొత్త కార్లు, యూజ్డ్ కార్లు, వాణిజ్య వాహనాలకి రిటైల్ రుణాల కోసం ఈ ఒప్పందం ఉపయోగపడుతుందని మారుతీ సుజుకీ తెలిపింది. మరింత పెద్ద సంఖ్యలో కస్టమర్లకు చేరువయ్యేందుకు, ఆకర్షణీయమైన ఫైనాన్సింగ్ ఆఫర్లు అందించేందుకు ఇది తోడ్పడుతుందని మారుతీ సుజుకీ ఇండియా సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (మార్కెటింగ్, సేల్స్) పార్థో బెనర్జీ తెలిపారు.

**మహీంద్రా చేతికి ఎస్ఎంఎల్ ఇసుజు**

వాణిజ్య వాహన తయారీ కంపెనీ ఎస్ఎంఎల్ ఇసుజులో మెజారిటీ వాటా సొంతం చేసుకునేందుకు దేశీ ఆటో రంగ దిగ్గజం మహీంద్రా అండ్ మహీంద్రా(ఎంఅండ్ఎం) అనుమతి పొందింది. ఇందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు కాంపిటీషన్ కమిషన్(సీసీఐ) తాజాగా ఎక్స్‌లో పోస్ట్ ద్వారా వెల్లడించింది. ఎస్ఎంఎల్ ఇసుజులో 58.96 శాతం వాటా కొనుగోలు చేయనున్నట్లు ఏప్రిల్‌లో ఎంఅండ్ఎం ప్రకటించింది. ఇందుకు రూ. 555 కోట్లు వెచ్చించనున్నట్లు తెలియజేసింది. దీనిలో భాగంగా సంస్థలో సుమితోమో కార్పొరేషన్‌కున్న పూర్తి వాటా(43.96 శాతం)ను కొనుగోలు చేయనున్నట్లు ఏప్రిల్‌లో పేర్కొంది. అంతేకాకుండా పబ్లిక్ వాటాదారుగా ఉన్న ఇసుజు మోటార్స్ నుంచి 15 శాతం వాటా సొంతం చేసుకోనున్నట్లు వివరించింది.

## నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు




దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు బుధవారం నష్టాల్లో ముగిశాయి. ఇంట్రాడేలో 81,237 వద్ద కనిష్టాన్ని తాకిన బీఎస్ఈ సెన్సెక్స్ 138.64 పాయింట్లు (0.17 శాతం) క్షీణించి 81,444.66 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 50 కూడా 41.35 పాయింట్లు లేదా 0.17 శాతం క్షీణించి 24,812.05 వద్ద ముగిసింది. విస్తృత మార్కెట్లలో నిఫ్టీ మిడ్ క్యాప్ 100, నిఫ్టీ స్మాల్ క్యాప్ 100 సూచీలు వరుసగా 0.46 శాతం, 0.23 శాతం నష్టపోయాయి. రంగాలవారీగా చూస్తే నిఫ్టీ మీడియా 1.27 శాతం నష్టపోగా, నిఫ్టీ ఐటీ, మెటల్, ఆయిల్ అండ్ గ్యాస్ రియల్టీ, ఎనర్జీ, పీఎస్‌యూ బ్యాంక్, ఎఫ్ఎంసీజీ షేర్లు నష్టపోయాయి. మరోవైపు నిఫ్టీ కన్జ్యూమర్ డ్యూరబుల్స్, ఆటో, బ్యాంక్ లాభాల్లో ముగిశాయి. టీసీఎస్, అదానీ పోర్ట్స్, హిందుస్థాన్ యూనిలీవర్, నెస్లే ఇండియా, బజాజ్ ఫిన్‌సర్వ్, ఎన్టీపీసీ షేర్లు 1.6 శాతం వరకు నష్టపోయాయి. ఇండస్ ఇండ్ బ్యాంక్, టైటాన్, మహీంద్రా అండ్ మహీంద్రా, మారుతీ సుజుకీ, ఏషియన్ పెయింట్స్, భారతీ ఎయిర్ టెల్ 4.4 శాతం వరకు లాభపడ్డాయి. మార్కెట్లలో ఒడిదుడుకులను అంచనా వేసే ఇండియా వీఐఎక్స్ 0.89 శాతం క్షీణించి 14.27 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఇజ్రాయెల్‌ఇరాన్ వివాదం తీవ్రతరం కావడంతో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించడంతో మార్కెట్లు ఒడిదుడుకులకు లోనయ్యాయి. ఇజ్రాయెల్ వైమానిక దాడుల్లో నాటాంజ్ వద్ద ఇరాన్ భూగర్భ యురేనియం కర్మాగారం దెబ్బతిన్నదన్న వార్తల నేపథ్యంలో ఇరు దేశాల మధ్య క్షిపణి దాడులు ఐదో రోజు కూడా కొనసాగాయి. దీనికి తోడు అమెరికా ఫెడరల్ రిజర్వ్ విధాన నిర్ణయం, భవిష్యత్తులో రేట్ల కోత, ముడి చమురు ధరలు పెరగడం వల్ల అమెరికా ఆర్థిక వ్యవస్థకు కలిగే నష్టాలపై చైర్మన్ జెరోమ్ పావెల్ వ్యాఖ్యానం కోసం ఇన్వెస్టర్లు ఎదురుచూస్తున్నారు.



## రూ.3 వేలకే ఫాస్టాగ్ పాస్

**ఏడాదికి 200 ట్రిప్పులు.. కేంద్రం కీలక నిర్ణయం.. హైవే ప్రయాణం ఇక సులభం**




**న్యూఢిల్లీ, మహా :** హైవేలపై రాకపోకలు సాగించే వాహనదారులకు కేంద్ర ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. దేశవ్యాప్తంగా హైవే ప్రయాణాన్ని మరింత సులభతరం చేసే దిశగా కేంద్ర సర్కారు కీలక నిర్ణయం తీసుకుంది. కేవలం రూ.3వేలతో ఫాస్టాగ్ ఆధారిత వార్షిక పాస్‌ను తీసుకుంటే దేశవ్యాప్తంగా అన్ని జాతీయ రహదారులపై నిశ్చింతగా, సాఫీగా ఏడాదంతా రాకపోకలు సాగించొచ్చు. ఈ ఏడాది ఆగస్టు 15 నుంచే వార్షిక పాస్‌ల జారీ ప్రక్రియ మొదలవుతుందని కేంద్ర రోడ్డు రవాణా, హైవేల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ బుధవారం వెల్లడించారు. ఈమేరకు ఆయన 'ఎక్స్' వేదికగా ఒక పోస్ట్ చేశారు. ఫాస్టాగ్ వార్షిక పాస్‌ల జారీ కోసం త్వరలోనే రాజ్‌మార్గ్ యాత్రా యాప్ తో పాటు ఎన్‌హెచ్ఏఐ, ఎంఆర్‌టీహెచ్ అధికారిక వెబ్‌సైట్లలో ప్రత్యేకమైన లింక్ యాక్టివేట్ అవుతుందని గడ్కరీ తెలిపారు. దాని ద్వారానే ఫాస్టాగ్ వార్షిక పాస్‌ల యాక్టివేషన్, రెన్యూవల్ చేయించుకోవచ్చన్నారు.

### 200 వాహన ట్రిప్పులు - ఏడాది వ్యవధి

ఫాస్టాగ్ వార్షిక పాస్ అనేది యాక్టివేట్ చేసుకున్న తేదీ నుంచి ఏడాది పాటు పని చేస్తుంది. ఈ వ్యవధిలో దేశంలోని అన్ని జాతీయ రహదారులపై గరిష్ఠంగా 200 వాహన ట్రిప్పులు ప్రయాణించొచ్చు. 200 వాహన ట్రిప్పులు, ఏడాది వ్యవధి.. ఈ రెండింటిలో ఏది ముందు వస్తే అప్పటితో ఫాస్టాగ్ వార్షిక పాస్ చెల్లుబాటు గడువు ముగుస్తుంది. ఆ తర్వాత మళ్లీ రూ.3వేల ఫీజును చెల్లించి, దాన్ని రెన్యూవల్ చేయించుకోవాలి. ఈ వార్షిక పాస్ కార్లు, జీపులు, వ్యాన్లు వంటి నాన్ కమర్షియల్ ప్రైవేటు వాహనాల కోసమే.

### సమయం ఆదా చేయాలంటే ఈ పాస్ తీసుకోండి

హైవేలపై సగటున ప్రతీ 60 కి.మీ పరిధిలో ఒక టోల్ ప్లాజా ఉంటుంది. ఆయా చోట్ల ఆగకుండా నిరాటంకంగా ప్రయాణాలు సాగించాలని భావించే వారికి ఫాస్టాగ్ వార్షిక పాస్ ప్రయోజనకరంగా ఉంటుంది. నిత్యం హైవేలపై రాకపోకలు సాగించే వారు దీన్ని ఎంపిక చేసుకోవచ్చు. ఫలితంగా ఎంతో విలువైన సమయం ఆదా అవుతుంది. పదేపదే టోల్ ప్లాజాల వద్ద ఆగి, వాహన లైన్లలో ఉండి చెల్లింపులు జరపాల్సిన అవసరం ఉండదు. సింగిల్ పేమెంట్‌తో ఫాస్టాగ్ వార్షిక పాస్‌ను తీసుకుంటే, ఏడాదంతా టోల్ ప్లాజాల వద్ద ఆగి చెల్లింపులు జరపాల్సిన అవసరం తప్పుతుంది. వార్షిక పాస్‌ల జారీ ద్వారా టోల్ ప్లాజాల వద్ద వాహన క్యూలైన్లను చాలావరకు తగ్గించొచ్చని కేంద్ర రవాణా శాఖ భావిస్తోంది.

### నెలవారీ ఫాస్టాగ్ పాస్ ఛార్జీలతో పోలిస్తే రూ.1,080 ఆదా

హైవేలపై నిత్యం రాకపోకలు సాగించే ఎంతోమంది ప్రస్తుతానికి నెలవారీ ఫాస్టాగ్ పాస్‌లను తీసుకుంటున్నారు. ఇంటి చిరునామా వెరిఫికేషన్, అవసరమైన డాక్యుమెంట్లను సమర్పించి ఈ పాస్‌లను పొందుతున్నారు. నెలవారీ ఫాస్టాగ్ పాస్ ధర ప్రస్తుతం రూ.340గా ఉంది. అంటే సంవత్సరానికి దాదాపు రూ.4,080 దాకా ఖర్చవుతుంది. ఈ ఏడాది ఆగస్టు 15 నుంచి అందుబాటులోకి రానున్న వార్షిక ఫాస్టాగ్ పాస్ ధర కేవలం రూ.3వేలే. దీన్ని వాహనదారులు తీసుకుంటే దాదాపు రూ.1,080 దాకా ఆదా అవుతుంది. దీంతోపాటు ఏడాదంతా హైవేలపై నిరాటంకంగా రాకపోకలు సాగించొచ్చు. డబ్బుకు డబ్బు, సమయానికి సమయం ఆదా అవుతాయి. దీన్ని వాహనదారులకు లభిస్తున్న లక్కీ ఛాన్స్‌గా పరిశీలకులు అభివర్ణిస్తున్నారు.

### ప్రైవేటు వాహనాల క్యూను తగ్గించడమే లక్ష్యం

**2023-2024 ఆర్థిక సంవత్సరంలో దేశంలోని టోల్ ప్లాజాల నుంచి రూ.55వేల కోట్ల రాబడి వచ్చింది. ఇందులో ప్రైవేటు కార్ల వాటా కేవలం రూ. 8వేల కోట్లే. ఏటా టోల్ ప్లాజాల మీదుగా 53 శాతం మేర రాకపోకలు సాగించేది కార్లే. అయినప్పటికీ వాటి నుంచి 21 శాతమే రాబడి లభిస్తోంది. రోజూ ఉదయం 6 గంటల నుంచి 10 గంటల మధ్య టోల్ ప్లాజాలకు పోటెత్తుతున్న వాహనాల్లో 60 శాతం ప్రైవేటు వాహనాలే ఉంటున్నాయి. ఇక ఇదే సమయంలో వాణిజ్య వాహనాలు రాత్రి, పగలు అనే తేడా లేకుండా రోజంతా రాకపోకలు సాగిస్తూనే ఉంటాయి. అందుకే ప్రైవేటు వాహనాలకు ఫాస్టాగ్ ఆధారిత వార్షిక పాస్‌లను జారీ చేయాలని కేంద్రం నిర్ణయించింది. తద్వారా వాటి వల్ల టోల్ ప్లాజాల్లో ఏర్పడుతున్న క్యూ లైన్లను తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకుంది.**

## 3 నెలల క్రితమే కొత్త ఇంజిన్

- రూ.4000 కోట్లకు పైగా బీమా
- ఎయిరిండియా విమాన ప్రమాద దర్యాప్తులో కీలక విషయాలు

**అహ్మదాబాద్, మహా :** అహ్మదాబాద్‌లో ఇటీవల జరిగిన ఎయిరిండియా విమాన ప్రమాద ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర విషాదాన్ని నింపింది. జూన్ 12న సంభవించిన ఈ దుర్ఘటనలో 274 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రమాదంపై కొనసాగుతున్న దర్యాప్తులో పలు కీలక అంశాలు వెలుగులోకి వస్తున్నాయి. సుమారు 12 సంవత్సరాలుగా వినియోగంలో ఉన్న ఈ బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్ విమానం కుడివైపు ఇంజిన్‌ను కేవలం మూడు నెలల క్రితమే ఓవర్‌హాలింగ్ సమయంలో అమర్చినట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. ఈ విమానానికి చివరి సారిగా జూన్ 2023లో నిర్వహణ పనులు చేపట్టగా, తదుపరి షెడ్యూల్ ప్రకారం డిసెంబర్ 2025లో నిర్వహించాల్సి ఉంది. ఇదిలా ఉండగా, ప్రమాదానికి గురైన విమానానికి సంబంధించిన బీమా వివరాలు చర్చనీయాంశంగా మారాయి. ఈ ప్రమాదం కారణంగా దేశ చరిత్రలోనే అతిపెద్ద విమాన బీమా క్లెయిమ్ నమోదయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. ప్రమాదానికి గురైన ఈ బోయింగ్ డ్రీమ్‌లైనర్ విమానానికి సంబంధించి ఎయిర్ ఇండియా సంస్థ బీమా కవరేజీని ఇంజిన్ మార్పిడికి ముందే రూ.750 కోట్ల నుంచి రూ.850 కోట్లకు పెంచింది. ఈ ప్రమాదానికి సంబంధించి ప్రభుత్వ రంగ నాన్‌లైఫ్ ఇన్స్యూరెన్స్ దిగ్గజం జనరల్ ఇన్స్యూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (జీఐసీ) మొత్తం క్లెయిమ్‌లు సుమారు 475 మిలియన్ డాలర్లు (భారత కరెన్సీలో సుమారు రూ.4,091 కోట్లు)గా అంచనా వేసింది. ఇది మన దేశంలో ఇప్పటివరకు నమోదైన అత్యధిక విమాన బీమా క్లెయిమ్‌గా రికార్డు సృష్టించే అవకాశం ఉంది. ఈ భారీ మొత్తంలో విమానం నష్టానికి గాను 125 మిలియన్ డాలర్లు కాగా, ప్రయాణికుల కుటుంబాలకు చెల్లించాల్సిన పరిహారం, థర్డ్ పార్టీ నష్టాలు, ఇతర వ్యక్తులకు జరిగిన నష్టాలు, ట్రావెల్ పాలసీల కింద మరో 350 మిలియన్ డాలర్లు చెల్లించాల్సి ఉంటుందని జనరల్ ఇన్స్యూరెన్స్ సీఎండీ రామస్వామి నారాయణన్ వెల్లడించారు. ప్రమాదం కారణంగా ఎయిర్ ఇండియా చెల్లించాల్సిన పరిహారం, నష్టాల చెల్లింపులు వంటివి కూడా కలిసి విమానం అసలు ఖరీదు కంటే దాదాపు రెండున్నర రెట్లు అధికంగా ఉండటం గమనార్హం. ప్రస్తుతం ఈ ఘటనపై దర్యాప్తు ముమ్మరంగా కొనసాగుతోంది.

## 'భారత్‌పాక్ యుద్ధాన్ని నేనే ఆపా.. ఐలవ్ పాకిస్తాన్'



**వాషింగ్టన్:** ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత్‌పాకిస్తాన్‌ల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం జరిగింది. అయితే, ఈ కాల్పుల విరమణ ఒప్పందాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి తన ఖాతాలో వేసుకున్నాడు. ఇప్పటికే భారత్‌పాక్‌ల మధ్య యుద్ధాన్ని తానే ఆపానంటూ ఊదరగొట్టిన ట్రంప్ తాజాగా మరోసారి అదే పాటపాడారు. భారత్‌పాకిస్తాన్ సీజ్‌ఫైర్‌లో అమెరికా జోక్యం చేసుకోలేదని ప్రధాని మోదీ ప్రకటన చేశారు. ప్రధాని మోదీ వ్యాఖ్యలపై ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. 'యుద్ధాన్ని నేనే ఆపా.. ఐలవ్ పాకిస్తాన్.రెండు న్యూక్లియర్ దేశాలు కావడంతో యుద్ధాన్ని ఆపాను. మోదీ గొప్ప వ్యక్తి ఆయనతో రాత్రి మట్లాడా. గత రాత్రే భారత్ అమెరికా ట్రేడ్ గురించి ఆయనతో మాట్లాడాను'అని ట్రంప్ వ్యాఖ్యానించారు.

## ఈ నేషనల్ హైవేలపై జాగ్రత్త!



**మహా:** నేషనల్ హైవేలపై రయ్ అంటూ దూసుకుపోతున్నారా? అయితే ఈ వార్త మీ కోసమే. మన దేశంలో ఏటా రోడ్డు ప్రమాదాల్లో లక్షలాది మంది ప్రాణాలు కోల్పోతున్నారు. లక్షల్లో క్షతగాత్రులవుతున్నారు. సుదూర ప్రాంతాలను కలిపే జాతీయ రహదారులపైనా జరుగుతున్న యాక్సిడెంట్లు ఎంతో మందిని బలితీసుకుంటున్నాయి. 2022 కేంద్ర ప్రభుత్వ గణాంకాల ప్రకారం దేశంలో మొత్తం 4,61,312 రోడ్డు ప్రమాదాలు జరగ్గా.. నేషనల్ హైవేలపై 1,51,997 యాక్సిడెంట్లు చోటుచేసుకున్నాయి. అదే ఏడాది మొత్తం రోడ్డు ప్రమాదాల్లో 1,68,491 మరణాలు నమోదయ్యాయి. జాతీయ రహదారులపై జరిగిన ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య 61,038.

**మోస్ట్ డేంజర్.. ఎన్‌హెచ్-44**

అయితే జాతీయ రహదారుల్లో కొన్ని అత్యంత ప్రమాదకరంగా మారాయని సేవ్‌లైఫ్ ఫౌండేషన్ వెల్లడించింది. 2023 ప్రమాదాల గణాంకాల ప్రకారం 100 హైవేలకు ఈ సంస్థ ర్యాంకులు ఇచ్చినట్టు నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఏఐ) అధికారులు తెలిపారు. ఉత్తరాన శ్రీనగర్ నుంచి దక్షిణాన కన్యాకుమారి వరకు విస్తరించి, దేశంలోని అతి పొడవైన రహదారిగా గుర్తింపు పొందిన ఎన్‌హెచ్ 44 అత్యంత ప్రమాదకరమైన హైవేగా తేలింది. హరియాణా, ఢిల్లీలో 44వ నంబరు జాతీయ రహదారిపై 2023లో జరిగిన ప్రమాదాల్లో ఎక్కువ మరణాలు సంభవించినట్టు వెల్లడైంది.

**కిలోమీటర్‌కు 3 మరణాలు**

ఎన్‌హెచ్ 44 హరియాణాలో 266 కిలోమీటర్లు విస్తరించి ఉంది. 2023లో ఈ రహదారిపై జరిగిన ప్రమాదాల్లో 715 మంది దుర్మరణం పాలయ్యారు. అంటే కిలోమీటర్‌కు మూడు మరణాలు సంభవించాయి. ఢిల్లీలో 30 కిలోమీటర్ల మేర విస్తరించిన ఈ హైవేపై 63 మంది మృత్యువాత పడ్డారు. కిలోమీటర్‌కు దాదాపు 2 మరణాలు నమోదయ్యాయి. ముకర్బా చౌక్ సంఘూ బోర్డర్, ఆశారాం బహదూర్‌పూర్ డేంజర్ స్పాట్లగా గుర్తించారు. హరియాణా పరిధిలో 85 కిలోమీటర్ల మేర ఎన్‌హెచ్ 48 విస్తరించివుంది. ఈ రూట్లో గుర్గావ్ రాజస్థాన్ బోర్డర్‌ను మూడో డేంజర్ జోన్‌గా పేర్కొంటున్నారు. జాతీయ రహదారులపై ఎక్కడెక్కడ ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయో గుర్తించి, వాటిని నివారించడానికి చేపట్టాల్సిన చర్యలు చేపట్టడానికి ఈ డేటా ఉపయోగపడుతుందని ఎన్‌హెచ్ఏఐ అధికారులు తెలిపారు. రక్షణ చర్యల కోసం హైవే బిల్డర్లు, ఆపరేటర్లను ఆదేశించడానికి ఈ గణాంకాలు దోహదపడతాయన్నారు.





# హీరామండి సక్సెస్..
## అవకాశాల కోసం వెయిటింగ్
### అదితిరావు హైదరి

బాలీవుడ్ నటి అదితి రావు హైదరీ గతేడాది పెళ్లిబంధంలోకి అడుగుపెట్టింగి. హీరో సిద్ధార్థ్‌ను పెళ్లాడిన ఈ ముద్దుగుమ్మ ప్రస్తుతం వైవాహిక జీవితంలో ఫుల్ బిజీగా మారిపోయింది. ఆమె చివరిసారి సంజయ్ లీలా భన్సాలీ తెరకెక్కించిన వెబ్ సిరీస్ 'హీరామండి: ది డైమండ్ బజార్'లో కనిపించింది. ఈ సిరీస్‌లో తన నటనకు గానూ ప్రశంసలు అందుకున్నారు. అయితే ఈ సిరీస్ తర్వాత పెళ్లి చేసుకున్న బ్యూటీ.. ఇప్పటి వరకు ఎలాంటి కొత్త సినిమాను ఓకే చేయలేదు. ఈ విషయాన్ని తాజా ఇంటర్వ్యూలో అదితి రావు హైదరీ వెల్లడించింది. ముఖ్యంగా సినీ పరిశ్రమలో మహిళలు ఎదుర్కొంటున్న సవాళ్ల గురించి మాట్లాడింది. అదితి రావు మాట్లాడుతూ.. 'హీరామండి తర్వాత నాకు చాలా అద్భుతంగా అనిపించింది. ఎందుకంటే చాలా ప్రేమ, ప్రశంసలు వచ్చాయి. అయితే నేను నా నెక్స్ ఎలాంటి సినిమాకు ఇప్పటి వరకు సంతకం చేయలేదు. ఇంకా అవకాశాల కోసం వేచి ఉన్నా. జీవితంలో సమాన భాగస్వామిలాగే తెరపై మహిళలకు కూడా సమాన అవకాశాలు రావాలని కోరుకుంటున్నా' అని పంచుకుంది. కాగా.. బాలీవుడ్ డైరెక్టర్ సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వం వహించిన 'హీరామండి: ది డైమండ్ బజార్' మే 1, 2024న నెట్‌ఫ్లిక్స్‌లో విడుదలైంది. ఈ సిరీస్‌లో మనీషా కోయిరాలా, సోనాక్షి సిన్హా, రిచా చద్దా, సంజీదా షేక్, షర్మిన్ సెగల్, తహా షా బాదుస్షా, అదితి రావు హైదరీ కీలక పాత్రల్లో మెప్పించారు. ప్రస్తుతం అదితి రావు హైదరి 'ఓ సాథీ రే'లో అనే సిరీస్‌లో నటించనుంది. ఆ తర్వాత 'పరివారిక్ మనురంజన్' అనే ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌లో కనిపించనుంది.

# ఓరి బాబోయ్..
## మ్యాడ్ హీరోయిన్ ఇంత టాలెంటెడా?


సాధారణంగా హీరోయిన్లు అనగానే చాలామందికి ఓ అభిప్రాయం ఉంటుంది. గ్లామర్ చూపించో లేదంటే యాక్టింగ్ చేసో ఛాన్సులు కొట్టేస్తుంటారు అని అనుకుంటారు. అయితే వీళ్లలో కొందరు మాత్రం మల్టీ టాలెంటెడ్ పర్సన్స్ ఉంటారు. అంటే ఒకరిలోనే చాలా టాలెంట్స్ అనమాట. ఇప్పుడు ఇదంతా ఎందుకు చెబుతున్నాం అంటే 'మ్యాడ్'లో ఓ హీరోయిన్‌గా చేసిన అనంతిక అనే అమ్మాయి కోసం. రీసెంట్‌గానే ఇంటర్మీడియట్ పూర్తి చేసిన ఈమె పూర్తి పేరు అనంతిక సనీల్ కుమార్. 19 ఏళ్ల ఈ కేరళ కుట్టి.. 2015 నుంచి సినిమాలు చేస్తోంది. తొలుత మిలీ, లాల్ సలామ్, రైడ్ అనే తమిళ సినిమాలు చేసింది గానీ పెద్దగా గుర్తింపు రాలేదు. తెలుగులో 'మ్యాడ్' చిత్రంలో ఓ హీరోయిన్‌గా చేసి హిట్ కొట్టిన తర్వాత దర్శకనిర్మాతల దృష్టిలో పడింది. 'రాజమండ్రి రోజ్ మిల్క్' అనే మరో తెలుగు మూవీలో లీడ్ రోల్ అవకాశమొచ్చింది. కాకపోతే ఆ మూవీ ఇంకా రిలీజ్ కాలేదు. అయితేనేం తెలుగులో బడా నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ తీసిన '8 వసంతాలు' సినిమాలో హీరోయిన్ ఛాన్స్ వచ్చింది. జూన్ 20న '8 వసంతాలు' సినిమా థియేటర్లలో రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో మంగళవారం ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అనంతిక తన టాలెంట్స్ అన్నీ బయటపెట్టింది. ఇన్ని రోజులు ఈమె ప్రతిభావంతురాలు అనే టాక్ ఉంది గానీ ఇప్పుడు దాన్ని రియాలిటీలో చూపించింది. దీంతో ఈమె గురించి ఇప్పుడు టాలీవుడ్‌లో మాట్లాడుకుంటున్నారు. ప్రస్తుతం లా(న్యాయవాది) కోర్స్ చేస్తున్న అనంతిక.. క్లాసికల్ డ్యాన్స్ చేస్తుంది. కరాటేలో ఈమెకు బ్లాక్ బెల్ట్ ఉంది. కేరళకు చెందిన కళరిపయట్టు అనే మార్షల్ ఆర్ట్ కూడా వచ్చు. కత్తి ఫైటింగ్‌లోనూ ఈమె సిద్ధహస్తురాలే. అలానే కేరళ సంప్రదాయంలో ఒకటైన చెండా (డ్రమ్స్) కూడా బాగానే వాయిస్తుంది. ఇలా అనంతిక ఇన్నింట్లో ప్రతిభావంతురాలు అని తెలిసి నెటిజన్లు ఆశ్చర్యపోతున్నారు. 19 ఏళ్లకే ఇలా ఉందంటే.. రాబోయే రోజుల్లో ఇంకెన్ని నేర్చుకుంటుందో?





# సితారే జమీన్ పర్ రిలీజ్..
## రూ.120 కోట్ల డీల్‌కు నో చెప్పిన అమిర్ ఖాన్!

బాలీవుడ్ స్టార్ అమిర్ ఖాన్ నటించిన తాజా చిత్రం సితారే జమీన్ పర్. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా జూన్ 20న థియేటర్లలో విడుదల కానుంది. ఈ చిత్రంలో జెనీలియా దేశ్‌ముఖ్ కూడా ప్రధాన పాత్రలో నటించారు. ఈ సినిమాకు ఆర్‌ఎస్ ప్రసన్న దర్శకత్వం వహించారు. ఈ చిత్రాన్ని ఆమిర్ ఖాన్, అపర్ణ పురోహిత్ నిర్మించారు. ఇటీవలే సెన్సార్ ప్రక్రియ కూడా పూర్తి చేసుకుంది. ఎటువంటి కట్స్ లేకుండానే సితారే జమీన్ పర్ విడుదలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అయితే తాజాగా ఈ సినిమాకు సంబంధించిన ఓటీటీ డీల్ తెగ వైరలవుతోంది. ఈ మూవీకి దాదాపు రూ.120 కోట్ల భారీ ధరకు కొనుగోలు చేసేందుకు అమెజాన్ ప్రైమ్ ముందుకొచ్చింది. అయితే ఈ డీల్‌ను అమిర్ ఖాన్ తిరస్కరించినట్లు తెలుస్తోంది. ఈ సినిమా కేవలం థియేటర్లలోనే ఆడుతుందని.. ఓటీటీలో విడుదల ఉండదని అమిర్ ఖాన్ స్పష్టం చేసినట్లు సమాచారం. ఓటీటీలో సినిమా రిలీజ్ చేయకపోవడం వల్ల ఆడియన్స్ థియేటర్లకు రప్పించేందుకు అమిర్ ఖాన్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే సితారే జమీన్ పర్ థియేటర్లలో ప్రదర్శన తర్వాత యూట్యూబ్‌లో అందుబాటులో ఉంచుతారని అమిర్ ఖాన్ చెబుతున్నారు. కానీ అది ఉచితం కాదు.. ప్రేక్షకులు సినిమా చూడటానికి డబ్బు చెల్లించాల్సి ఉంటుంది. కానీ ఈ చిత్రం థియేటర్లలో విడుదలైన వెంటనే యూట్యూబ్‌లో అందుబాటులోకి వస్తుందో లేదో అన్నదానిపై క్లారిటీ లేదు. అయితే ఎనిమిది వారాల థియేటర్ రన్ తర్వాత విడుదల కోసం అమెజాన్ రూ. 120 కోట్లు ఆఫర్ చేసింది.



# రూ.1 కోటి కారులో కుంభమేళా మోనాలిసా..
## ఇప్పుడదే నా ఫ్రెండ్!

ఒక్క ఛాన్స్.. ఒకే ఒక్క ఛాన్స్ అంటూ సినిమా అవకాశాల కోసం ఏళ్లతరబడి ఆఫీసుల చుట్టూ తిరిగేవారు చాలామంది. అదే సమయంలో అనుకోకుండా సినిమాల్లోకి వచ్చేవారూ బోలెడంతమంది ఉన్నారు. అందులో కుంభమేళా వైరల్ గర్ల్ మోనాలిసా ఒకరు. కుంభమేళాలో పూసలమ్ముకున్న ఈమె.. సోషల్ మీడియా పుణ్యమా అని ఒక్కసారిగా వైరల్ అయిపోయింది. సినిమా అవకాశాలు ఆమె తలుపుతట్టాయి.

**కుంభమేళాతో పాపులర్**

షాప్ ఓపెనింగ్స్‌కు రమ్మని ఆహ్వానాలు అందాయి. అవన్నీ చూసి పొంగిపోయింది మోనాలిసా. జీవితం ఇచ్చిన అవకాశాన్ని ఎందుకు వదులుకోవాలని ఆలోచించింది. అన్నింటినీ నవ్వుతూ ఓకే చెప్పింది. ఈ మధ్యే ఆమె నటించిన ఫస్ట్ సాంగ్ 'సాదగి' కూడా రిలీజైంది. అందులో మోనాలిసా మరింత అందంగా కనిపించింది. కాకపోతే యాక్టింగ్ ఇంకాస్త మెరుగవ్వాల్సిన అవసరం ఉందన్న కామెంట్లు వినిపించాయి. కెమెరా ముందు నటించడం అదే తనకు తొలిసారి.

**నా ఫ్రెండ్.. కెమెరా**

ఈ అనుభవం గురించి మోనాలిసా మాట్లాడుతూ.. సింగర్ ఉత్కర్ష్ శర్మ సర్ తన పాటలో నటించాలని అడగ్గానే ముందు మా ఇంట్లో మాట్లాడమన్నాను. వారు ఓకే అన్న తర్వాతే నేను అందులో యాక్ట్ చేశాను. అలాగే సాంగ్ కూడా నాకెంతగానో నచ్చింది. ఇప్పుడు కెమెరానే నా ఫ్రెండ్. కెమెరా ఎదుట కళ్లతోనే భావాలు పలికించడం, డ్యాన్స్ చేయడం కొత్తగా బాగుంది అని చెప్పుకొచ్చింది.

**రూ.1 కోటి కారులో మోనాలిసా**

ఇదిలా ఉంటే తాజాగా మోనాలిసా ఖరీదైన కారులో కూర్చున్న ఫోటో ఒకటి నెట్టింట వైరలవుతోంది. ఈ కారు ధర దాదాపు రూ.1 కోటి ఉండొచ్చని అంటున్నారు. రూ.100కు పూసల దండ అమ్ముకున్న మోనాలిసా ఇప్పుడు కోటి విలువైన కారులో తిరుగుతుండటం చూసి ఫ్యాన్స్ సంతోషంగా ఫీలవుతున్నారు. మోనాలిసా ప్రస్తుతం ద డైరీ ఆఫ్ మణిపూర్ అనే సినిమా చేస్తోంది.



# ఆ పేరు చాలా స్పెషల్..
## రష్మిక మూవీపై విజయ్ దేవరకొండ..!

నాగార్జున, ధనుశ్ హీరోలుగా శేఖర్ కమ్ముల దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'కుబేర'. రష్మికా మందన్నా హీరోయిన్‌గా నటించింది. ఈ చిత్రంలో ధనుశ్ బిచ్చగాడి పాత్రలో అభిమానులను మెప్పించనున్నారు. ధనిక-పేద తేడా, రూ.10 వేల కోట్ల స్కామ్ బ్యాక్ డ్రాప్ స్టోరీతో తీసిన ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చేస్తోంది . సునీల్ నారంగ్, పుస్కూరు రామ్మోహన్ రావు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 20న తెలుగు, తమిళ, హిందీ భాషల్లో విడుదల కానుంది. ఈ నేపథ్యంలోనే టాలీవుడ్ హీరో విజయ్ దేవరకొండ చేసిన ట్వీట్ వైరల్‌గా మారింది. బిగ్ స్క్రీన్‌పై సందడి చేయబోతున్న కుబేర చిత్రానికి అభినందనలు తెలిపారు. శేఖర్ కమ్ముల సర్ పేరు నా ప్రయాణంలో ఎల్లప్పుడూ ప్రత్యేకం.. నాలాంటి చాలా మంది నటులకు ఆయనే ఆదర్శమని కొనియాడారు. ఈ మూవీలో ధనుశ్, నాగార్జున సర్, రష్మిక లాంటి స్టార్లను చూసేందుకు ఎంతో ఆత్రుతగా ఎదురు చూస్తున్నానని ట్వీట్ చేశారు. ఈ సందర్భంగా కుబేర టీమ్‌కు ఆల్ ది బెస్ట్ అంటూ పోస్ట్ చేశారు. ఈ చిత్రాన్ని థియేటర్లలో చూసేందుకు ఇక వేచి ఉండలేను అంటూ రాసుకొచ్చారు. రష్మిక మూవీకి విజయ్ దేవరకొండ ఆల్ ది బెస్ట్ చెప్పడంపై అభిమానులు ఫుల్ ఖుషీ అవుతున్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com

మహా పత్రిక

WWW.MAHAADAILY.COM | జనరల్ వార్తలు | GENERAL NEWS | గురువారం, హైదరాబాద్ | 19-06-2025

ANN తెలుగు

## జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను

# వేగవంతం చేయాలి

### జిల్లాలో 56.33% ఇండ్ల గ్రౌండింగ్ పనులు పూర్తి

- బేస్మెంట్ లెవెల్ పూర్తి వాటికి బిల్లులు
- ఈనెల 25 వరకు మంజూరైన ఇండ్ల పనులు మొదలుపెట్టాలి
- లేనియెడల రద్దుచేసి వేరొకరికి అవకాశం
- మహిళ బ్యాంక్ ఖాతాలో నిధులు జమ
- ఈనెల 20 నుండి 28 వరకు పారిశుద్ధం పై ప్రత్యేక డ్రైవ్
- జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పనులను వేగంగా గ్రౌండింగ్, బేస్మెంట్ లెవెల్ నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని, బేస్మెంట్ లెవెల్ పూర్తయిన వాటికి బిల్లులు చెల్లించాలని జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో ఇందిరమ్మ ఇండ్లు గ్రామ, మున్సిపల్ పరిధిలో పారిశుధ్యం పై, వనమహోత్సవం కార్యక్రమం పై జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో ఇప్పటివరకు 56.33% ఇండ్ల గ్రౌండింగ్ అయ్యాయని, 43% ఇంకా కావలసి ఉందని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఈ పథకానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. జూన్ 25 వరకు ఎలాంటి ఇండ్లు పెండింగ్ లేకుండా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు చేపట్టాలని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో అతి బీద కుటుంబం మహిళకు బ్యాంక్ లింక్ రుణాలు మంజూరు చేయాలని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్ పూర్తి అయిన 15 రోజులలో రెంటల్ లెవెల్ కు వెళ్లే విధంగా పనిచేయాలని తెలిపారు. ఈనెల 25 లోపు ఇంకా ప్రారంభించని ఇండ్ల జాబితాను రద్దుచేసి కొత్త వారికి అవకాశం ఇవ్వాలని అన్నారు. ఇప్పటి వరకు తక్కువ గ్రౌండ్ చూపించిన మొయినాబాద్, నార్సింగ్ ఇబ్రహీంపట్నం, ఆదిభట్ల మున్సిపాలిటీల అధికారులను వెంటనే చేయించాలని లేనియెడల తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. ఇండ్ల నిర్మాణంలో ఇసుకకు సంబంధించి అందుబాటులో ఉన్న ఇసుకను ఎక్కడి నుంచైనా తీసుకోవచ్చు అని తెలిపారు. వర్షాకాలం ప్రారంభమైనందున గ్రామ మున్సిపల్ పరిధిలో ఈనెల 20 నుండి 28 వరకు పారిశుద్ధం పై ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. డ్రైన్లు క్లీన్ చేయించి రోడ్లకు ఇరువైపుల పిచ్చి మొక్కలు లేకుండా పరిశుభ్రంగా ఉంచాలని తాగునీరు కలుషితం కాకుండా లీకేజీ లేకుండా చూడాలని గ్రామపంచాయతీ మున్సిపల్ లలో అన్ని గుంతలు కల్వర్టులు పూడ్చాలని గ్రామాలలో వీధి దీపాలు లేని ప్రాంతాల్లో కొత్తవి ఏర్పాటు చేయాలని ఈ విషయంపై పెద్ద ఎత్తున స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. దీన్ని పరిశీలించుటకు జులై 1 2 3 తేదీల్లో గ్రామాలకు మున్సిపాలిటీలకు ఆడిట్ టీమ్లు సందర్శించి పరిశీలిస్తారని కలెక్టర్ తెలిపారు. ఈ డ్రైవ్ లో సరిగా పని చేయని అధికారులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన అన్నారు. వన మహోత్సవం పై కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నిర్దేశించిన లక్ష్యాలను అధికారులు పని చేయాలని సూచించారు. మొక్కలు నాటేందుకు అనువైన స్థలాలను గుర్తించాలని, గుంతలు ఏర్పాటు చేయాలని, అవసరమైన మొక్కలు నర్సీలలో అందుబాటులో ఉండే విధంగా చూడాలని కలెక్టర్ అన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఓ సంగీత, జెడ్పీ సీఈవో కృష్ణా రెడ్డి, సోషల్ వెల్ఫేర్ అధికారి రామారావు, డిపిఓ సురేష్ మోహన్, మైనార్టీ వెల్ఫేర్ అధికారి నవీన్ కుమార్ రెడ్డి, బీసీ సంక్షేమ అధికారి కేషురామ్, పిడి హౌసింగ్ హనుమంతు నాయక్, గ్రామీణ అభివృద్ధి శాఖ పిడి శ్రీలత మెప్మా పిడి మల్లీశ్వరి, డిఈఓ సుశీందర్రావు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అంతా - నా ఇష్టం- అడిగేది ఎవరు??

### శివారంపల్లిలో సంవత్సరాలుగా వేస్తున్న సీసీ రోడ్లు

ఇష్టానుసారం పనులు..చూసి చూడనట్టు వదిలేస్తున్న జిహెచ్ఎంసి అధికారులు

ట్రాఫిక్ సమస్యతో నరకయాతన పడుతున్న వాహనదారులు





**రాజేంద్రనగర్, మహా ;** శివారంపల్లి గ్రామంలో సంవత్సరాలుగా జరుగుతున్న సీసీ రోడ్ పనులు. కాంట్రాక్టర్ సడన్‌గా సీసీ రోడ్డు పనులు సగంలోనే నిలిపివేయడంతో వాహనదారులు స్థానికులు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. కాంట్రాక్టర్లు గత కొన్ని సంవత్సరాలుగా శివరాంపల్లి కి వెళ్లే రహదారిలో సీసీ రోడ్డు పనులను వేస్తూ నిలుపుతు, సంవత్సరాల పొడవున కాంట్రాక్టర్లు ఇష్టానుసారంగా పనులు వేస్తూ, నిలిపివేయడంతో స్థానికులు వాహనదారులు రోడ్డుపై వెళ్లాలంటే గంటల తరబడి ట్రాఫిక్ జాములో ఇరుక్కుపోతున్నారు. రోడ్డు పనులను అర్థాంతరంగా నిలిపివేయబడటంతో నిత్యం వాహనదారులు, స్థానికులు అసౌకర్యానికి గురవుతున్నారు. శివరాంపల్లి ఊరికి బస్సులు రాకపోవడంతో విద్యార్థులు స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎందుకుంటున్నారు. సంవత్సరాలు గడిచిన రోడ్డు పనులు ఇప్పటికీ పూర్తి చెయ్యలేక పోయారు. జిహెచ్ఎంసి అధికారుల నిర్లక్ష్యమే కారణంఅని స్థానికులు మండిపడుతున్నారు. సిసి రోడ్డుకు టెండర్ లేకుండా ఇష్టానుసారంగా సంవత్సరాల నుంచి పలువురు కాంట్రాక్టర్లు కొద్దికొద్దిగా వేస్తూ కాలయాపన చేస్తున్నారు, పలు మార్లు జిహెచ్ఎంసి కార్యాలయంలో ఫిర్యాదులు చేసిన లాభం లేకుండా పోయింది. వర్షాకాలం మొదలవుతున్న రోడ్డుపనులు నిలిపివేయడంతో పరిస్థితి మరింత దుర్భరంగా మారిందన్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి రోడ్డుపనులు పూర్తి చేయాలని స్థానికులు వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు.

## వీవీఐపీ అతిథి గృహం నిర్మాణంపై నిపుణుల కమిటీ

**హైదరాబాద్, మహా :** ప్రభుత్వ, ప్రైవేటు రంగాలకు చెందిన ఉన్నత స్థాయి ప్రతినిధులతో సమావేశాలు, మరియు వారి వసతి కోసం డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ (ఎంసీఆర్‌హెచ్ఆర్‌డీఐ) ప్రాంగణంలో చేపడుతున్న వీవీఐపీ గెస్ట్ హౌస్ నిర్మాణంలో భాగంగా చేపడుతున్న నిర్మాణాలపై నిపుణుల కమిటీ నియమించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుకు ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంవో) సూచించింది. వీవీఐపీ గెస్ట్ హౌస్ నిర్మాణంలో భాగంగా చేపడుతున్న నిర్మాణాల అవసరం, వాటికి చేస్తున్న వ్యయంపై మదింపునకు నిర్మాణ రంగ నిపుణులతో కమిటీ నియమించాలని సీఎంవో పేర్కొంది. నిపుణుల కమిటీ ఆ నిర్మాణాలను పరిశీలించి తమ సిఫార్సులతో నివేదిక సమర్పించాలని సీఎంవో కోరింది.

## కొండాపూర్ ఫ్లై ఓవర్ కు పిజెఆర్ పేరు?

### మరో భారీ ఫ్లై ఓవర్ ప్రారంభోత్సవానికి సిద్ధం

**హైదరాబాద్, మహా :** హైదరాబాద్ లోని మరో భారీ ఫ్లైఓవర్ రెడీ అయింది. ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న గచ్చిబౌలికొండాపూర్ ఫ్లైఓవర్ ప్రారంభానికి ముహూర్తం ఖరారు అయింది. ఈనెల 28న సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఈ ఫ్లైఓవర్ ప్రారంభం కానుంది. దీనికి దివంగత కాంగ్రెస్ నేత, మాజీ మంత్రి పి.జనార్ధన్ రెడ్డి ఫ్లైఓవర్ గా నామకరణం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించినట్లు సమాచారం. ఈమేరకు ప్రారంభోత్సవ ఏర్పాట్లు పూర్తి చేయాలని మేయర్ విజయలక్ష్మి జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్వీ కర్ణన్ కు ఆదేశాలు జారీ చేశారు. ఈ ఫ్లైఓవర్ ద్వారా గచ్చిబౌలి జంక్షన్ వద్ద సమస్య చాలా వరకు తీరుతుంది. హైటెక్ సిటీ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ కు కనెక్టివిటీ ఎంతో మెరుగుపడుతుంది.

### బనకచర్ల భేటీకి కాంగ్రెస్, బిజెపి, బిఆర్ఎస్ ఎంపీలు

బనకచర్ల భేటీకి కాంగ్రెస్ పార్టీ ఎంపీలతో పాటు బిజెపికి చెందిన డికె అరుణ, రఘునందన్ రావు, బిఆర్ఎస్ నుండి వద్దిరాజు రవిచంద్ర, దామోదర్ రావు హాజరయ్యారు. డికె అరుణ, రఘునందన్ రావు తెలంగాణ ప్రయోజనాల విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి సహకరిస్తామన్నారు.

# అధికారులు బీ అలర్ట్

### ఆర్ అండ్ బీ అధికారులకు మంత్రి కోమటిరెడ్డి

**హైదరాబాద్, మహా :** వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో ఆర్ అండ్ బి అధికారులు క్షేత్ర స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం హైదరాబాద్ లో ఆర్ అండ్ బి శాఖ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గత అనుభవాల దృష్ట్యా వర్షాకాలంలో ఆర్ అండ్ బి అధికారులు పూర్తి అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లా హెడ్ క్వార్టర్ లో అందుబాటులో ఉంటూ క్షేత్ర స్థాయిలో రోజువారీ పర్యవేక్షణ చేయాలనీ సూచించారు. రాష్ట్ర స్థాయిలో చీఫ్ ఇంజనీర్లు, జిల్లాల్లో సూపరిండెంట్ ఇంజనీర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, క్షేత్ర స్థాయి ఇంజనీర్ల తో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ భారీ వర్షాలు,వరదల వల్ల రోడ్ల కనెక్టివిటీ కి ఎక్కడా ఇబ్బంది రాకుండా పర్యవేక్షణ చేయాలన్నారు. వరదల వల్ల డ్యామేజ్ అయిన రోడ్లు వెంటనే రీ స్టోర్ చేసేందుకు వీలుగా సాండ్ బ్యాగ్స్, సిమెంట్ బ్యాగ్స్ ఏ.ఈ స్థాయిలో అందుబాటులో ఉండే ఏర్పాట్లు చేయాలని అన్నారు. ఉదృతంగా ప్రవహించే నదులు వాగులు వద్ద బ్రిడ్జిలు, కల్వర్టులు పై ప్రజా రవాణాకు ఇబ్బందులు లేకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, అందుకు అనుగుణంగా జిల్లా స్థాయిలో కంట్రోల్ రూమ్ లు ఏర్పాటు చేసి రాష్ట్ర ప్రధాన కార్యాలయ కంట్రోల్ సెంటర్ కు అనుసంధానం చేయాలని సూచించారు. వెంటనే సమస్య పరిష్కారం అయ్యేలా రాష్ట్ర స్థాయిలో అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. గతంలో ఏర్పడిన గుంతల రోడ్లు పూడ్చేందుకు ఆర్ అండ్ బి ఆధ్వర్యంలో యుద్ధ ప్రాతిపదికన మరమ్మత్తు చర్యలు చేపట్టామని,ఇంకా పెండింగ్ లో ఉన్న రోడ్డు ప్యాచ్ వర్క్ లపై అధికారులను ఆరా తీశారు. దినపత్రికల్లో వచ్చిన వార్తా కథనాల అంశాల్ని ప్రస్తావించి ఆయా రోడ్ల పరిస్థితి అధికారులను అడిగి తెలుసుకున్నారు.

### కన్నుల పండుగగాశ్రీ పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయ

# వార్షికోత్సవ వేడుకలు



**తిమ్మాపూర్, మహా:** తిమ్మాపూర్ మండలం అలుగునూర్ పరిధిలోని శ్రీ వెంకటేశ్వర కాలనీలో గల శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి, శ్రీరామ సాయి , శ్రీ సంతాన నాగేంద్ర స్వామి దేవాలయ 14వ వార్షికోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా, కన్నుల పండుగ జరిగాయి. వేద పండితులు శ్రీ తిరునగిరి వెంకటాద్రి స్వామి, శ్రీ తిరునగిరి చక్రధర స్వామి ల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు , అభిషేకం , హోమ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి ధర్మకర్తల సేవా సమితి అధ్యక్షులు చిందం నరసయ్య, దేవాలయ కమిటీ బాధ్యులు గడప శేఖర్, సిరిపురం శ్రీనివాస్, సల్ల మల్లేశం, ఐతం వెంకన్న, బండి కుమార్, నూనె మధు , కొట్టాల శ్రీనివాస్ , వరాల నరసింగం, వకుళభరణం శ్రీనివాస్, బూట్ల కరుణాకర్, నారాయణ , సుధాకర్ రెడ్డి, రాజిరెడ్డి, చిందం అంజి , కొత్తూరి శ్రీనివాస్, జంగపల్లి వినయ్, ప్రశాంత్, స్వామి, రమేష్, వెంకటేష్ తదితరులతోపాటు శ్రీ వెంకటేశ్వర కాలనీ మహిళలు , అశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

### లండన్‌కు కేటీఆర్ 24న తిరిగి హైదరాబాద్‌కు

హైదరాబాద్, మహా : బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బుధవారం రాత్రి లండన్ పర్యటనకు వెళ్లారు. ఇంగ్లండ్‌లోని ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో ఆక్స్‌ఫర్డ్ ఇండియా ఫోరం ఆధ్వర్యంలో ఈ నెల 20, 21 తేదీల్లో నిర్వహించే సదస్సులో ఆయన పాల్గొననున్నారు. 'ఫ్రాంటియర్ టెక్నాలజీస్ ఫర్ డెవలప్‌మెంట్ ఇన్ ఇండియా' అనే అంశంపై తెలంగాణ అభివృద్ధి కోసం అనుసరించిన విధానాల గురించి ప్రసంగించనున్నారు. ఈ నెల 24న హైదరాబాద్ కు తిరిగి చేరుకోనున్నారు.



### సీసీ రోడ్లు అండర్ గ్రౌండ్ డ్రైనేజీలకు ప్రణాళికలు సిద్ధం చేయండి

#### కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి

**రాజేంద్రనగర్ మహా ;** మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలో కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి హెచ్ఎండబ్ల్యూఎస్, ఎస్ బి, అధికారులతో కలిసి బుధవారం హౌసింగ్ బోర్డ్ లేక్ వ్యు కాలనీలో పర్యటించారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సీసీ రోడ్లు లేకపోవడంతో మురుగునీరు గుంతలలో నిండంతో కాలనీవాసులు అనేక అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సిస్టం, సిసి రోడ్లు ప్రణాళికలు సిద్ధం చేయాలని బిజెపి రాజేంద్రనగర్ ఇన్చార్జ్ కార్పొరేటర్ తో కల శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

## సొమ్ము కేంద్ర ప్రభుత్వానిది,

# సోకు రాష్ట్ర ప్రభుత్వానిది

### ఇందిరమ్మ ఇల్లు కు ప్రతి పైసా కేంద్ర ప్రభుత్వాన్ని పేరు మార్చి గ్లోబల్ ప్రచారం చేస్తున్నారని రాజ్ భూపాల్ గౌడ్ మండిపడ్డారు



**బాలాపూర్ మహా:** ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద కేంద్ర ప్రభుత్వం పేద ప్రజలకు ఇల్లును కట్టిస్తుంటే,కాంగ్రెస్ ప్రభుత్వం తమ కట్టిస్తున్నట్టుగా ఇందిరమ్మ ఇల్లు పేరు పెట్టుకుని ప్రజలను మోసం చేస్తున్నారని రంగారెడ్డి జిల్లా రూలర్ బీజెపి అధ్యక్షుడు పతంగి రాజ్ భూపాల్ గౌడ్ తెలిపారు. మీర్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షుడు పసునూరి బిక్షపతి చారి ఆధ్వర్యం లో కేంద్రం లో బీజెపి ప్రభుత్వం 11 సంవత్సరాల లో ప్రజలకు చేసిన కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఈ నాయకులకు,కార్యకర్తలకు దిశా నిర్దేశం కోసం కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు బిక్షపతి చారి తెలిపారు. మోడీ నాయకత్వం లో భారతదేశాన్ని విశ్వ గురువుగా నిలబెట్టారని,పేదల సంక్షేమం, అభివృద్ధి కోసం బీజేపీ ప్రభుత్వం పని చేస్తుందని రాజ్ భూపాల్ గౌడ్ తెలిపారు. ప్రధాని నరేంద్ర మోడీ ఇస్తున్న ఇల్లుల కు ఇందిరమ్మ బొమ్మలు వేస్తే బీజెపి నాయకులు కార్యకర్తలు చూస్తూ ఊరుకోరని రాజ్ భూపాల్ గౌడ్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారం లో రావడం కోసం,ప్రజలకు తప్పుడు హామీలు ఇచ్చి ఇప్పుడు నిధులు లేవు అంటే ఊరుకోమని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీ లను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో కార్పొరేషన్ మాజీ అధ్యక్షులు పెండ్యాల నరసింహ,బీజేపీ సీనియర్ నాయకుడు కోలన్ శంకర్ రెడ్డి,గాజుల మధు, సోమేశ్వర్, మాజీ కార్పొరేటర్లు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమం కోసం కట్టుబడి ఉన్నాం

### షాద్ నగర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్

రైతుల ఖాతాలో జమవుతున్న రైతు భరోసా డబ్బులు

నియోజకవర్గ వ్యాప్తంగా 55 వేల 925 మంది రైతుల ఖాతాలో 37 కోట్ల 80 లక్షలు..



**షాద్ నగర్, మహా:** వానాకాలం సీజన్ కు రైతు పెట్టుబడి సాయం కింద రైతు భరోసా నిధుల విడుదల కొనసాగుతోందనీ రైతు సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని షాద్ నగర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా నిధులను విడుదల చేసిన నేపథ్యంలో మహ్మద్ అలీ ఖాన్ బాబర్ మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. షాద్ నగర్ నియోజకవర్గంలో 55,925 మంది రైతులకు ఖాతాల్లో 37 కోట్ల 80 లక్షల 75 వేల 627 రూపాయలు జమ చేసినట్లు మహమ్మద్ అలీఖాన్ బాబర్ తెలిపారు. రైతు నేస్తం కార్యక్రమం ద్వారా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు భరోసా నిధులు తొమ్మిది రోజుల్లో జమ చేయనున్నట్లు తెలిపారని, ముఖ్యమంత్రి ప్రకటన నేపథ్యంలో ప్రభుత్వం నుంచి మొదటి రోజు షాద్ నగర్ నియోజకవర్గ రైతుల ఖాతాల్లో సాగు సాయం అందినట్లు తెలిపారు. నియోజక వర్గ పరిధిలోని ఫరూక్ నగర్ మండల పరిధిలోని 14 వేల 36 మంది రైతులకు ఖాతాలో 9 కోట్ల నాలుగు లక్షల 75 వేల 395 రూపాయలు, జిల్లేడు చౌదరిగూడ మండల పరిధిలోని 9002 రైతుల ఖాతాలో 6 కోట్ల 41 లక్షల,11 వేల 479 రూపాయలు, కొందూరు మండలం పరిధిలోని 8783 మంది రైతుల ఖాతాలో 6 కోట్ల 16 లక్షల 75 వేల 942 రూపాయలు, కేశంపేట మండల పరిధిలోని 12,839 మంది రైతుల ఖాతాలో 9 కోట్ల 39 లక్షల 82 వేల948 రూపాయలు, కొత్తూరు మండల పరిధిలోని 5,143 మంది రైతుల ఖాతాలో రెండు కోట్ల 97 లక్షల 77 వేల,711 రూపాయలు, నందిగామ మండల పరిధిలోని 5,842 మంది రైతుల ఖాతాలో మూడు కోట్ల 30 లక్షల 52,156 రూపాయలు జమ అయినట్లు తెలిపారు. రోజువారీగా మరింత మంది రైతుల ఖాతాల్లో పెట్టుబడి సాయం జమ చేస్తామని తెలిపారు. ఇంకా నియోజకవర్గంలో రైతుల ఖాతాల వివరాలు అందించని వారు వెంటనే మండల వ్యవసాయ విస్తరణ అధికారికి లేదా మండల వ్యవసాయ అధికారికి అందించాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న పెట్టుబడి సాయాన్ని లబ్ధి పొందాలని రైతులకు సూచించారు.

**రైతు భరోసా విషయంలో వాళ్లు ప్రశ్నిస్తే ఎలా..?**

రైతుభరోసా విషయంలో బీఆర్ఎస్ నాయకులకు తమ ప్రభుత్వాన్ని ప్రశ్నించే నైతిక హక్కు లేదని రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్ దుయ్యబట్టారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక సందర్భంలో మినహా వానాకాలం రైతుబంధు సహాయం ఎప్పుడు సాగు కాలానికి ముందుగా ఇవ్వలేక పోయిందని ప్రతిసారి ఆలస్యంగానే రైతుబంధు నిధులు రైతుల ఖాతాలలోకి జమ చేశారని విమర్శించారు. అదికూడా 10వ నెల వరకు కొనసాగేదని అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు అంతంతమాత్రంగానే ఉన్నా మా ప్రభుత్వంలో మాత్రం రైతులకు ఏ పథకాలను ఆపడం లేదన్నారు. రైతుల సంక్షేమం కోసం మా ప్రభుత్వం కట్టుబడి ఉందనేందుకు ఇప్పటికైనా బీఆర్ఎస్ నాయకులు ఆత్మ విమర్శ చేసుకొని మా ప్రభుత్వంపై విమర్శలు మానుకోవాలన్నారు. లేదంటే బీఆర్ఎస్ ను తెలంగాణ రైతాంగం ఎప్పటికీ క్షమించరని హెచ్చరించారు. ఎలాంటి పరిస్థితులలోనైనా తెలంగాణ రైతాంగం కోసం మా ప్రభుత్వం నిలబడుతుందని, వారి సంక్షేమమే మా ప్రభుత్వం తొలి ప్రాధాన్యత ఇస్తుందని చెప్పారు. రైతుల సంక్షేమం విషయంలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు..

## షాద్ నగర్ లో ప్రైవేట్ స్కూల్స్ దందాలు.. ఎస్ఎఫ్ఐ షాద్ నగర్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఎంఈఓకు వినతి పత్రం

**షాద్ నగర్, మహా:** ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ప్రైవేట్ పాఠశాలల దందాలు నడుస్తున్నాయని ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు వడ్ల శ్రీకాంత్ ఆరోపించారు. బుధవారం మండల విద్యాశాఖ అధికారి మనోహర్ కు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ.. ప్రైవేట్ స్కూల్స్ విద్యార్థులకు ఆధునిక సౌకర్యాలు, మంచి మౌలిక వసతులు, మరియు నాణ్యమైన విద్యను అందిస్తామని చెప్పుకుంటాయి. కానీ, ఈ సౌకర్యాల పేరుతో వసూలు చేసే అధిక ఫీజులు తల్లిదండ్రులపై ఆర్థిక భారాన్ని మోపుతున్నాయి. ఫీజులలో ట్యూషన్ ఫీజు మాత్రమే కాకుండా, ప్రవేశ రుసుము, రవాణా రుసుము, కార్యకలాప రుసుము, మరియు నోట్ బుక్స్, యూనిఫామ్‌లు, పుస్తకాల కోసం అదనపు ఖర్చులు కూడా ఉంటాయి. ఈ ఖర్చులు మధ్యతరగతి మరియు తక్కువ ఆదాయ కుటుంబాలకు భరించలేని స్థాయిలో ఉంటాయి.నోట్ బుక్స్ ఖర్చు ఒక ఆందోళన ప్రైవేట్ స్కూల్స్ తరచూ విద్యార్థులకు నోట్ బుక్స్, పుస్తకాలు, మరియు ఇతర అవసరమైన సామగ్రిని తమ స్కూల్ నుండి మాత్రమే కొనుగోలు చేయమని బలవంతం చేస్తాయి. ఈ నోట్ బుక్స్ ధరలు సాధారణ మార్కెట్ ధరల కంటే చాలా ఎక్కువగా ఉంటాయి. ఉదాహరణకు, ఒక స్కూల్ అందించే నోట్ బుక్ ఇందులో స్కూల్ లోగో లేదా బ్రాండ్ పేరు ఉంటుందని చెప్పి, అధిక ధరను సమర్థించుకుంటాయి. ఈ విధానం తల్లిదండ్రులకు అనవసర ఖర్చును తప్పనిసరి చేస్తుంది.... షాద్ నగర్ లో కొన్ని ప్రైవేట్ పాఠశాలలు వారికీ ఎలా నచ్చితే ఆలా ఫీజులు వసూలు చేస్తూ పాఠ్యపుస్తకాలు మా దగ్గరే కొనాలి అని విద్యార్థుల తల్లిదండ్రులకు ఇబ్బంది కలుగజేస్తున్నారు... మరియు ఒక పేరుతో పెర్మిషన్ తీసుకొని ఇంకో పేరు పెట్టి విద్యార్థులను మరియు వారి తల్లిదండ్రులను మోసం చేస్తున్నారు కాబట్టి ఎంఈఓ ఈ విషయాలపై వెంటనే స్పందించాలి అని లేకుంటే ఎస్ఎఫ్ఐ గా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తాం అని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ టౌన్ కార్యదర్శి శివశంకర్, వినయ్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు..

